# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్ర మాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.

సంపాదకుడు :
ఆంధ్ర శేషగిరిరావు, బి. ఏ.

సంపుటము : ౪. యువ, కార్తీకము : నవంబరు, 1935. సంచిక : ౫.


## సంపాదకీయ సమాలోచన

### ౧. యుద్ధప్రారంభమునకు ఆనాడు ఆగష్టు, ఈనాడు అక్టోబరు :—

గత మహాసంగ్రామము ఆగష్టుమాసములో ప్రారంభమైనది; కొద్దిరోజులలో మహాసంగ్రామముగ మారగలదని రాజకీయవేత్తలు సూచించుచున్న నేటి ఇటలీఅబిసీనియా యుద్ధము అక్టోబరుమాసములో ప్రారంభమైనది. అక్టోబరు రెండవ తేదీని ఆసేతుహిమాచలము ప్రతిపట్టణమునగ్రామమున భారతీయులు శాంతిమహాదూతయగు గాంధిమహాత్ముని జయంత్యుత్సవములు జరిపి ఆ వృత్తాంతములను దినపత్రికలకు పంపి అవి మఱునాటి దినపత్రికలలో చదువ కుతూహలురై యుండిరి. మఱునాటి దినపత్రికలు ఆశాంతిదూతజయంత్యుత్సవములవార్తలతోబాటు భారతీయులు శాంతిదూతయగు గాంధిజయంత్యుత్సవములను జరిపిన అక్టోబరు 2-వ తేదీనే ఆఫ్రికాఖండమున ఇటలీఅబిసీనియాలకు సమరము ప్రారంభమైనదను వార్తనుకూడ కొనివచ్చినవి. అబిసీనియా దేశమున వానలు వెనుకపట్టుటతో ఇటలీసేనలు ముందునకు నడుచునని ముసోలినీనియంత లోగడ చెప్పియేయున్నాడు. మరియు ఆతనికి అక్టోబరు అచ్చివచ్చినమాసము. సరిగా పదమూడు సంవత్సరములకు పూర్వము ఇదే మాసమున ఇరువదిరెండవ తేదీని ఆతనిఆజ్ఞపై ఆతనిఅనుచరులు రోము మహానగరమునకు మహాప్రస్థానముగావించిరి. ఆ మహాప్రస్థానము ఫలముగా ఆరురోజులలో ఇటలీ మంత్రాంగమంతయు ముసోలినీ ముష్టిలో ఇమిడిపోయినది. 1922-వ సంవత్సరము అక్టోబరు 30-వ తేదీని ఇటలీరాజు ఇమాన్యూయల్ ముసోలినీమంత్రిత్వమును స్థిరపరచినాడు. ఆ అక్టోబరు మాసములో ముసోలినిగారి ఇటలీరాజ్యనియంతస్థానమునకు విఘ్నేశ్వరపూజ జరుగగా ఈ అక్టోబరుమాసములో ముసోలినీగారి ఇటలీసామ్రాజ్యస్థాపనాచార్య స్థానమునకు అంకురార్పణ జరుగగలదని ఆశించుట కవకాశమున్నది గదా ? 1896 లో ఏ అడోవాపాటిమీద అబిసీనియనులకు ఓడిపోయి పరాభవమును అనుభవించిరో ఆ అడోవాకోటపై ఇప్పుడు యుద్ధము ప్రారంభించిన మూడురోజులలో ఇటాలియనులు తమ బావుటాను ఎగురవైచి విజయోన్మాదులు కాగల్గిరి కదా !

### ౨. అప్పుడును ఇప్పుడును యుద్ధప్రారంభమునకు చిలిపికారణములే :—

అసలు కారణము లేవియగుగాక అప్పుడును ఇప్పుడును యుద్ధప్రారంభమునకు ప్రత్యేకకారణములు మిక్కిలి చిలిపివైనవిగనే ఉన్నవి. గత ఐరోపామహాయుద్ధము ఎట్లు ప్రారంభమైనది ? ఒక సెర్బియన్ విద్యార్థి ఒక ఆస్ట్రియన్ ఆర్చిడ్యూక్‌ను 1914 జూలైలో

హత్యచేయుటచేతనే గదా? మరి ప్రస్తుతయుద్ధమునకు ప్రత్యేక కారణములు అంతకంటెను చిలిపిదైనవి. ఇచట హత్యకాదు కారణము. ఒక ఆడదాని విషయకమైన తగాదా. ఇటాలియన్ వర్తకులకు చెందిన ఇతియోపియన్ సేవకులకును, అచటి ఇతియోపియన్ ప్రభుత్వోద్యోగులకును గోండార్‌లో 1934 నవంబరులో ఒక స్త్రీని గురించి తగాదా తటస్థించింది. సర్వసాధారణమైన ప్రయివేటు తగాదా, అందును స్త్రీవిషయకము. అయినను గిల్లికజ్జా పెట్టదలచిన ఇటాలియనులు అబిసీనియాయందలి తమ రాయబారులద్వారా గోరంతటి ఈ విషయమును కొండంతటిదిగా చేసిరి. దీనికితోడు ఊల్వాల్ వద్ద నీటితగువు. ఆ ఎడారిలో నీరు ఆవునేయికంటె విలువైనదే. కాని ప్రబలయుద్ధవ్యయమునకు సరితూగగల విలువగలదా? ఇట్లు ఊల్వాల్ నీరు, గోండార్ నీరజాక్షి ఈతగువునకు ప్రత్యేక కారణములు. నీటికొఱకు, నీరజాక్షిమూలమున రెండు ప్రత్యేకజాతులనడుమ యుద్ధము రేగినది.

౯. ముసోలినీ చెప్పుకారణములు మూడు:—

ఈ యుద్ధమునకు ముసోలినీ మూడుకారణములు చెప్పుచున్నాడు: (1) ఇటలీ రాజ్యమున పెచ్చుపెరుగుచున్న జనులకు తగిన వలసరాజ్యమును స్థాపించుట అత్యవసరమైనది. (2) ఆఫ్రికాఖండమున ఇటలీకి చెందిన ఇరిట్రియాసోమాలిల్యాండులను కలుపుచు అబిసీనియాగుండా రైలువేయవలసియున్నది. (3) అబిసీనియాదేశపు అనాగరకత ఇటలీనాయకత్వమున తొలగింపవలసియున్నది. ఈ మూడు కారణములు ఎంతవఱకు సమర్థనీయములో ఒక్కింత చూతము. మొన్నమొన్నటివరకును ఇటాలియనులను ఆతడు సంతానాభివృద్ధికై ముక్తకంఠముతో హెచ్చరించుచునే యున్నాడు. బహుళసంతానవతులకు బహుమానములనుకూడ ఇచ్చుపద్ధతి నెలకొల్పినాడు. ఎంతప్రయత్నించినను ఇటలీ జనాభా నాలుగు కోట్ల ఇరువదియేడు లక్షలకు మించలేదు. 1927 లో దక్షిణ అమెరికాలో ఇటాలియన్ కార్మికులకు గిరాకివచ్చినది. కాని అప్పటిలో ఇటలీదేశమునుండి అచటికి కార్మికులు పోగూడదని ముసోలినీ నిషేధించెను. జనాధిక్యమే ఒక సమస్యయై ఉండెనేని ఈ నిషేధమేల? ఇంతకును అబిసీనియా శీతోష్ణస్థితి ఇటాలియన్ కార్మికులకు ఎంతమాత్రమును తగినదికాదు. అదివలస ఎట్లుకాగలదు? జనాధిక్యసమస్య అను కారణమైన తరువాత రైలునిర్మాణ హేతువు. ఇటాలియన్ యిరిట్రియానుండి వారి సోమాలీల్యాండునకు అబిసీనియాగుండా రైలువేయుచో ఆరైలుబాట నిడివి ఇటలీనిడివికి మూడురెట్లుండును! మఱియు ఆబాట పోవు ప్రదేశమంతయు సైకతసముద్రము—ఎడారి—అట్టిచోట అట్టి రైలుబాట నిర్మింపబడుటకు ఎంత డబ్బు కావలయును? ప్రపంచమున రైలుబాటలన్నియు రోడ్డు మోటారు పోటీతో కొట్టుకాడుచున్న ఈ దినములలో అట్టి రైలుబాట నిర్మించి విశేషవ్యయమునకు పాల్పడుదునను ముసోలినీ మాటలు నిజములని ఎవరు నమ్ముదురు? ఇక మూడవకారణము. అబిసీనియా అనాగరక దేశమని గదా అత డనుచున్నది. అగుచో నతడేల 1923 లో సీఫారసుచేసి అబిసీనియాను జాతిసమితిలో సభ్యురాలిగా జేర్చినాడు? నాటికంటె నేడు అబిసీనియాలో నాగరకపు పద్ధతులెన్నో ప్రవేశపెట్టబడినవే. ఆ అనాగరక దేశముతో 1928 లో ఒడంబడిక గావించుకొనుట ఆతనికి అనాగరక మనిపింపలేదా? 1923 లో, 1928 లో లేని క్రొత్త అనాగరకత అబిసీ

నియాలో ఇప్పుడు ఏమిపొడసూపినది? ఇట్లీమూడుకారణములలో ఒక్కటికూడ నిలువ జాలినదిగాలేదు.

## ౯. అయితే యుద్ధమునకు అసలు కారణమేమి?

ముసోలినీ స్వార్థమే.నియంతృపాలనమే ఇటలీకి మోక్షము నీయగలదని ఆతడెన్నియో పర్యాయములు చేయెత్తి చెప్పియున్నాడు. 'మాకు పదిసంవత్సరముల గడువిండు, ఇటలీని భాగ్యవంతము చేయగలము. దానికి ప్రపంచమున ఉన్నతస్థానము సంపాదింతుము' అని ఆతడు 1924 లో అక్టోబరు 25-వ తేదీని ఎన్నికల ప్రచారసమయమున చాటినాడు. పదిఏండ్లు వచ్చి వెళ్ళినవి. అనుకున్నంతగా ఇటలీ భాగ్యవంతము కాలేదు. అనుకున్నంతగా ఇటలీకి ప్రపంచమున ఉన్నతస్థానము ఉపలబ్ధముకాలేదు. కాగా దేశమున అసంతృప్తి పొడసూపినది. పైగా 1933 జనవరినుండియు యూరపియన్ రాజ్యాంగరంగమున హిట్లరు ప్రతిభ హెచ్చుస్థాయిలో ఉంటున్నది. అధికారమునకు వచ్చిన రెండుసంవత్సరములలో హిట్లరు బ్రిటను, ఫ్రాంసు దేశములు యుద్ధవిముఖములై యుండుట గమనించి పోలెండుతో సంధిచేసుకొని; జాతిసమితికి స్వస్తిచెప్పి; వర్సలీస్ సంధిపత్రములోని ఆయుధనిషేధసూత్రముళను త్రోసిరాజని; ఆస్ట్రియా జెకోస్లావాకియా, రష్యారాజ్యములను వెఱగొందచేసి; ఫ్రాంసుబ్రిటనులను తిరస్కరించి, బ్రిటనుతో నావికసంధి గావించుకొని—ఉజ్వలప్రకాశము నందినాడు. మరితానో? ముసోలినీ ఇది అంతయు చూచినాడు. దేశమున ప్రజలను అసంతృప్తినుండి మభ్యపెట్టుటకును, విదేశములందు తాను జాజ్వల్యమానుడగుటకును యుద్ధప్రారంభముతప్ప అన్యశరణ్యములేదు అని అనుకొన్నాడు. అధికారమునకు వచ్చిన కొద్దిరోజులలో నెపోలియన్ ఫ్రెంచివారికిని, బిస్మార్కు జర్మన్ వారికిని క్రొత్తరాజ్యములు సంపాదించినారు. తాను ఇటలీనియంతయై పదమూడేండ్లయినది. ఇంతవఱకు నూత్నరాజ్యసంపాదనము జరుగలేదు. ఇక జాగుచేయుటకు వీలులేదు. వీలులేదు కావుననే యుద్ధము ప్రారంభించినాడు.

## ౯. జాతిసమితిసంఘుసభలో ఇటలీప్రతినిధి సిగరెట్టు:—

జాతిసమితి సంఘుసభలో ఇటలీనేరస్థురాలను ఉపపాదనపై వివిధరాజ్యప్రతినిధుల సమ్మతులు పుచ్చుకొనునప్పుడు ఇటలీప్రతినిధియగు బారన్ అలాయిసి అతి నిర్లక్ష్యభావముతో తనసిగరెట్టు నిప్పుఎరుపు ఎదుటివారికికనబడునంత గాఢమైన దమ్ముతీసి ఫ్రెంచిప్రతినిధియగు లావల్ నుచూచి మందహాసము చేసినాడట. తన జాతియొక్క చావు బ్రతుకులకు సంబంధించిన ఉపపాదన. అట్టి సమయమున అలవోకగా సిగరెట్టు కాల్చుటకు ఎంతటి చిత్తస్థైర్యముండవలెను! అయితే సిగరెట్టుకు సంబంధించిన ఈ చిత్తస్థైర్యము బారన్ అలాయిసి తన నాయకుడగు బెనిటోముసోలినినుండియే నేర్చుకొనియుండె ననవచ్చును. ముసోలినీ 'అవంతి' పత్రికా సంపాదకుడుగా నున్నప్పుడు సంపాదకీయవ్యాసములతోబాటుతనగదిలో బాంబులుకూడ తయారుచేయువాడు. ఒకప్పుడు ఒక మిత్రుడురాగా, కాల్చుచున్న సిగరెట్టు పక్కనిపెట్టి ఆతనితో సంభాషించుచున్నాడు. పక్కని పెట్టుటలో సిగరెట్టు బాంబుమీద పెట్టబడినది. ముసోలిని గమనించలేదు. మిత్రుడు గమనించినాడు. చెప్పినాడు. మరియొక

డైనయెడల అట్టి సమయమున ఎంత కంగారుపడును? ముసోలినీ ఎట్టి కంగారునులేకయే సిగరెట్టు తిరిగి అందుకొని దమ్ములుతీయుచు సంభాషణకు ఉపక్రమించినాడు. సిగరెట్టు నిప్పు తగిలి బాంబుప్రేలినచో ఏమైయుండునో అనుతలంపే ఆతనికి కల్గలేదు. అట్టి ముసోలినీ ప్రతినిధిఅయిన అలాయిసి సిగరెట్టు విషయములో ముసోలినీవలె ప్రవర్తించుటలో ఏమియు విశేషములేదు. విశేషమంతయు ఫ్రెంచిమంత్రియగు లావెల్‌నుచూచి మందహాసము చేయుటలోనే ఉన్నది.

**౬. ఈపుండు రేపినవాడు లావల్ మంత్రి.**

లావల్‌మంత్రి ఈసంవత్సరపు జనవరి మాసమున రోమునగరమున ముసోలినీతో మంతనములాడినాడు. ఫ్రెంచి ఇటలీ సరిహద్దులో సేనలు తొలగింపబడినవి. ఫ్రెంచిసేనలు జర్మను సరిహద్దుకు, ఇటలీసేనలు ఆస్ట్రియా సరిహద్దుకు పంపబడినవి. ఇటలీస్నేహముతో జర్మనీనుండి జడుపు కొంతతగ్గించుకొని లావల్ యిందుకు ప్రతిఫలముగా నిటలీకి అబిసీనియా విషయములో హుషారు పుట్టుటకు అవకాశమిచ్చినాడు. అది యింతకు తెచ్చినది. బ్రిటన్ యిటలీకి ఎదురుతిరుగుటతో లావల్ యిఱుకునబడినాడు. జనవరి నాటికి లేని ప్రధానామాత్య పదవి తనకిప్పుడు లభ్యమైనది. అయినను ఏమిసంతోషము? తనకు బ్రిటన్ స్నేహము ఇటలీస్నేహము రెండునుకావలెను. వీనిలో ఏఒకటిగాని జర్మనీతో కలియరాదు. కలియరాదు కావుననే అతడు ఇంగ్లండుచెప్పినిదానికి తలఊపుచు తాను జాతిసమితి సంఘసభలో ఈయదలచిన ఉపన్యాసమును వ్రాసి ముందు ముసోలినీకి చూపినాడు— కలియరాదు కావుననే అబిసీనియాలో మారణహోమమంత్రములును, జాతిసమితిలో శాంక్షన్‌ల హోమమంత్రములును వినదించుచున్నను వినిపించుకొనక లావల్ తన ముక్తకంఠముతో ఇంకను సంధిమంత్రములు పఠించుచున్నాడు. జాతిసమితిలో అందరు ప్రతినిధులుండగా ఒక్కలావల్‌మంత్రినేచూచి బారన్ అలాయిసి నాడు ఎందుకు మందహాసముచేసినాడో ఇపుడు తేటతెల్లమగుచున్నది.

**౭. డెక్కన్ అస్యూరెన్సు కంపెనీవారి అభివృద్ధి :—**

ఇన్సూరెన్సు వ్యాపారనిపుణులును, 'ది ఇండియన్ పోలసీహోల్డర్సు రివ్యూ' సంపాదకులును, ఆంధ్రాభిమానులును అగు శ్రీయుత శీలంశెట్టి గోవర్ధనరావుగారు స్థాపనాచార్యులుగా—ఆంధ్రదేశపు భీమాకేంద్రమగు బెజవాడ ప్రధానకార్యస్థానముగా నెలకొల్పబడిన డెక్కన్ అస్యూరెన్సు కంపెనీవారి మూడువత్సరముల అభివృద్ధిని 30-9-1935 తేదీని ప్రకటింపబడిన ఈక్రిందిపట్టిక తెలుపుచున్నది.

| | | | |
|---|---|---|---|
| జారీచేసిన పట్టాలు | 1343 | గవర్నమెంటు సెక్యూరిటీలు | 43,000 |
| పెయిడప్ వ్యాపారము | 12,00,000 | లైఫ్ ఫండ్ | 32,000 |
| సాలీనా ప్రీమియం రాబడి | 49,000 | అంగీకరింపబడి చెల్లింపబడిన క్లైములు | 4,500 |

ఇట్లే ఈ ఆంధ్రభీమాసంస్థ క్రమాభివృద్ధి నందుచు ఆంధ్రుల భీమావ్యాపారనైపుణ్యమునకును, వారి స్వదేశీభీమావ్యాపారాభిమానమునకును నిదర్శనమై వెలయుచుండుగాక యని 'ఆంధ్రభూమి' మనఃపూర్వకముగ కోరుచున్నది.

# కీ. శే. కపిలవాయి రామనాథశాస్త్రి

అలనాడు త్యాగరాజస్వామి తన తెనుగు కీర్తనలచే అరవలను పాతకులనుగా దిద్ది తీర్చినాడు. ఈనాడు రామనాథశాస్త్రి తన ఆంధ్రగానముచే అరవలను శ్రోతలనుగా తీర్చి కూర్చినాడు ఇట్లు నేటి ఆంధ్రకీర్తిల తకు పట్టుకొమ్మలైన వారిలో నొకడైన రామనాథశాస్త్రి అక్టోబరు 1-వ తేది మంగళవారము 11 గంటలకు దివంగతుడైనాడు.

... ... ...

మద్రాసులో రామనాథశాస్త్రి ఒక ప్రత్యేక సమస్య. అతను తెనుగువాడు. అతనుపాడేది తెనుగుపాట. అయినా మదరాసులో అతడు వచ్చాడంటే తెనుగువాడికి టిక్కెట్టు దొరికేదికాదు. బోడిగుండ్లతో, గూడ కట్లతో, తడు కాసట బీసటతో అరవవారు హాల్లో క్రిక్కిరిసిపోయేవారు. రవంతేకపోవడంచేత అరవలైన వారికి రామనాథశాస్త్రి కంఠరవం ఎంతేనా ఆనందాన్ని కొలిపేది.

... ... ...

ఇటీవల రామనాథశాస్త్రి స్టేజిమీద నుంచోలేని నీరసంలో పడ్డాడు. నుంచో లేను కూర్చుని పాడతానంటే 'మహాప్రభో! కూర్చునైనాసరే రెండు ముక్కలు వినిపించండి' అని అగస్త్యులవారి శిష్యులైన అరవలు ఈ ఆంధ్రగాయకుడికి దాసోహం చేశేవారు. అతని పాటంటే వారికి అంతప్రీతి.

... ... ...

చనిపోవడానికి కొద్దికాలంముందు ఈ మహనీయుడు ఆంధ్రులకు మరవరాని బహుమానం ఒకటి చేసినాడు. అది లోకప్రసిద్ధికాంచిన కృష్ణతులాభారం అనే తెనుగుటాకీలోని అతని నారదవేషం. ఈ బహుమానానికి రెండుకోట్లకు పైబడిన ఆంధ్రులలో ఒక్కడుకూడా ఆనందించలేదు. ఈ నారదవేషంతో అతని రంగమార్తాండత్వం చాలవఱకు మాగువారింది అనకతీరదు.

... ... ...

అసలు రామనాథశాస్త్రి అనడంతోటే గ్రామఫోనుపాటలు జ్ఞాపకం వస్తాయి. అతని గ్రామఫోనురికార్డులు ఆంధ్రేతరులచేతను, ఆంధ్రేతరప్రాంతములందును మంచి ప్రచారంలో ఉన్నాయి. నేను కొలంబో పోయినపుడు అక్కడ ఒక అరవకాఫీహోటల్లో రామనాథశాస్త్రిగారి ప్లేటు పెట్టబడడం చూచి నేను పొందిన ఆనందానికి మేరలేదు. ఉత్తరాదిని సిమ్లా కొండలమీద, దక్షిణాదిని తేయాకుతోటలలోను నాగేశ్వరరావుగారి అమృతాంజనం ప్రకటనచూచి ఆంధ్రుని వ్యాపారనైపుణ్యానికి ఎంత సంతోషిస్తామో సముద్రాల అవతల సింహళద్వీపరాజధాని కొలంబో నగరంలో రామనాథశాస్త్రి తెనుగుప్లేటు విన్నామంటే ఆంధ్రుని గాననైపుణ్యానికి అంతగానూ సంతోషిస్తాము. ఇంతకీ ఈ గ్రామఫోను ప్లేట్ల వర్తకులు రామనాథశాస్త్రి ప్లేట్లమూలంగా ఎంతసొమ్ము ఆర్జించారో? మద్రాసులో ఏ అరవ కాఫీహోటలు—కాఫీ హోటల్లు అన్నీ అరవ్వారివేగా—లో చూచినా రామనాథశాస్త్రి ప్లేట్లే.

... ... ...

రామనాథశాస్త్రి గ్రామఫోనుపాటలంటె అరవలకు సాంబారుకంటె కూడా ఎక్కువప్రీతి. భోజనంలో మధ్యమధ్య సాంబారు నంచుకున్నట్లు అరవవారు నాటకంలో మధ్యమధ్య ఈ పాటలు పాడమంటే రామనాథశాస్త్రి పాపం! పాడేవాడు. నాటకం పాడౌతుందేమో అన్న సందేహం శాస్త్రికీ ఉండేదికాదు, సాంబారుస్వాములుకీ ఉండేదికాదు.

... ... ...

'కపిలవాయి రామనాథశాస్త్రిగారు ఆంధ్రనాటకరంగస్థలమునందు సంగీతమునకు ఒక క్రొత్త బాణీని తెచ్చిన అభినేతలు. పద్యములు చదువుటలో శాస్త్రీయమైన సంగీతమును ప్రవేశపెట్టి రసము పుట్టించు స్వతంత్రప్రజ్ఞ వీరిసొమ్ము.' అని విశాఖపత్రిక అతణ్ణి గురించి వ్రాస్తూంది.

... ... ...

'పద్యము చదవడములో క్రింది పాదముమీద... మీద పాదము క్రింద త్రిప్పి కట్టెలుకొట్టించి సయుక్తికముగ పండితపామరులకుకూడ అర్థమయ్యేటట్లు విడదీసి పాడగలశక్తి రంగమార్తాండునిది.' అని ఐరావతి పత్రికలో దుంగా లక్ష్మీనరసింహారావుగారు వ్రాస్తున్నారు.

... ... ...

నాటకరంగంలో రామనాథశాస్త్రిగారి కీర్తికి పట్టుగొమ్మ 'రామదాసు' వేషం. 'మిమ్ము నిర్మించిన', 'సర్వేశ్వరుండగు శౌరి' మొదలగు పాటలు వారి నోటినుండి విన్నవారు ధన్యులే. కాని తమ పాటలచే శ్రోతలను ధన్యులను చేసిన ఆ రంగమార్తాండుడు నాటకరంగము నుండి సినిమారంగమున ప్రవేశించుట పడమటకు వాలుటయే అయినది. నాటకరంగమున గొప్ప కీర్తిగాంచిన వారు సినిమారంగమున జయమందక పోవచ్చుననుటకు శాస్త్రి యొకనిదర్శనము.

... ... ...

రామనాథశాస్త్రికి చెందిన ఈ క్రింది వృత్తాంతము నేటి ఆంధ్రనటకుల స్థితిని కొంత తెలుపును. 'సాలూరుకు శ్రీయుత రామనాథశాస్త్రిగారు రావడము ఇదే ప్రథమము. వీరు విప్రనారాయణనాటకం సాలూరు శ్రీ సీతారామవిలాసహాలులో ఆడుటకు లిఖితముగ వ్రాసియిచ్చి కొంత అడ్వాన్సుకూడ పొంది అకస్మాత్తుగా ఒక రోజు వ్యవధిలో పరమేశ్వరీ హాలులో ఆడపడునని ప్రచురించిరి. శ్రీ సీతారామ విలాస హాలువారికి చాల వ్యయప్రయాసలు అయినవి. నాటకమాడునాటి రాత్రికి సరిగా పార్వతీపురం డిస్ట్రిక్టు మున్సబు గారివద్దనుండి నాటక మాపుటకు ఇంజక్షన్ ఆర్డరు శ్రీ సీతారామవిలాసహాలువారు దీసుకొనివచ్చిరి. ఫిర్యాదిగారును కోర్టు బేటామీనును పోలీసులతో అర్ధరుపట్టుకొని నాటకమారంభము కాకముందు హాలులోనికి రాగా రామనాథశాస్త్రిగారప్పటికి కోటాధరించుటకు రాలేదు. మళ్ళి వత్తుమని వీరు బైటకువెళ్ళి తిరిగి వచ్చునంతలో తలుపులు బంధించి రాత్రి సుమారు 12 గంటలవరకును దీయకైరి. నాటకము సాగుమండెను. ఇంతలో ప్రేక్షకులలో ఒకరిద్దరికి కడుపులో నొప్పిరాగా బలవంతముపై తలుపులు తెరువబడెను. అప్పుడు బేటామీను రంగస్థలముమీదకువెళ్ళి విప్రనారాయణ పాత్రధారియయిన రామనాథశాస్త్రిగారిని నోటీసుపై సంతకము చేయగోర వారు నిరాకరించిరట. వారిపై చర్య జరుగుచున్నది. జూన్ 11 తేదికి వాయిదా వేయబడినది రామనాథశాస్త్రిగారు ఆ నాటికి పార్వతీపురం మున్సబుకోర్టుకు హాజరు కావలసియుండును.' ఇట్టిఘట్టాలు తవ్వితే ఇంకా కొన్నిఉన్నాయి. కాని మరణించినవారిని గూర్చి మంచి చెప్పుకోవాలిగాని చెడుపు చెప్పుకోకూడదు కాబట్టి ఇంతతో ఈ విషయం విరమిస్తాను.

... ... ...

సికిందరాబాదు ఆంధ్రమహాశయులు ఒక బహిరంగ సభలో రామనాథశాస్త్రికి 'రంగమార్తాండ' బిరుద మిచ్చి తమ ఉచితజ్ఞతను ప్రకటించుకొనిరి.

... ... ...

రమణరావు అనువారు 'సుదర్శని'లో రామనాథశాస్త్రినిగురించి గీతమాలిక వ్రాస్తూ ఇట్లు ముగించినారు.

'తామరసనేత్ర లింగ్లబందాలుగారో'
యన్న సత్కవీశ్వరుని వాక్యాలపటిమెం?
అతని జీవితకథనెల్ల నరసి యాంధ్ర
నటులు మెలకువ మెలగ విన్నపము నాది.
మననటకులు వింటారా?

... ... ...

గుణములకు, దుర్గుణములకుకూడా రామనాథశాస్త్రి ఆంధ్రనటులలోకి శిఖామణితరగతికి చెందినాడు. పక్షవాతము ఎనిమిది సంవత్సరములుగ పాటపాడుతూ తుదకు క్షయస్థాయినంది ఆ గాయకుణ్ణి ఎత్తుకుపోయింది. ముప్పదియేండ్లు నిండందే ముసలివాడైనాడు, మృత్యుదేవతకు లొంగినాడు.

... ... ...

తల్లి వృద్ధురాలు, కూతురు ఎనిమిదేండ్లది, సహోదరులు ముగ్గురు, భార్య—ఈ దుఃఖసమయమున వీరికి సానుభూతి తెలుపుకొనుచున్నాను. శాస్త్రి ఆత్మకు శాంతి కలుగుగాక!

—జి. వెంకటరావు, బి.ఏ.

# ఆనాడు ఆషాఢ శుద్ధ పాడ్యమి

[గతసంచిక తరువాయి]

## ౪

మర్నాడు మధ్యాహ్నం రెండుగంటలకల్లా విశాలం, నాభర్తా బడికి వెళ్లారు. నా కింటివద్ద పనేమీలేదు. ఏపని కల్పించుకుని చేయడానికీ బుద్ధిపుట్టలేదు. ఏమీ తోచక రవీంద్రుని కథల పుస్తకం తీసి కొంచెం చదవాలని పుటలు తిరగవేశాను. కాని ఆ ప్రయత్నానికీ, మనసులో ఉన్న కోరికకూ యేమీసంబంధం లేనందున ఆ పుస్తకంలోని ఏపుటకూ తనమీద నామనస్సుని నిలపగలిగే శక్తి లేకపోయింది. ఒకసారి జానకిగారింటికి వెళ్ళాలని నామనస్సు ఊరికే పీకుతూంది. అందుచేత త్వరగా తలదువ్వుకుని సంజీజడ అల్లుకుని సరిగంచు ఊదాచీరా, నీలంపూల రవికా ధరించి రెండున్నరకాక ముందే జానకిగారింటికి బయల్దేరాను.

నేనువెళ్ళేసరికి అబ్బాయి చీడీలో ఈజీఛెయిర్లో కూచుని ఏదో పుస్తకం చూసుకుంటున్నాడు. జానకి చిట్టిని ఒళ్ళో కూచోబెట్టుకుని అతని కెదురుగా చిరిచాపమీద కూచునుంది. నేను జంకుతూ జంకుతూ సావిట్లోంచి 'వొదినా' అని పిలిచాను. జానకి నన్ను ఆదరంగా పిలిచి పక్కను కూచోమంది. నేను ఓసరిల్లి ఆమెపక్కని కూచున్నాను. జానకి నన్నుద్దేశించి యేవో ప్రశ్నలమీద ప్రశ్నలు వేస్తూంది నేను వాటికి క్లుప్తంగా జవాబు లిస్తున్నాను. ఇంతలో అబ్బాయి ఏదో నాతో మాట కలపడానికి:

'ఇవాళ ఉదయంనుంచీ మీఆయన కనిపించడమే మానేశాడు' అన్నాడు.

నేను తెచ్చిపెట్టుకున్న కోపంతో 'ఆయన మీయింటికి... రారు. నేనూ మరి రాదలుచుకోలేదు!' అన్నాను.

'ఏమీ?' అన్నాడు గోముగా.

'నీమీద మాకు కోపంవచ్చింది' అంటూ ముఖం పక్కకు తిప్పుకుని నాలో నేనే నవ్వుకున్నాను.

'ఎందుకూ?'

'ఎందుకా? నువ్వు మెడ్రాసునుంచి ఏభై అరవై రూపాయిల విలువగల వస్తువులు మాకు తీసుకువచ్చావు. వాటి ఖరీదు ఆయనిస్తే తీసుకున్నావు కావట. అయిందా? పదా? అంతసొమ్ము మాగురించి నువ్వు ఖర్చుపెట్టడం ఏమీ బాగులేదు. వాటి ఖరీదు నువ్వు పుచ్చుకుంటేగాని మీయింటికి మేము మరి రాదలుచుకోలేదు.'

'పోనీతే...' అన్నాడు నావి ఉత్తమాటలకింద కట్టినట్టు మందహాసంచేస్తూ.

'అబద్ధంకాదు' అన్నాను చిరునవ్వుతో.

చిట్టిని ముద్దులాడుతూ 'మాచిట్టితల్లి పెళ్ళికి వడ్డీతో కూడా చదివించుకుండి' అంటూ మాసంభాషణ మార్చేసింది మావొదిన.

తరువాత అరగంటవరకూ మాసంభాషణ అనేక విషయాలమీద ఎంతో చనువుగా, సరదాగా సాగింది. మొదట ఒకటి రెండు నిముషాలు అతనితో మాట్లాడడానికి నాకు కొంచెం జంకుగా ఉంది. కాని అతడంత చనువుగా, స్వేచ్ఛగా మాట్లాడుతూఉంటే నాసంకోచమంతా మాయమయింది. అలా మేము ముగ్గురమూ మాట్లాడుతూ ఉంటే ఆసరదాలో ఎంత వేళయిందీ కూడా నేను గుర్తించలేదు అబ్బాయి అయినా గుర్తించాడని నేను చెప్పలేను. ఇంతలో గడియారం నాలుగు కొట్టినందున కాఫీ కాచుకోవాలని నేను లేచాను.

నేను లేవబోతూఉంటే 'ఎన్నిగంటలు కాస్తావు కాఫీ?' అన్నాడబ్బాయి.

ఆమాటలకు 'అప్పుడే తొందర్లేదు. మరికాస్తసేపు

కూచుని వెళుదూ!' అన్నట్టుగా నేనర్థంచేసుకున్నాను. అంతశీఘ్రంగా నన్ను విడవడానికి ఎంతమాత్రం ఇష్టంలేనట్టు నాముఖంవంక అతికాపీనంతో చూసే అతని కళ్ళుకూడా 'ఔను. అదే దానిభావం' అని మాటలకంటె స్పష్టంగా నాకు తెలియజేశాయి. నిజందాచడం మంచిపనికాదు. నాకుగూడా అప్పుడక్కడనుంచి ఏమాత్రము కదిలివెళ్ళాలని లేదు. కాని ఒకసారి వెళుతానని లేచినతరువాత ఆచిన్నసూచనమీద తిరిగి కూచుందికి నాకు సంకోచం కలిగింది. 'ఇంకా చాలా పనులున్నాయి' అని 'వొదినా, నువ్వోసారి మాయింటికి రాకూడదూ?' అంటూ వెళ్ళిపోయాను.

ఇంటికి వెళ్ళాక కొంచెంనసిలి కాఫీపెట్టాను.

మావారు స్కూలునుంచి ఇంటికివచ్చి అప్పుడే కాఫీ తీసుకున్నారు; ఇంతలో అబ్బాయి నలుగురైదుగురు స్నేహితులతో వచ్చి వీధిగుమ్మంలోనుంచే షికారుకు ఆయన్ని కేకవేశారు. వారందరూ షికారు వెళ్ళారు; మావొదిన చిట్టిని తీసుకుని మాఇంటికివచ్చి, ఆరుగంటలవరకూ సరదాగా మాతో కాలక్షేపంచేసి వారింటికి వెళ్ళిపోయింది.

మర్నాడు ఉదయం నేను మామూలుగా జానకిగారింటికి వెళ్ళేసమయానికి అబ్బాయి ఇంట్లోలేడు. సుమారు అరగంటో, ముప్పావుగంటో జానకితోనూ, దొడ్డమ్మతోనూ గడిపి అబ్బాయిదర్శనం కాకుండానే ఇంటికి వచ్చాను.

మధ్యాహ్నం నాలుగుగంటలవుతుంది. మా అమ్మ చీడీలోకూచుని బాలీసు కుడుతూంది. నేను లోగుమ్మంలో కూచుని ఏదోపత్రిక చూసుకుంటున్నాను. ఇంతలో చల్లని పదధ్వని మెల్లమెల్లగా మమ్మల్ని సమీపిస్తున్నట్లయింది. ఆ అడుగుల తాళమానములు నాకు బాగాతెలుసు. అవి సదా నాహృదయంలో ధ్వనిస్తునే ఉంటాయి. తలెత్తి చూశాను. అబ్బాయే నెమ్మదిగా వస్తున్నాడు.

ఆతడప్పుడు వస్తాడని నేననుకోలేదు. ఆసంగతి తెలిసినట్లయితే అప్పుడే నిద్రనుంచి లేచిన జిడ్డుముఖంతో, చీదరజుట్టుతో అలాకూచుని ఉండను. నేనుకట్టుకున్న ఊదాచీరకూడా సఖంసఖం వెలసినరంగుతో వెడవెడలాడి పోతూంది. వీటితో ఆతనికంట బడడమెలాగు? ఆతడు నన్ను చూడకుండా ఉంటే బతికి పోతాననుకున్నాను. కాని...అతడు బాగా దగ్గిరపడిపోయాడు. నేను ముఖమెత్తేసరికి అతడు నావంకే చూస్తున్నట్టు కూడా నాకు వ్యక్తమయింది. చీరమార్చుకుందికీ, జుట్టు సవరించుకుందికీ దేనికీ మరి అవకాశంలేదు. ఒకవేళ యేవి సవరించుకుందామన్నా తనకోసమే ముస్తాబయే ననుకుంటాడేమో! అయినా అలా కూచుందికి నామనస్సొప్పలేదు ఏదో పనున్నట్టు చటుక్కున లోనికి వెళ్ళిపోయాను.

అబ్బాయి మాఅమ్మతో ఏదోమాట్లాడుతున్నాడు. అతడు వెళ్ళిపోయేవరకూ వెలుపలకు రాకూడదనుకున్నాను. కాని మన సుండపట్టలేదు. అద్దంముందు నిలుచుని ఆచీరే ముడతలు సర్దుకుని తిరిగి కట్టుకున్నాను. వేళ్ళతో ముంగురులు సవరించుకుని తడిబట్టతో ముఖం తుడుచుకుని మెల్లగావచ్చి లోగుమ్మంలో యేమీఎరగనట్టే తిరిగికూచున్నాను. అబ్బాయి నావంక నొకసారి చూసి మందహాసంచేసి తిరిగి తనధోరణిలో పడ్డాడు.

రెండుమూడు నిముషాలైనతరువాత నన్నుద్దేశించి 'ఇంకా మీఆయన బడినుంచి రాలేదూ?' అని ప్రశ్నించాడు.

వారు అయిదుగంటలయితే గాని బడినుంచి రారనే సంగతి తెలీకపోవడమే ఆప్రశ్నకు కారణమని నమ్ముకునే మా అమ్మవంటివారు కొందరుంటారు. నేను మాత్రం కేవలం నన్ను మాట్లాడించడానికే అలా అడిగాడని ఊహించుకుని 'ఇంకా రాలేదు. వచ్చేవేళ అయింది'అంటూ ఆయనకి కాఫీపెట్టడానికని లేచాను. నేనూ కాఫీనీళ్ళు మరిగిస్తున్నాను; ఆయనా బడినుంచి వచ్చారు. అబ్బాయి, ఆయనా ముందరగదిలో కూచుని ఏవో మాట్లాడుతున్నారు నేనింతలో కాఫీ తయారుచేసి రెండు కప్పులతో తీసుకుని వెళ్ళి వారిరువురిముందూ ఉంచాను.

అబ్బాయిముందు కాఫీఉంచుతూ ఉంటే 'నాకెందుకూ? నేను కాఫీతీసుకునే వచ్చాను' అన్నాడు.

'కాఫీతీసుకునే వచ్చావా! సరేలే...!' అంటూ ముఖంపక్కకు తిప్పుకున్నాను గంభీరంగా.

'కోపం వచ్చిందా?' అన్నాడు మందహాసంచేస్తూ.

'కోపమెందుకూ? మాలాంటివారి యిళ్ళలో నువ్వు కాఫీతీసుకుందికి మేమంత గొప్పవాళ్ళమా?' అన్నాను.

'ఓస్. ఈమాత్రానికే అంతకోపమా? అయితే ఇయ్యి! మళ్ళీ పుచ్చుకుంటాను' అంటూ కప్పు తీసుకున్నాడు.

ఇద్దరూ కాఫీతాగేరు.

ఇహాను బయల్దేరుదామా అంటే సరే అనుకుని ఇరువురూ క్రాఫింగులు సవరించుకుని జోళ్ళు వేసుకుని ముందు ఆయనా వెనుక అబ్బాయి బయల్దేరారు షికారు. నేను ద్వారంలో నిలుచుని అబ్బాయివంకే చూస్తున్నాను. అబ్బాయి నడుస్తూఉంటే ఆనడకలో ఎంత నాజూకు? ఎంత సొక్కు? రూపంకదలికతో మాట్లాడుతుంది కాబోలు! అబ్బాయి ప్రతీ అడుగూ, ప్రతీ చలనమూ ఆతని అందంలోని ఒక్కొక్క నూతనరహస్యాన్ని బైటపెడుతున్నదేమో ననిపించింది.

అబ్బాయి మెరిసే పచ్చని బంగారమువంటి శరీరచ్ఛాయా, గుండ్రని ముఖమూ, నీలాల్లాంటి కళ్లూ, మృదువైన శరీరమూ ఎంతో సుకుమారంగా ఉంటాడు. ఆరోజున మరీ ఆవిచిత్రమైన వల్లెవాటూ, చక్కని అంచుల ఖాదీపంచా, సన్నని లాల్చీధరించి ఆతడు వెళుతూఉంటే జగన్మోహనంగా ఉన్నాడు. నేనతనివంకే చూస్తున్నాను. నేనక్కడ నిలుచున్నట్టు అబ్బాయికి కూడా తెలిసినందున ఆతడుకూడా తప్పక నావంక నొకసారిచూస్తాడనే నానమ్మకం. కాని అబ్బాయి ఆతనితో మాట్లాడుతూ నావేపు ముఖమైనా తిప్పకుండా నాతలంపే ఆతనితలలో లేనట్లు అతినిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు.

అత డంతనిర్లక్ష్యంగా వెళ్ళిపోతాడని నేననుకోలేదు. నాకు చాలాకోపం, అభిమానం కలిగాయి. అబ్బాయికి నామీద ఎంతో ప్రేమనీ, నాముఖం చూడడానికి, నామాటలు వినడానికి అత డెంతో ఆతృతపడుతూ ఉంటాడనీ నేనింతవరకూ భావించుకున్న భావనంతా వట్టిభ్రమేనని అప్పుడు నాకు తట్టింది.



ఆరాత్రి పన్నెండుదాటింది. నాకు నిద్రపట్టలేదు. మునుపెప్పుడూ నాలోకలగని భావాలు నాహృదయంలో ఉద్భవించి అర్థంకాకుండా నన్ను బాధపెడుతున్నాయి. ఏదో తెలీని, చెప్పలేనిభారం నాహృదయంలో చోటుచేసుకుని కూచున్నట్టుంది. ఏదేనా చదువుకుందామని పుస్తకం తెరిచాను. మనసుపోలేదు. వెలుపలకు వచ్చి చల్లగాలిలో కొంతసేపు తిరిగాను. పక్క మరోసారి సర్దుకుని నిద్రపడుతుందేమో అని అటూ ఇటూ దొర్లాను ఏమిచేసినా, ఎంత ప్రయత్నించినా ఆభారాన్ని నాహృదయంలోనుంచి తొలగించుకోలేక పోయాను.

నామనసుని కొంచెం కుదుటబరుచుకుని నెమ్మదిగా నాలో నేనే వితర్కించుకోవడం మొదలుపెట్టాను

'ఏమిటి నన్నిలా పీడిస్తున్నది?'

లోపటినుంచి ఈప్రశ్నేవచ్చింది.

'నిన్ను చూడాలని ఆతృతపడేటంత మమకారం అబ్బాయికి నీమీద ఉందా?'

'లేకపోతే...? నన్నుచూడాలని అతడెందుకు ఆతృతపడాలి? అతడు నాకోసం ఆతృత పడలేదని నేనింత మథనపడడ మెందుకూ? అబ్బాయి నాకెవరు?'

'అబ్బాయి నీకెవరా! అదేమిటి? అతడు నీకేమీ కాకపోవడమేమిటి? నీబాల్యస్నేహితుడు. నీగురువు; ప్రియతములలో కల్లా ప్రియతముడు. ఇంకా అతడు నీకేం కాకపోతాడు? అతడే పరాయివాడికింద లెఖ్ఖ అయితే ఆప్తులని ఎవరిని చెప్పుకోగలవు?'

'నిజమే. ఆతడే పరాయివాడయితే నాకీలోకంలో ఆప్తులని చెప్పుకోదగినవారెవ్వరూలేరు. అయితేమాత్రం? ఆతనికి నాతలంపే లేనప్పుడు నాకుమాత్రం ఆతనంటే ఎందుకూ ఇంతమమకారం?'

'ఆతనికి నీతలంపేలేదని నీకెలా తెలుసూ?'

‘ఉంటే నావంక తిరిగైనా చూడకుండా అంత నిర్లక్ష్యంగా వెళ్ళిపోగలుగుతాడా ?’

ఇలా ఆలోచిస్తున్నకొద్దీ నా అభిమాన మధిక మయింది. అతణ్ణి చూడకుండా నేనుమాత్రం ఎందుకు ఉండలేనో చూస్తాను అని భావించుకున్నాను. అతణ్ణి మరిచిపోవాలి; అతని సంగతి మరి తలపెట్టకూడదు — అని నిశ్చయించుకున్న కొద్దీ అతని తలంపే నాహృదయ మంతటా అధికారం చేయడం మొదలుపెట్టింది. ఈ ఆలోచనలతో నా కారాత్రల్లా సరిగా నిద్రలేదు.

మర్నాడు ఉదయాన్నే పక్షులతో మేలుకుని రోజూ నాఅలవాటుచొప్పున పెరట్లో జామిచెట్టు కిందవున్న గచ్చుతిన్నెపైన కూచుని పళ్ళుతోముకుం టున్నాను. చల్లనిగాలి నాజుట్టునీ, సన్నని పైటచెర గునీ అటూ యిటూ మృదువుగా కదిలిస్తూ ఉంటే అప్పుడే ఉదయిస్తున్న లేతసూర్యుడు నానుదిటినీ వక్షా న్నీ ముద్దిడుకోవాలని ఆకులసందుల్లోంచి ఊరికే పెను గులాడుతున్నాడు. ఆసంగతి కనిపెట్టి కాపోలు మల్లెలు తమలో తాము ముసిముసి నవ్వులు నవ్వుకుం టున్నాయి.

అబ్బాయిగారి పెరట్లోఉన్న వకుళవృక్షశాఖపై నుంచి కోయిల ‘కో, కో’ అనీ ‘కుహు, కుహు’ అనీ అవిరామంగా కేరుతూంది. ఎందుకు ? కేవలం నన్ను రంజింపజేయడానికేనా ? అయిఉండదు ప్రబంధకవులు వర్ణించినట్లు కాముకుల హృదయాలను కలవరపెట్టడాని కంతకన్న కానేరదు. ఈరెంటినీ మించిన స్వార్థపర మైన ఉద్దేశమేదో దానికి ఉండి ఉంటుంది. ఆచిన్ని పక్షియొక్క మనోవృత్తాంతాలు మనకేంతెలుస్తాయి ? అయినా పూలపైనుంచి రెమ్మలపైనుంచి మెల్లగా తె రలు తెరలుగాసాగుతున్న సమీరకుమారుని స్పృశితో, యెడతెగని ఉత్సాహంతో అదలా కేరుతూఉంటే చెవు ల్లో అమృతం చిమ్ముతున్నట్లయి నాహృదయమే ఆ నందంతో గానంచేస్తున్నట్లుంది. నాహృదయంలోని కొంతభాగమే ఆపిట్టలో కూడా ఇమిడిఉన్నదేమో ననిపించింది. అచేతనములైన వృక్షములు సైతం దాని పాటకు మెచ్చుకుని తల లూపుతున్నప్పుడు, చిగుళ్ళు సైతం తన్మయత్వంతో దాని సంగీతాన్ననుసరించి తాళంవేస్తున్నప్పుడు మానవుల సంగతి వేరే చెప్పవల సిందేముంటుంది ?

ఇంతలో కోయిలస్వరాన్ని మించిన చల్లని స్వరంతో ఈగీతం నాచెవిని బడింది.

‘ఏపువ్వు పూసినా
ఏపాట పాడినా
ఎందుకో ఈహృదయ
మింత కళకళపడును ?’

ఆ గొంతు కెవరిదో గుర్తించడం నాకోక కష్టమైన పనికాదు. తలెత్తి చూశాను. వాయుస్పర్శవల్ల మృదు వుగా చలిస్తూ గుబురుగా నుదిటిమీదకు వాలిఉన్న ఆ పొడుగాటి క్రాపూ, మందహాసం నాట్యమాడుతూ లేడిపిల్ల కళ్ళకంటె చందలమైన ఆనోగకళ్ళూ అబ్బా యే! వాళ్ళ డాబామీద పిట్టగోడ నానుకుని మనోజ్ఞ మైన లతవలె విలాసంగా నిలబడి పళ్ళుతోముకుంటు న్నాడు. (పురుషునివిషయంలో ఇటువంటి వర్ణనలు కొంతవరకు అస్వభావికంగానూ, అనుచితంగాను ఉన్న ట్లు కొందరికి తోస్తేమట్టుకు నేనుచేసేదేమీలేదు. అది నాతప్పుకాదు. అబ్బాయిలోఉన్న ఆమృదుత్వమూ, ఆ కోమలతా, ఆసౌకుమార్యమూ పురుషులలోనే కాదు, చక్కని అమ్మాయిలలోకూడా నేనెక్కడా చూడ లేదు.) అతడు నావేపు చాలాసేపటినుంచి అదేపనిగా చూస్తున్నట్టు నాకు తట్టింది. నేను ముఖంఎత్తేసరికి అతడు ఆనందంతో ‘టక్కున’ మందహాసంచేశాడు. నేనూ చిరునవ్వుతో అతనివంక చూసి...చూస్తూ అలా ఉండిపోయానెంతసేపో. నాభర్తకు కాఫీపెట్టవలసిన వేళ అతిక్రమించిపోతున్నదనే సంగతికూడా నాకప్పుడు తట్టలేదు.

ఆరుగంటలు కొట్టాయి. అబ్బాయి నావేపు ‘అ...బ్బ! నిన్నెలావొదిలి వెళ్ళడం ?’ అన్నట్లు తిరిగితిరిగి చూస్తూ అతికష్టంమీద మెల్లమెల్లగా కిందకుదిగి పో యాడు. ఆచూపుల్లోని ధ్వని యేమిటా అని ఆలోచించు కుంటూ నేనూ లోపలికి వెళ్ళిపోయాను. సాయంత్రం

నుంచీ నన్ను బాధిస్తున్న నాహృదయంలోని భార మంతా ఒక్కసారి తొలగిపోయింది.

మర్నాటినుంచీ నేను సరిగా పెరటిలోకి పళ్ళు దోముకుందికి వెళ్ళేసమయానికే అతడూ డాబామీదకు వచ్చేవాడు. అతడు గోచరించేసరికి మేఘముదయించే టప్పటికి నెమలిమనస్సు మోస్తరుగా నామనస్సు ఆ హ్లాదం పొందేది. చల్లనిగాలి నాజుట్టునీ, సన్నని పైట చెరగునీ అల్లలాడిస్తూ ఉంటే నాకై ప్రేమతోనిండిన అబ్బాయి పక్కచూపులతో పరవశురాల్నయి, కొత్త రాజ్యాన్ని వశపరుచుకున్న రాజువలె ఆనందిస్తూ అలా కూచునేదాన్ని, పరిగెత్తేకాలాన్నికూడా గుర్తించ కుండా.

తుదకు నాముఖంమీదనుంచి కళ్ళు తిప్పుకోలేక తిప్పుకోలేక నావేపు ఆతిగమ్మత్తుగా చూస్తూ అతడు డాబా దిగిపోయేవాడు. సరిగా అతడూ వెళ్ళిపోయే సమయానికే నాపళ్ళుతోముకోడంకూడా పూర్తవు తున్నందున ముఖంకడుక్కుని నేనూ లోనికి వెళ్ళిపోయే దాన్ని.

ఇలారోజూ ఉదయాన్నే ఒకర్నొకరు దర్శించు కోడం మాకు బాగా అలవాటయింది. రోజంతటిలో నూ అదొక మహావరంలాగున ఉండేది మాకు. ఎప్పుడు ఉదయమవుతుందా అని ఇరువురమూ ఎదురుచూసే వాళ్ళం. ఒకరోజు నేను పెరటిలోకి వచ్చేవేళకుసరిగా అబ్బాయి డాబామీద ఉండకపోతే నాకతనిమీద అమితమైన కోపంవచ్చి, ఇంత నిర్లక్ష్యమా అని ఎంతో అభిమానం కలిగేది. ఆదినమల్లా విచారమయంగా, వెలితిగా, వ్యర్థంగా తోచి ఏపనిమీదా మనస్సు పోయేదికాదు. నేను కనబడకపోతే అబ్బాయికి కూడా అలాగే ఉండేదని చెప్పఖ్ఖర్లేకుండానే తెలుసు కుంటారు.

ఒకరోజున, మర్నాడు నాభర్తకు శెలవుపూట అయినందున చాలారాత్రివరకూ మాఇంటిలో అంద రమూ పేకాట వేసుకున్నాము. అందుచాత మర్నాడు నాకు మెలకువవచ్చేసరికి చాలాపొద్దెక్కింది. అప్పటికి అబ్బాయి డాబాదిగిపోయి ఉంటాడనే నమ్మకంతో నేపెరటిలోకి వెళ్ళాను. కాని నేనువెళ్ళేసరికి అబ్బాయి ఇంకా డాబామీద నిలుచునే ఉన్నాడు, ఆతృతతో మా పెరటివంక తిలకిస్తూ. నేనూ పెరటిలోకి రావడం కనిపెట్టి 'నువ్వింత ఆలస్యంచేస్తే నీకోసం నేను కని పెట్టుకుని కూచోను. నీలక్ష్యం నాకెంతమాత్రంలేదు' అన్నట్లు తీక్ష్ణమైన ఒక చూపు నామీదవిసిరి నావంక మరి చూడకుండానే ఊపిరితిరగనంత పనియేదో ఉన్న ట్టు చరచరా దిగిపోయాడు.

అ...బ్బ! ఆమొహంలో ఎంత గాంభీర్యం !- ఎంత టెక్కు? ఎంతనిర్లక్ష్యం? నాకు చాలా అభిమానమూ, అహంకారమూ కలిగాయి. అతణ్ణి చూడకుండా నేను బతకలేననే కాబోలు అతనిఉద్దేశం? పోనీ తనుకూడా నన్ను చూడాలని సరదాపడుతున్నాడు కదా అని అత నికవుపడేట్టు కూచుంటే తనకోసమే కాచుకొని కూ చున్నానని కాబోలు అతనిగర్వం? అతణ్ణిచూడకుండా నేనుమాత్రం ఎంతకుండలేనో చూస్తాను. మళ్ళీ అతడు నాకోసం తపనపడిపడి నాఎదుట జాలిగా కన్నీరు కార్చేవరకూ అతనికంటబడకూడదని శపథం చేసు కున్నాను.

వరుసగా రెండురోజులు నేను పెరటిలోకిగాని వా రింటికిగాని వెళ్ళలేదు. అకారణమున అబ్బాయిసంగతు లేమీ తెలీలేదు ఆమూడోరోజున సుమారు ఎనిమిదిగంట లప్పుడు మా ఆయనవద్దనున్న ఏదేపుస్తకంకోసమని అ బ్బాయి మాయింటికి వచ్చాడు. అప్పుడాయన ఇంటిలో లేరు. రెండుసార్లు, మూడుసార్లు అలాగే నాలుగైదుసార్లు ఉదయం, మధ్యాహ్నం ఆరోజున అబ్బాయి మాయిం టికి తిరిగాడు. ఆయనకోసమే; అపుస్తకం కోసమే ! కాని, ఒకసారికూడా అబ్బాయికి ఆయన దొరకలేదు. అవేవీ ఆయన ఇంటిలోఉండే సమయాలు కానేకావు. ఆసంగతి అబ్బాయికి తెలీదని ఎవరేనా భావించుకుంటే నాకు నిజంగా నవ్వువస్తుంది. ఆయనుండరని తెలిసీ అన్నిసార్లు ఎందుకు తిరిగేడో నాకర్థంకాలేదు. అబ్బా యి మాఇంటికి వచ్చినప్పుడల్లా నేను గదిలో గుమ్మం చాటున నిలుచుని అతనితట్టే చూస్తూఉండేదాన్ని. నే

నక్కడఉన్నట్టు, అలా అతణ్ణి గమనిస్తున్నట్టు అబ్బాయి కేమాత్రము తెలీదు.

బాల్యంనుంచీ పుస్తకాలంటే అబ్బాయి ఒళ్ళెరగడు. షేక్స్పియరు, షెల్లీ, షా, కాళిదాసు, భవభూతి, రవీంద్రుడు మొదలైన మహాకవుల గ్రంధాలేవైనా చదువుతున్నప్పుడు అబ్బాయి నిద్రాహారాలు కూడా మరిచి వాటిలో లీనమైపోయేవాడు. రెండుమూడు దినములాయి ఆపుస్తకాలవెర్రి అబ్బాయికి మరీ అధికమైనట్లుంది. సాయంత్రంపూటలు కూడా స్నేహితులతో షికారుమాని ఒంటరిగా చీకటిపడేవరకూ డాబామీదే గడుపుతున్నాడు ఏదో పుస్తకం ముఖం మీద ఉంచుకొని. నే నతనికంటబడకపోయినా పెరటి గుమ్మంచాటున నిలుచుని, పుస్తకంచేతనుంచుకుని అతడు డాబాయెక్కుతూ ఉండడం, మాపెరటిత్తట్టు నున్న పిట్టగోడనానుకుని పేజీలమీద పేజీలు తిరగవేస్తూ ఉండడం, చిన్నచప్పుడయేసరికి అదిరిపడి మా పెరటివంక చూస్తూఉండడం అన్నీకనిపెడుతూనేఉండేదాన్ని. నేనక్కడ నిలుచున్నట్టుగాని, ఆలా అతణ్ణి గమనిస్తున్నట్టుగాని అతనికి తెలిసేదికాదు.

ఆమరుచటిదినంకూడా ఉదయం బాగాపొద్దెక్కేవరకూ అలాగే పుస్తకంచూసుకుంటూ డాబామీద నిలుచుని నిలుచుని దిగిపోయాడు. సుమారు పదిగంటలవేళ తువ్వాలారవేసుకుందికని మళ్ళీ డాబాయెక్కాడు. బట్టలు ఆరవేసుకోడం అబ్బాయి అలవాటులో ఉన్నట్టు ఇంతవరకూ నేనెప్పుడూ చూడలేదు. పైగా తువ్వాలు ఆరవేయడానికి అంతకాలం వినియోగించవలసిన అవసరం కూడా నాకు కనబడలేదు. లేడిపిల్ల కళ్ళకంటె చంచలమై, సోగలైన అతని కళ్ళు ఏదో పోగొట్టుకున్న అమూల్యమైన వస్తువుకోసం వెతుకుతున్నట్టుగా ఆమూలనుంచి యీమూలకూ ఈమూలనుంచి ఆమూలకూ మాపెరటిచుట్టూ సంచరిస్తున్నాయి.

నేను పూలుకోసుకుందికని సజ్జాపట్టుకుని మెల్లగా అటువంక చూడకుండానే పెరటిలోకి వెళ్లాను. వెళ్తూ ఉంటే చీర అడ్డుకుని ఒకటిరెండుసార్లు అడుగులు తొట్రుకున్నాయి. పూలుకోసి సజ్జాలో వేయబోతూ ఉంటే అవి పక్కకుజారి కిందపడిపోతున్నాయి. అబ్బాయి డాబామీదనుంచి ఏకాంతంగా ఓరగా నాతట్టే చూస్తూఉంటాడు. ఆనల్లని, వర్షమేఘంకంటె నల్లని అతనిచూపులే నాపనికి అడ్డుతగిలి నన్నిలా అల్లరపెడుతున్నాయి. అయినా అతనివంక చూడకూడదని నిశ్చయించుకున్నాను. కాని—అతడక్కడ ఉన్నాడనీ నాతట్టే చూస్తూఉంటాడనీ తెలిసికూడా అతనివంక తిరగకుండా ఉండడమంటే మాటలుకాదు.

రెండుమూడు నిముషాలైనతరువాత ఏమీ యెరగనట్టే మెల్లగా అటువైపు తిరిగిచూశాను. కవలచుక్కల్లా మెరిసే అందమైన అతని నేత్రాలు పద్మంమీదకు దుమికే తుమ్మెద జతవలె ప్రేమతోనూ, ఆనందంతోనూ నాముఖంమీదకు దుముకుతున్నాయి. నాఅభిమాన అహంకారస్థానాల్లో సిగ్గూ, ఆనందమూ చోటుచేసుకున్నాయి. నేను ప్రేమతో చిరునవ్వునవ్వాను. అతడానందంతో మందహాసంచేశాడు.మాయిరువురకూ తిరిగి రాజీఅయింది తరువాత అబ్బాయి ఎప్పుడూ అటువంటి నేరం చెయ్యలేదు. ఒకవేళ చేసినా అంతకఠినమైనశిక్ష విధించకూడదని నేనూ శపథంచేసుకున్నాను.

## ౩

జానకిగారింటికి వెళ్ళడానికి ఉదయం ఎనిమిదికీ పదికీ, మధ్యాహ్నం రెండుకీ నాలుగుకీ మధ్యవేళలనే ఎంచుకునేదాన్ని. అందుకు ముఖ్యమైన కారణం అది ఆయన స్కూలుకి వెళ్ళేసమయమైనందున అదే నాకు తీరికసమయం. అదే అబ్బాయి ఇంటిలోఉండే వేళ కావడం కూడా కొంతవరకు కారణం కాకపోదు.మధ్యాహ్నం నేను వారింటికి వెళ్లేసమయానికి మావొదినా దొడ్డమ్మా వెనకటింటిలో గుమ్మంలో తీరుబడిగా కూచుని నాకోసం ఎదురుచూస్తూ ఉండేవారు. నేనూ ద్వారంచెంత వారిపక్కనే కూచుని అంతంలేని కబుర్లు చెప్పుకుంటూ, అప్పుడప్పుడు అబ్బాయి బలవంతాన హార్మణీయం వాయించి పాటలూ అవీ పాడుతూ నాలుగు గంటలవరకూ సరదాగా కాలక్షేపంచేసేదాన్ని. అప్పుడబ్బాయి ముందరిచీడీలోనో, గదిలో గుమ్మంలోనో ఈజీఛైర్లో బాగా మాకగుపడేటట్టు కూచుని పుస్తకం

ముఖంమీద ఉంచుకుని తదేకధ్యానంతో చూస్తూఉండే వాడు. పుస్తకంలోని విషయమే నిజంగా అప్పుడతని దృష్టిని ఆకర్షిస్తున్నాదని యెవరేనా నమ్మకుంటే నేను నవ్వాపుకోలేను.

నాకూ అబ్బాయికీ అంత చనువున్నా ప్రతిరోజూ మొట్ట మొదట మేమిరువురం కలుసుకునేటప్పుడు ఒకటి రెండు నిముషాలవరకూ అతనివంక సరిగా కన్నెత్తి చూడడానికిగాని, అతనితో మాట్లాడడానికిగాని నాకెంతో సంకోచంగానూ, సిగ్గుగానూ ఉండేది. కాని అతనిలో ఏమిశక్తిఉందో! ఒక్కసారి అతడు నన్ను పలకరించి నాతో చనువుగా మాట కలిపితేచాలు—నానోటికి ఇంక అపు ఉండేదికాదు. అంతంలేకుండా, అవిరామంగా ఒకటే సంభాషణ సముద్రపు అలలవలె నాహృదయంలోంచి పొంగి పెదవుల గుండా ప్రవహించేది. అతనితో మాట్లాడుతున్నంత సేపూ అతడు పురుషుడూ నేనుస్త్రీనీ అనే భేదభావం కూడా నామనస్సుకి తట్టేదికాదు. ఇంటికి చేరుకున్నాక నాలో నేనే వితర్కించుకునే దాన్ని:

'అబ్బా! ఏమిటి ఈవేళ నేనింత విపరీతంగా మాట్లాడేను? మాసంభాషణ ఎంతమితిమీరిపోయింది? నోడ్డమ్మ ఏమనుకుంటుందో! ఒదిన ఏమి తప్పభిప్రాయం పడుతుందో! అబ్బాయికంటే, మొగవాడు ఫరవాలేదు; కాని, ఆడది పైవానితో అంతలా మాట్లాడడం ఏమేనా బాగుంటుందా?'

లోపటినుంచి ప్రశ్నార్థకమైన ఈజవాబువచ్చేది:

'ఏమీ? అందులో తప్పేముందీ? మనస్సులో ఏమీ కళంకంలేనప్పుడు మాట్లాడినంతమాత్రాన దోష మేమిటి?

'నిజమే, దోషంలేదు; మనస్సులో ఏమీ కళంకం లేకపోతే' అనే నాకూ తోచేది. కాని, మనస్సులో ఏమీ కళంకంలేకపోవడం—అక్కడే ఏమో సంశయంగా ఉండేది.

ఈసారి వారింటికి వెళ్ళినప్పుడు కొంచెం జాగ్రత్తగా మసులుకోవాలి—నోరుకొంచెం కట్టుకోవాలని నిశ్చయించుకునేదాన్ని. కాని అబ్బాయిముఖంచూసి - అతనిమాటలు వింటూ నానిశ్చయాన్ని జ్ఞాపకముంచుకోవడం, నోరుకట్టుకోడం—అంత సులభమైన పనులు కావు. మాసంభాషణ మామూలు ధోరణిలోనే సాగిపోయేది.

రోజుకొక్కసారైనా అబ్బాయి మాయింటికివచ్చి మాఅమ్మదగ్గరో ఆయన దగ్గరో కూచుని పావుగంటైనా మాట్లాడి వెళ్ళుతూ ఉండడం అలవాటు. ఒక్కొక్కసారి అతడు మాయింటికి వచ్చినప్పుడు ఇంటిలో నేనొక్కర్తనే ఉండడం తటస్థించేది. అతనిరాకకోసం చాతకంపలె తపించే నాకు అప్పుడెందుచేతనో బెదురు బెదురుగా ఉండేది. అతడు నెమ్మదిగా సమీపించి పువుదేనెగొంతుతో 'ఎవరూ లేరేమిటి?'అని ప్రశ్నించే వాడు.

'లేరు. మాఅమ్మ ఎవరింటికో వెళ్ళింది...మాచెల్లి, ఆయనా ఇంకా బడినుంచి రాలేదు' అనేదాన్ని సంకోచిస్తూ. ఇంకా అబ్బాయి నాతో ఏదో మాట్లాడాలని కుతూహలపడుతున్నట్లు అతని వదనంలోని భావాలు నాకు స్ఫురించేవి. కాని ఒక్కమాటైనా అతడనడానికి తగిన ఉత్సాహం నాముఖంలో అతనికి కనబడేదికాదు. అతనితో మాట్లాడాలని నామనస్సులో ఎంత ఉత్సాహమున్నా ఒంటరిగా అతనివద్ద నాఉత్సాహాన్ని ప్రకటించడానికి తగిన ధైర్యం నాకు లేకపోయేది. మాచెల్లెలేనా అప్పుడింటిలోఉంటే ఎంతబాగుండుననిపించేది. ముగ్గురముంటే మాసంభాషణ సునాయాసంగా సాగడానికవకాశంఉండును. కాని, మనమనుకున్నట్టే అన్నీ జరుగుతూఉంటే ఇంకేంకావాలి? భగవంతుడున్నాడని అనుకోవలసిన అవసరం ఏముంటుంది?—అబ్బాయి ఒక్కమాటయినా అనకుండానే నెమ్మదిగా వెళ్ళిపోయేవాడు. అతడు వెళ్ళిపోయాక 'ఏమి ఇంత కఠినంగా ప్రవర్తించాను? అతనిమనస్సుకి నొప్పికలిగించాను కాబోలు!' అని నాహృదయం చాలా బాధపడేది. తిరిగి మా అమ్మావాళ్ళూవచ్చాక జానకిగారింటికి వెళ్ళి అబ్బాయితో చనువుగా ఒకటి రెండు మాటలాడి వచ్చేవరకూ నామనస్సుకి శాంతిఉండేదికాదు.

ఒక్క విషయంలోమాత్రం మొదటిలో నాకు చాలా ఉడుకుబోతుతనంగా ఉండి అప్పుడప్పుడు అతనిమీద పట్టరానంత కోపంకూడా వచ్చేది. అదేమిటంటే అబ్బాయి ఎప్పుడూ మాటలచేతగాని, చూపులచేతగాని నేను అందంగా ఉంటానన్న సూచనైనా చేసేవాడు కాడు. పైగా ఎప్పుడేనా పండుగులకూ వాటికీ నేను చక్కగా ముస్తాబై అతనికంటబడితే చాలు— 'ఇవాళ ఎన్నిసవరాలు నీజుట్టులో దూరాయి? ఎన్ని సబ్బులుముఖంమీద అరిగాయి?' అని అబ్బాయి వేళాకోలాలికి అంతుండేదికాదు. కాని అలా అనడంలో అతని ఉద్దేశమేమిటో నేను త్వరలోనే గ్రహించగలిగాను. నాజుట్టూ, కళ్ళూ, ముక్కూ, చెక్కిళ్ళూ, పెదవులూ, చేతులూ, నడుమూ—ఇవన్నీ సహజంగా ఎలా ఉంటాయో అతనికి బాగాతెలుసుననీ, పై ముస్తాబులవల్లనూ, అలంకారాల వల్లనూ అతని దృష్టిలో వాటి మూల్యం నేనెంతమాత్రం హెచ్చించలేననీ నేను తెలుసుకోవాలనే అతని ఉద్దేశం. ఎదుటినుంచి చూసినప్పుడూ, ఓరగానున్నప్పుడూ, కూర్చున్నప్పుడూ, నిలుచున్నప్పుడూ, పని తొందర్లో ఉన్నప్పుడూ అన్ని సమయాల్లోనూ నేనెలాఉంటానో నాశిరమునుంచి పాదాల చివరవరకూ అతనికి బాగాతెలుసు. తెలిసే నాసహజరూపంతోనే సంతృప్తి నొందుతున్నాడు. ఈసంగతి తెలుసుకున్న తరువాత సామాన్యమైన దుస్తులతోనూ, స్వభావసిద్ధమైన రూపంతోనూ అతని ఎదుట పడడానికి అంతవరకూ నాలో ఉండే సంకోచభావం పూర్తిగా తొలగిపోయింది.

ఎప్పుడేనా నాటకాలకు, సినీమాలకు అబ్బాయి, మావోదినా వెళ్ళదలుచుకున్నప్పుడు ఆయన్నీ, నన్నూకూడా రమ్మని పట్టుపట్టేవారు. మాటవరుసకి 'అయినా, మీరూ వెళుదురూ!' అని నేనన్నమీదట 'ఊహు! నువ్వురాక తప్పదనేవా డబ్బాయి.

'అబ్బా! నేనుకూడా ఎందుకు బెద్దురూ!' అనేదాన్ని మళ్ళీ.

అప్పు డబ్బాయి అతికాపీనంతో నాకళ్ళలోకి చూస్తూ 'నీలో ఏదోఉంది! నువ్వంటే మాకెంతో సరదాగా ఉంటుంది.' అనేవాడు.

అప్పుడు నాహృదయంలో జనించిన ఆనందాన్ని నేనెంతమాత్రం నాలో ఇముడ్చుకోలేక పోయేదాన్ని. 'ఊరుకుందూ! అబ్బాయి! నీవన్నీ ఇలాంటి మాటలే' అని అబ్బాయిమాటలు నేనెంత నిర్లక్ష్యంగా ఉత్త మాటలకింద కొట్టిపారవేసినా అతనిమాటలకు నేను చాలా సంతోషించినట్టు అబ్బాయికి వ్యక్తమై పోయేది—వెళ్ళక తప్పేదికాదు.

'నేనంటే అబ్బాయి కెందు కింత సరదా?'

'ఎందుకా? మీరిద్దరూ బాల్యస్నేహితులుకారూ?' అని ఒకమారూ, 'బంధువులుగనక' అని ఇంకోమారూ, 'ఎంతోకాలంనుంచీ మీకుటుంబానికీ వాళ్ళకుటుంబానికీ ఉన్న మైత్రివల్ల'నని ఇంకోసారీ ఇలాగే యేవేవో సమాధానాలు వచ్చేవి. కాని వాటిలో ఏ సమాధానానికీ ఊతచాలినట్టుండేదికాదు. ఏదో లోటుగానూ, నీరసంగానూ ఉన్నట్టూ, ఏమో అతగనట్టూ కనబడేవి; కాని అసలు కారణం ఏమిటో ఎంతకూ బోధపడేదికాదు.

అంతకంతకూ మాయిరువురికీ చనువు హెచ్చవుతున్నకొద్దీ అబ్బాయికంటిచూపు, కనుబొమ్మలవంపుగూడా అతని మనోభావాలను నాకు తెలియజేసేవి. అతడెప్పుడేనా నాకేదేనా సలహాఇవ్వదలుచుకుంటే అతడు చెప్పదలచుకున్న దేదో చెప్పకపూర్వమే నేను గ్రహించగలిగేదాన్ని. ఎప్పుడేనా అతడు నాముఖంలోకి చూసి దేనికైనా నన్ను ప్రశ్నిస్తే అతని మాపే అతనికి కావలసిన జవాబు నావద్దనుంచి పొందేది. అప్పటి నా ఆలోచనలూ, భావాలూ నిజంగా నావికావు అబ్బాయి ఆలోచనలే, వానిభావాలే నాలోప్రవేశించి, నావిగా మారి, నాజీవితానికొకవిధమయిన దీప్తినిచ్చాయి. నా స్థితిలో ఏదో మార్పువచ్చినట్టు నాకే తట్టేది.

[అసలుకథ ఇంకా మిగిలేఉంది.]

—ఆకుండి సత్యనారాయణ.

## THE SOUTH INDIA CO-OPERATIVE INSURANCE SOCIETY, LTD.,

**MADRAS.**

# ది సౌత్ ఇండియా కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం 182 రు. మద్రాసు.

ఈ సొసైటీలో ప్రీమియములు చాలాతక్కువే! ఎందుచేత? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమున కంతకు నీ సొసైటీ యొక్కటియేనా? ఔను. ఎందువలన? సహకారధర్మములమీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునటు! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుటవలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పకపోవుటచేతను.

బ్రాంచిఆఫీసులస్థాపింపకనే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకారసంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకారసంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని, పాలసీదారులే వాటాదారులగుట.

నీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యము చేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.

# మూతలోనే ఉంది మహాత్మ్యం అంతా

[స్త్రీపాత్రలు ధరించు పురుషులు నున్నగా క్షవరం చేయించుకొని బాగా వెంట్రుకలు కలిగిన మూతలను—విగ్గులను—తలలకు ధరించాలి. ఈమూతను ధరించడం మరచి నటుడు స్టేజిమీదకు వచ్చాడంటే... ఈమూతను ధరించినా స్టేజిలో కొచ్చేసరికి మెడవిరుపు లెక్కు—వయి విగ్గు పట్టువదలి నటకుని స్వరూపప్రదర్శనమైతే... సామాన్యంగా మానవులదృష్టి మూసిఉన్న వస్తువులమీదికే పోతుంది. గొప్పగొప్ప కవీశ్వరులకుకూడా మూతలో వస్తువులే కావాలి. వీరు అన్నిటిని విడిచి ప్రత్యేకంగా మూతగల స్తనములు మొదలైన అంగాలనే తెగ వర్ణిస్తారు... మూతలోనే ఉంది మహాత్మ్యం అంతా.]

ఏవస్తువుకయినా, దృష్టిదోషము తగులకుండడానికయితేనేమి, చూస్తే సంగ్రహిస్తారనే భయంచేతనైతేనేమి, విదేశసరుకుతో సంబంధాన్ని తొలగించడానికయితేనేమి, యెదుటనున్నప్పటికి ఆవస్తువును దృష్టి కగోచరంగాచేసే సాధనానికే కొందరు ఏకభాషా, ఉభయభాషా, త్రిభాషాప్రవీణులు సమావేశమయి, దానియందలి గౌరవాన్నిబట్టి, దాని యుపయోగాన్నిబట్టి, యింకా యితర కారణాలవల్లను 'మూత' అనే బిరుదును శాంక్షనుచేసి, ఆబిరుదును యికేవస్తువుకు గార్డుపెట్టిలా తగిలించడానికి వీలులేనట్లుగా సదరువైన పేర్కొనబడిన వస్తువునకే జెంకునట్లు రిజిష్టరు చేయించి సమస్తజనామోదాన్ని పొందినమీదట అమలులోనుంచి ఆఖరుకు రూఢిజేస్తారు. ఈ మూత అనే పదము కేవలము అచ్చతెలుగంటే నమ్మండి! దీనినే సంస్కృతంలో 'అచ్ఛాదనం' అంటారు ఇంగ్లీషులో 'లిడ్' లేక 'కవర్' అంటారు. పొరుగులలో తమిళ, కన్నడ సోదరజనంగళ్ ఉంటే వారికో సలాం. ఈ మూత అనే పదాన్ని నామవాచకంగాను, క్రియగాను గూడ ఉపయోగించవచ్చు. క్రియగా నుపయోగించినపుడు మూయడమనీ, నామవాచకంగా నుపయోగించినపుడు మూయడానికుపయోగించేవస్తువు అనీ తెలుసుకోవాలి. ఈమూత అనే వస్తువు నెరగని మనుష్యుడీలోకంలో లేడు. అలాంటివాడెవడయినా ఉంటే వాణ్ణి ఉత్తరధృవములో కొన్ని పురస్కారాలుంచాలి.

మూతఅనేది లేనిది యేవస్తువు శోభించదు. ఇది లేకపోతే జరగదు కూడాను. ఈమూతలోనే ఉంది మహాత్మ్యమంతాను. ఆహారపదార్థాలమీద మూత అత్యవసరము: అదిలేకుంటే విదేశసరుకు విశేషంగా జేరుతుంది. పుస్తకాలబీరువాకు మూతవేయకపోతే, పుస్తకాలన్నీ బాలకుల స్వాధీనమయి ఒక అరగంటలో ఎడ్వర్టైయిజుమెంటు పేపర్లయిపోతాయి. కిటికీప్రక్కన బట్టలు తగిలించి కిటికీ మూయకపోతే తెల్లవారేసరికి తమదోవ తాముజూచుకుంటాయి. ఇనుపపెట్టె మూయకపోతే, 'లోలాలక్ష్మీః' అనే కాళిదాసోక్తిని స్మరించుకొని శిరోముండనంజేయించుకుని రోదనంజేస్తూ కూర్చోవలసి వస్తుంది. తెగదినీ, విస్తరిమూయకుండాలేచి బలిభుక్కులు వానిని మనమొహాన్నే పారేస్తా.

మూతలేవీ లేకుండ తిరిగేరకంగూడా ఉం కాని వారికి పాదరక్ష ప్రయోగాలుకూడా ప్రక ఉన్నాయి. పూర్వ్యం మన మూలపురుషులు మూతలేవీ లేకుండా ఉండేవారట. ఇప్పుడు వారు కనిపించితే మనము దేహశుద్ధి జేయక మానామా? కాని ప్రస్తుతం గూడా ప్రపంచంలో కొంతకాలంక్రిందటే, మూతలు లేనివారిసభ జరిగిందట. 'ప్రకృతి విరుద్ధంగా మూత లేమిటి' అని వారి వాదనట. లింగవివక్షతలేకుంటే ఆ వాదనకేమీ ఢోకాలేదు.

మూతబుట్టలంటూ కొన్ని ప్రత్యేకంగా ఉన్నాయి. వాని డ్యూటీ యేమంటే తమగర్భంలో బడ్డ యేవస్తువు

నయినా మూసివేయడమే! మన యుదర మొక గొప్ప మూత. ఎప్పుడేగాని, యెంతసరుకు వేసినాగాని మూయడమే దీనిపని ఇతరమూతలకు లోపల యేమిలేకున్నా అట్టే బాధలేదు. ఈమూతకు మాత్రము లోపల యెంతసరుకున్నా తృప్తిలేదు. సరుకు తక్కువయితే పీకనులిమేస్తుంది. ఈమూత చాలబాధించేమూత.

సామాన్యసంభాషణలోగూడ స్నేహితులు మూతనుపయోగించుటకద్దు. ఎవడయినా అసందర్భపుకోతలడ్డంగా కొయ్యడము మొదలెడితే 'ఇక చాలు, మూసిపెడుదూ' అని ప్రక్కవాడు వార్నింగిస్తాడు. ఇక గొప్ప ఉద్యోగస్తు లీమూతను చాల తీవ్రంగా ఉపయోగిస్తారు. బంట్రోతు యేదో చెప్పబోతే, తన కాకలి దహించుకుపోతే ఉగ్రుడై 'నోరుముయ్, షటప్' అని గర్జిస్తాడు. కొంచెం తెలివిగల బంట్రోతయితే తక్షణము ఆయననోరును బందుజేస్తాడు. మామూలు కండ్లకు గనపడే వస్తువులనేగాక రహస్యంలాంటి దృష్టి కగోచరమగు వాటినిగూడ మూయడం మామూలు. ఒక డింకోడికేదో కోమటిరహస్యంచెప్పి 'దీన్ని నీవు నీ జీవితాంతమువరకు మూసిఉంచాలి. మరణానంతరము ఎవరికయినాచెప్పు' అని అజ్ఞాపిస్తాడు. ఈరహస్య మహాత్మ్యమేమో గాని మరునాడే ఆరహస్యం గ్రహించినవాడు లోకాంతరానికి టికెట్టుచ్చుకోనేలాంటి గ్రహచారము తటస్థించేది.

ఈమూతను డ్రామాల్లో బాగా గమనించడానికి వీలుంటుంది. ఒక నటకుడు ఒక పద్యాన్నో, పాటనో సాగదీసి నాలుగయిదుమైళ్ళు పాడేసరికి శ్రోతల కసహ్య మెక్కువయి 'ఆగర్దభస్వరంగాణ్ణి నోరుమూసికోని సగౌరవంగా తెరలోకి వెళ్ళమనండి' అని అజ్ఞాపిస్తారు. దానితో, యిక అలస్యంచేస్తే విషమపరీక్షకు లోనుగావలసి వస్తుందని ఆనటకుడు తప్పుకుంటాడు. అట్లతడు తప్పుకోనకుండా మునుపటికంటె దీక్షంగా తన గానవిద్యాపాండిత్యాన్ని చూపిస్తే తక్షణం చెప్పులు, చేతికర్రలు రెక్కలు వచ్చి స్టేజిమీది కెగురుతాయి.

ఈనటకులలో కొందరు స్త్రీపాత్రలు ధరించు పురుషులు నున్నగా క్షవరంజేయించుకొని బాగా వెంట్రుకలుగలిగిన మూతలను తలలకు ధరించాలి. అట్టివానికే, కళోపాసనులైన బుద్ధిమంతులు చాలమంది 'విగ్గు' అని నామకరణంజేసారు. పొరబాటున యీమూతను ధరించడము మరచి నటుకు స్టేజిమీదకు వచ్చాడంటే వాడి కాకోజు కపాలమోక్షము అయిందన్నమాటే ఈ మూతను ధరించినా స్టేజిలోకొచ్చేసరికి మెడవిరుపు లెక్కువయి విగ్గుపట్టువదలి నటకుని స్వరూపప్రదర్శనమయ్యే విషమపరిస్థితి కూడ గలుగుతుంది. కాబట్టి యీమూతను జాగ్రత్తగా ధరించి చలనరహితచిత్రంలాగ ఉండాలి సింకేగాని యేమాత్రము అవకతవకలు గలిగినా చాల ప్రమాదము సంభవిస్తుంది. ఈమూత ప్రాణాపాయకరమైనది. కావుననే చాలమంది స్త్రీపాత్రను ధరించమని ప్రశిక్షపడతారు. వారికి స్త్రీపాత్రధారణయందలి అసహ్యం కారణంగాదు, యీమూత ధరించునందువల్ల యేమేమి అపాయాలు గలుగుతాయో అనే ప్రాణభయమే ముఖ్యకారణమని నాయభిప్రాయము. ప్రాణభయం లేదనుకున్నవారు యీమూతను ధరించే తీరుతారు. తమ సాహసాన్ని వెలిబుచ్చడానికి—విరహులు ప్రాణాలమీద ఆశవదలుకొని చల్లగాలిలో వెన్నెట్లో షికారులు గొట్టినట్లు, వీటితస్సలమందు! అవియే వారికి మృత్యుసమానములట!

సామాన్యంగా మానవులదృష్టి మూసియున్న వస్తువులమీదికే పోతుంది. వానిలో ఎంత ఆకర్షణశక్తి ఉందో! బజారులో పెట్టెలమీదబెట్టి అమ్మే ఫలహారాలు రుచించ వెవరికీని. కాఫీహోటల్లో బీరువాలలోనుంచిన ఫలహారముల మీదికే మనసుపరిగెడుతుంది. కారణం మొదటిదానికి మూతలేదు, రెండవదానికి మూతఉంది. పదిడబ్బుల అమ్మకంలోనున్న కళ్ళజోడు నుపేక్షిస్తారు రసజ్ఞులు. అదేకళ్ళజోడును మంచి పెట్టెలో నుంచి అద్దాలబీరువాలోమూసి ఉంచితే అదే ప్రతివాణ్ణి ఆకర్షిస్తుంది. కొందరు పంతానికయినా సరే, అంగడివాడు, పబ్లిగ్గా వంటామదము రాస్తున్నాడని తెలిసిగూడా దాన్నేకొంటారు.

ఇక సామాన్యపుసంగతి అలావుంచి గొప్పగొప్పకవీశ్వరులసంగతి తీసుకుందాం. వారికిగూడ యీమూత

పిచ్చే పట్టింది. వీరు అన్నిటిని విడిచి ప్రత్యేకంగా మూతగల అంగాలనే తెగ వర్ణిస్తారు. మహామహులయిన కాళిదాస ప్రభృతులు యీమూతవల్లనే ఆకర్షింపబడ్డారు. కాళిదాసు చెప్పాడు :— 'మధ్యేయథాశ్యామముఖస్యతస్య మృణాళసూత్రాన్తరమప్యలభ్యం' అని యెక్కడో నాలుగయిదు మడతలక్రింద దాగియున్న స్తనాల్ని ఉద్దేశించి వాటిమధ్య దారం దూరే సందైనా లేదనడం అత్యంత అన్యాయంగదూ! 'వసుధాలింగనధూసరస్తనీ', ఇది మరీ యన్యాయము. భూమిమీద దొర్లితే దేహంనిండా మట్టి అవుతుం దని చెప్పాలిగాని ప్రత్యేకంగా స్తనాలకేనా దుమ్ము అంటుకొనేది? 'నిమ్ననాభిః, శ్రోణీభారాలలసగమనా, స్తోకనమ్రా స్తనాభ్యాం' ఇది అనిర్వాచ్యం. ఈయనను మించిపోయినాడు శ్రీహర్షుడు. 'ప్లవకుంభౌభవతఃకుచావుభౌ.' అవి స్తనాలు గావట. ఈదడాని కుపయోగించే కుండలట. ఇంతటితో చాలు. స్థాలీపులాకన్యాయంగా కొన్నిమాత్రము ఉదాహరించాను. అందరికవులకు ఇదే జాడ్యము. 'మేము బయటికిరాముబాబో!' అని ఘోషిస్తూ దృక్పథాన్ని బడకుండ మూతలోపల దాగుకొనియున్న స్తనాదులను బలవంతాన బయటికిలాగి, ఒక శ్లోకంలో వదలక వందశ్లోకాలతో తెగ వర్ణించడమే మంటారు? ఈ ఆకర్షణశక్తి యెక్కడవుంది?

ఇక యెంతచెప్పినా మొదటి నాలుగుమాటల్నే బలపరచడ మవుతుంది. ఒక్కటిచాలు 'ఈమూత మనం తీసివేయవలెనన్నా సాధ్యమయ్యేదిగాదు.' సహజంగా ప్రకృతివల్లనే ప్రతివస్తువుకు మూతయేర్పడింది. శరీరానికి చర్మంమూత, వృక్షమూలానికి బెరడు మూత. గొర్రెలకు ఎలుగుబంట్లకు దట్టమైన బొచ్చు మూత. కంటిగ్రుడ్డుకు రెప్పమూత. ఇంతయెందుకూ? ఈ ప్రపంచానికే 'మాయ' అనే గొప్పమూత ఉంది ఈమూత వలననే మనము అజ్ఞానంచేత బాధపడుతున్నాము. మూతఅనేది బాధాకరమైనా 'తప్పనితద్దినం'అయింది. ఇది లేకపోతే దైనిక కార్యాలు జరగనే జరగవు.

—మొదలి వెంకటరామయ్య.


REGISTERED TRADE MARK: MESSRS REDDY & CO.

స్థాపితం. 1920.

# అత్యద్భుత కుష్ఠరోగనివారిణి

(రిజిష్టర్డు)

గుణములేదని ఋజువుచేయువారికి రు 500 లు బహుమానము.

**18** రకముల కుష్ఠులు, శ్వేతకుష్ఠు, తదితర చర్మవ్యాధులు యెంతకాలమునుండి జీర్ణించి యున్ననూ గ్యారంటీగా బాగుచేయబడును. 'అత్యద్భుత కుష్ఠరోగనివారిణి' యను దివ్యౌషధమువలన అనేకవేల రోగులు పూర్ణారోగ్యమును బొంది సంసారసుఖము ననుభవించుచున్నారు. చిరకాలమునుండి ప్రసిద్ధికెక్కిన కంపెనీ రెడ్డికంపెనీయే. యింజక్షనులవలన ఫలితముపొందని రోగులనేకులు మాయొద్ద చికిత్సబొంది పూర్ణారోగ్యమును బడయుచున్నారు. పైవ్యాధులకేగాక సెగ, సవాయి, శుక్లనష్టము, మూర్ఛ, మూలశంక మొదలగువ్యాధులకు మాయొద్ద గ్యారంటి ఔషధములున్నవి.

"నకలు మందులనుచూచి మోసపోకుడు"

పూర్తివివరములకు యీక్రింది యడ్రసునకు వ్రాయుడు.

గోపాలపురము పోస్టు (వయా) కొత్తపేట, తూర్పుగోదావరి జిల్లా.

## రెడ్డి అండ్ కో (రిజిష్టర్డు)

బ్రాంచి ఆఫీస్ : (కుష్ఠరోగచికిత్సానిపుణులు) వాల్తేరు.ఆర్.యస్.పోస్టు.

# అదృష్టం

౧

సుదర్శనుని మాటలు.

నా అదృష్టంవల్ల ఏగుమాస్తాగిరియో కాకుండా—బడిపంతులు ఉద్యోగం—నలభై రూపాయిలు నెలకి—కదలకుండా కూచుని వాగుతూఉంటే - పోస్తారు - దొరికింది. ఉన్నదాంట్లో - ఏమిటి మరిచేసేది - తృప్తిపడ్డాను. ఎందుకంటే నాన్నగారిచ్చిన భరణంకాదు - నాసొమ్ము - నే తినేది అని.

నన్నోపల్లెటూళ్ళో వేశారు తీసుకుపోయి.

నాకు ఉత్సాహమే జీవితం. ఉత్సాహంగా మాట్లాడేవాడు లేకపోతే నే మాట్లాడేవాణ్ణి కాదు - ఏదో చదువుకుంటూ ఒక్కణ్ణే కూచుంటానుగాని - నాకావూళ్ళో సరిఅయిన సమాజంలేదు. అందుకని గుమ్మంకదిలేవాణ్ణా—బడికివెళ్ళడం—రావడంతప్ప.

ఇంట్లో చూదామా అంటే—ఉపయోగంలేదు. నాభార్య రూపవతే—సమాజంలో చేరదు. కాని ఆమెఅంటే నాకు మహాగౌరవం. కథల్లో చెప్పినట్టు—ఏ దేవతో శప్తురాలయి నాభార్యఅయి పుట్టిందేమో అనుకునేవాణ్ణి. సమాజంలో చేరితేనో—అనిపించేది. నామాట యింకా పెదిమిలమీదికి రాకుండానే—ఊహించుకుని నాపని పూర్తిచేసేది. ఎప్పుడేనా సరదాగా తిడదామంటేనూ—విసుక్కుందామంటేనూ — ఏవంకా దొరికేదే కాదు.. ఏమయితేనేమి? క్రూరుణ్ణే అన్నా సరే—కత్తులో కలవలేదు.

అస్తమానం పుస్తకాలు తిరగవేయడం - వ్యాసాలు రాస్తూఉండడం—పత్రికలకి పంపుతూ ఉండడం - నాపని. శలవుల్లో హాయిగా రెక్కలు జాడించుకుని నాలుగుమూలలా నలుగురినీ చూచి వస్తూఉండడం వోపని.

అలాని ఊరుకోలేక పోయాను. సమాజంలో కలుపుకుందామని ప్రయత్నించాను. లాభం లేకపోయింది. వసనూరిపోయడం ఉపయోగంలేని పని అని - ప్రయత్నించి మరీ తెలుసుగున్నాను. ఇకామెని బాధపెట్టలేదు.

పిట్టల్లాగ మేమిద్దరమే - క్రమంగా ఆ ఏకాంతవాసం అలవాటయి జీర్ణించిపోయింది. పంజరంలో అలవాటయిన చిలకని వొదిలేశినా మళ్ళీవొచ్చి పంజరంలోనే దూరుతుంది. పెద్దఆకాశం చూసేసరికి భయంకూడా వేస్తుంది.

నాలుగుకాదు - అయిదుకాదు - పదిహేనేళ్లు - వెళ్ళిపోయాయి. ఇంట్లో భోంచేస్తూ ఉండడం - ఆబడిగదిలో - ఆపాఠాలే - చెప్పినవే చెప్పి వాళ్ళతో బాధపడుతూ ఉండడం అలవాటయిపోయి - ఎలా వెళ్ళిపోయాయో—వెళ్ళిపోయాయి.

విజయదశమి పండుగ ఆవేళ - అమ్మ అవతరించింది. "క్యార్" మని అరుపు వినబడేసరికి - పోస్టుజవాను ఆర్డరు తీసుకువొచ్చాడు- ఎనభై రూపాయిల జీతంమీద యీవూళ్ళోనే హెడ్‌మాస్టరుపని అని. నాతల్లి నాకు కష్టం లేకుండా తనకి కావలశిన డబ్బు తను తెచ్చుకు మరీ వొచ్చింది.

మా అమ్మపేరు - సీతా అని నోటినిండా పిలిచేవాణ్ణి. ఏడుపు వినబడితే సహించలేక పోయేవాణ్ణి. ఇప్పుడు - అమ్మతోటి కొంత కాలక్షేపం అవుతోంది.

మొదణ్ణుంచీ నానమ్మక—వ
విజయదశమినాడు ఎవరో
ట్లోకి వొచ్చి పడ్డ సరస్వతి

ఆలాతయారు చేదామని నా ఉద్దేశం. నాకు బడివేళపోగా మిగిలిన వేళలో సగంపైగా అమ్మకే వినియోగించేవాణ్ణి.

పద్దానుగోఏడు అమ్మకి. అమ్మే నాకు పెద్ద సమాజం – వేలమంది స్నేహితులూను. ఇదంతా ఎందుకు? అమ్మే నాకు విశ్వం. ఇప్పుడు అమ్మ పూర్తిగా సరస్వతి అయిపోయింది. నాప్రయత్నము ఫలంఅయింది. నా ఆనందానికి మేరలేదు.

ఆరోజులలోనే – పయికిరాసుకుంటే – తాలూకాగ్రామం – పెద్దపూరు – హైస్కూల్లో–ఆజీతంమీదే అసిస్టెంటుగా వెంటనే వేశారు. ఈపూళ్ళోంచి వెడితే చాలని హెడ్ మాస్టరీ వొదులుకున్నాను. గోతిలోంచి ఎన్నాళ్ళకో బయటికి వొచ్చినట్టయింది. లంఖణాలవాడికి పథ్యం వంటపట్టినట్టయింది.

కాని చిన్నజాలుగా విచారం నన్ను బాధించడం మొదలుపెట్టింది పక్కనే. ఎక్కడికీ – ఆశఅని అంతా అనవొచ్చు – కాని అలాకాదు. సత్యం లేకపోలేదు. అమ్మకి సరస్వతికి మల్లా బ్రహ్మదేవుణ్ణి కట్టిపెట్టడం నాకిష్టంలేదు. అమ్మకి నచ్చాలి–నాకు నచ్చాలి – ఆలాంటివాడు వరుడుకావాలి. పెద్ద విషయం. నాతలకి దాటిపోయింది.

అనేక సంబంధాలు – విన్నవన్నీ – వెతిగాను. తిరగడం మొదలుపెట్టాను శలవుపెట్టి. ఏవెలా ఉన్నా – చదువుకొన్న– కుదురయినవాడుకావాలి – నాకున్నదంతా అమ్మకే కనక. నిద్దట్లోకూడా అదేధ్యానంగా వెతకడం ప్రారంభించాను.

## ౨

### సాక్షి మాటలు

క్షేమ మనసారా – రెండుకళ్లతో
-సారి అయినా – ఎక్కడ దిష్టితగులుతుందో అని భయం. బంగారు – పోతపోశిన బొమ్మ.

ఏమల్లరిచేశినా – ఆం. . .అనడానికి ప్రాణం వొప్పేదికాదు. దేవుడు పెట్టెలో కృష్ణుడు విగ్రహాలు పెంటమీద పారేశేది. ఏమని అనడం – లేకలేక కలిగిన నా బంగారుబిడ్డని– నాబిడ్డకాదది – దేవత. తన చదువంతా నాకు మాటల్లో చెప్పేశింది.కూడా పనిచేస్తూ యిట్టే చెప్పేది. నేను వారి సమాజంలోకి ఉపయోగిస్తానని వారెన్నడూ అనుకోలేదు—నా బిడ్డ వారి సమాజంలోకి నన్ను కలిపింది. నాకు నిజంగా—యింకేంకావాలి? నాజీవితంలో పూడని లోటు—లోటు అని చచ్చిపోవలశినంత లోటు—నాశక్తి వినియోగించి—ఉత్సాహంగా పనిచేశినా తీర్చుకోలేని లోటు—తీర్చి నాకు బ్రహ్మానందంకూర్చింది. నాదైవతమే నాముద్దుబిడ్డయి నాకు పుట్టింది. నా లోటు తీర్చేశింది.

ఎంతేనా శ్రమపడ్డారు మావారు–అయినప్పటికీ – మంచి సంబంధం కుదిరినందుకు – శ్రమే అనిపించిందికాదాయనకి.

పెళ్లినాడు కొంగుకొంగు ముడివేసుకుని ఇద్దరూ నమస్కరిస్తూఉంటే—నాబిడ్డ చూపిన వినయం—నామహాగర్వానికి హేతువు.

అప్పుడు—వప్పగింతలవేళ— నా బిడ్డని వప్పచెప్పాక— నాబిడ్డనే— నాదైవతాన్నే వప్పచెపుతా—అని నివ్వెరపడిపోయాను.

కాలానికి పనియేముంది? మనుషులకి పని గాని–గిరగిర తిరిగిపోయింది.

'విదియా సోమవారం వొచ్చి తీసుకువెడతాం. ఆవేళమంచిది. దాటితే మళ్ళీ యీ మధ్య వీలు'కాదని వియ్యాలవారు ఉత్తరం రాయించారు. నాబెంగకి హద్దులేదు–నాలుగు రోజులలో వెళ్ళిపోతుందని. నాకు ఏవిధమైన

శ్రమా లేకుండా—పాఠాలు చెప్పేవారు ఎవరింక ? అమ్మా అని వినబడుతుందా తల్లి గుమ్మం దాటాక ? ఎలాగో అని—

సోమవారం ప్రయాణం చేశారు. అమ్మకి కొనవలసినవి వారు ఎన్నో కొన్నారు. యింతకంటే చెయ్యబోయే కార్యాలేమున్నాయి కనక ? భోజనాలయాయి మూడుగంటలకి ముహూర్తం. మేనా గుమ్మంలో పెట్టారు.

తలంటుకున్న తల—పట్టుచీర కట్టుకుంది. చక్కని కళ్ళకి కాటుక తీర్చి పెట్టుకుంది. నా పాదాలకి నమస్కరిస్తూ ఉంటే హృదయం పగిలిపోయింది. రెండు చేతులతోటీ లేవదీసి నీళ్ళతో నిండిన కళ్ళని హృదయానికి అద్దుకుని నా కళ్ళు తుడుచుకున్నాను. క్షణం మాట రాలేదు—వొణికిపోతూన్న పెదవులతో "వెళ్ళివొస్తాను అమ్మా!" అంది. ఒక్కమాటు కౌగలించుకుని ముద్దు పెట్టుకున్నాను బుగ్గలమీద. పొర్లివొస్తూన్న దుఃఖాన్ని ఆపుకున్నాను. వారికి కూడా నమస్కరించింది బిడ్డ. తీసుకువెళ్ళి మేనాలో కూచోపెట్టాను. మేనా వీధిమలుపు దాటిపోయిందప్పుడే.

నా కళ్ళంట – ఒకటేధార – ఏడుపు పొంగిపోయింది. మంచంమీద కూలబడిపోయాను.

కోపగించి లక్ష్మి సరస్వతు లేకమయి వొదిలి వెళ్ళిపోయినట్టు – ఇల్లంతా చిన్నపోయింది. చీకటిమయం. తలచుకున్నకొద్దీ గుండె నీరయిపోయింది. తోచదు—పనిచెయ్య బుద్ధేపుట్టదు. బెంగ—బెంగ—

వెళ్ళింది మొదలు ఇంతవరకు—నెలరోజులయింది – ఒక్క ఉత్తరం రాలేదు. ఎన్ని ఉత్తరాలు రాశారు ? హఠాత్తుగా నా సీతగని రోగం ఏమిటి ? నా దేవత ఒక్కమాటు నా కళ్ళకి కనపడకూడదు ?

మంచంమీదనుంచి లేవలేక పోతున్నాను బతకనని – ఏమో – అనిపించింది. బిడ్డ మళ్ళీ కళ్ళబడదేమో అని ఒకటే బెంగ—ఒకటేవాంఛ మిగిలింది. దేవుడికి యిష్టంలేదేమో ? నా దేవతకి దయలేదూ ? వుంటే కనబడదూ ?

ఒక్కమాటు ముద్దుచేతులతో తలదువ్వి ముడివేస్తుందా బిడ్డ ? ఇంక బతకనని నాకీ అపనమ్మకం – ఏమిటో బాధించడం మొదలు పెట్టింది.

నాకు బాగా జ్ఞాపకం – ఓనాడు ఎందుకో గాని – ఓ దెబ్బ వేశాను. తండ్రితోనయినా చెప్పకుండా భోజనంచేసి నిద్రపోయింది. నేవెళ్ళి పక్కలో పడుకుని నా బిడ్డని లాలించేదాకా మనస్సు కుళ్ళిపోతూనే వుంది.

వెళ్ళేరోజున దేవిదగ్గర పాడినపాట యింకా నా చెవిలో గింగురుమంటోంది.

## 3

### సీతమాటలు

నా పెళ్ళికోసం మా నాన్న పడిన శ్రమలకి—నే కొన్ని జన్మలు ఋణస్థురాలనయి వుండాలాయనికి. నిజంగా—రెండేళ్లు ఎలాతిరిగాడు కన్నుమూయకుండా—నా పెళ్ళి అయాకే హాయిగా నిద్రపోయిం దాయన.

మావారు చామంచాయగా వుంటారు. నిజంగా—మా నాన్నని ఎన్నిజన్మాలకేనా మరిచిపోతానా ?—నేను ఊహల్లో సృజించుకున్నవారే—సరీగా—మావారు.

దిద్దుకుందామంటే నా వశం కావడంలేదు. ఏ మపగాధంచేస్తూన్నానో తెలుసుకోలేక పోతూన్నాను అత్తగారికి. నామీద ఎందుకో ఆమెకి హద్దులేనికోపం ? నేనామె విషయంలో ఏలోటూ చేసినట్టు—నా ఊహాకి అందినంతలో— ఎక్కడా గురురావడం లేదు. ఏమీలోటు చెయ్యలేద ంకూడాను.

నాలోటు ఏమిటో—ఒక్కమాటు ఇది అని నిర్దేశించరు. ఇంక—నేనేం చెయ్యగలను యింక? నాయెరుకలో లోటులేకుండా చెయ్యడం నావిధి—అదే నేచేసేపని.

మావారికి తల్లి అంటే—అమితమయిన భక్తి, అపారమయిన విధేయత. నేను వాటికి ఏమీ అడ్డంవెళ్ళి ఉండలేదని నానమ్మకం—నాభర్త నమ్మకమూను. అత్తగారి విషయంలో—ఇంకా నాభర్తనే ఉపేక్ష చేసేదాన్ని కొంచెం - మావారి నిర్బంధంవల్ల—

నేను మావారి పాదసన్నిధినికూడా నించోటానికి నాకు అర్హతలేదని మా అత్తగారి ఉద్దేశంలాగ స్పష్టమయింది. అంత—అకార్య మేమీ చేయడంలేదనే ధైర్యంచేత-నన్నునే నంతగా నిందించుకోడం మానేశాను.

మావారుమాత్రం—నాకీయవలసిన గౌరవంకంటె అధికమయిన గౌరవాన్నే ఇచ్చేవారు. నాకు బాగా తెలుసును. నాహృదయంలో ఉన్న ఈ ఆందోళన వారు తెలుసుకుంటూన్నట్టు ఒక్కొక్కప్పుడు వారి మౌనంలో చదువుకునే దాన్ని.

అత్తగారి అసంతృప్తి పూర్తిచేదామనే దారుణప్రయత్నంలో— నాకూ—నాభర్తకీ విద్యావిషయప్రసంగాలకి సమయం ఉండేదికాదు ఎక్కువగాను. అందుకు నేనూ నాభర్తాకూడా ఒకరికి తెలియకుండా ఒకరం అసంతృప్తిపడేవారం. అయినా తప్పనిది మరి!

అత్తవారింటికి నేనొచ్చింది మొదలు ఒక్కమాటు—మా క్షేమం తెలుపుతూ ఉత్తరం వ్రాయడానికి అత్తగారి వుత్తరవులేదు. మానాన్న నాలుగురోజులకోసారి—పెద్ద వుత్తరం—తప్పకుండా రాశేవాడు. రోజూ—ఎప్పుడో ఓవేళ—కొత్తవుత్తరం వొచ్చేవరకూ పాత[illegible]కుంటూ వుండడం అలవాటు నాకు.

యీమధ్య అమ్మకి జబ్బుచేశిందని రాశాడు నాన్న. నాకు తొందరకలిగింది లోపల. మావారు నావుత్తరాలన్నీ చదివేవారు—అయినాసరే—ఏమీ అనకుండా ఊరుకున్నారు. నేనేంచేయను? మౌనం ముద్రించుకున్నాను. క్రమంగా—జబ్బు ఎక్కువ అవుతూన్నట్టు—నన్ను చూడాలని అమ్మ అంటూన్నట్టు రాశాడు నాన్న. ఆవుత్తరాలు చదువుకుంటూవుంటే గుండెలు బెదిరిపోతూ వున్నాయి. నామాట వారు ఆలోచిస్తూనే వుండేవారు. అయినా అమ్మమాట తప్పదు.

నే నభాగ్యురాలిని. అదృష్టంలేదు. అత్తగారు అందుకే అనుజ్ఞ ఇవ్వలేదు. అనుకుని ఊరుకున్నాను. నేనేమీ ఇక అడగి—చిక్కులు తెచ్చిపెట్ట దలచుకోలేదు. నా దురదృష్టానికి.

తలుచుకుని తలుచుకుని కుళ్ళిపోతూ వుంటాను—బతికివుండగా అమ్మని కళ్ళతో చూడలేక పోయానని. మావారు—నావిషయంలో అయ్యో అనుకోడం నన్ను ఓదార్చేది.

ఆఖరునేనా పంపకుండా క్రూరంగా ప్రవర్తించానేమో అని పశ్చాత్తాపపడుతున్నట్టు అప్పుడప్పుడు వారి ఆలోచనలో వినబడుతూండేది.

నాకు మహాదుఃఖం పొల్లిపోయి వొస్తున్నా—అందులో తన్మయురాల నయిపోయినా—ఎలావున్నా—వారు—ఒక్క కన్నీటిచుక్క నాకోసం విడిచిపెడితే నాదుఃఖమంతా తుడుచుకు పోయేది. మహానందం అయేది.

పెళ్ళిరోజున మంగళస్నానాలు అయాక పట్టుచీరకట్టి—కుంకుమబొట్టు పెట్టి—మా అమ్మ నాతో అన్నా! ఇంక మాసొమ్మువు కావే అనీ, కంట తడిపెట్టుకోడం తలుచుకుంటే గర్భనిర్భేదం అయిపోతోంది.

నేనొచ్చే ముందరే- ఓమాటు-నేను పెంకి

తనంగా మాట్లాడితే—మీఅత్తారింటికి వెళ్ళిపోవే-అక్కడ నీయిష్టం అంది మాఅమ్మ. నాకెంతో అసూయకలిగింది. 'వెళ్ళిపోతానులే-వెళ్లాక మళ్ళీ నీమొగంచూస్తానా' అన్నాను. నా ఎదురుకోడంచూసి—కష్టపడి అందులో—'ఎంత కోపంవొచ్చిందే' అని అమ్మ నవ్వింది నా మానుపానికి. శపించినట్టు అల్లాగే మళ్ళీ అమ్మమొగం చూడలేకపోయాను. నావాక్కులో నిజంగా ఎంతవిషం వుందీ, అని నన్ను నే నిందించుకుంటూ కుమిలిపోతాను.

నేను మావారితలకి నూనెరాస్తూంటే చూశింది—వచ్చేరోజునే—మేఘం మెరుపులాగ అందంగా వున్నారే, అని మురిసిపోయింది. మమ్మల్నిచూసి మహానందపడే అమ్మ—మళ్ళ—ఎన్నటికీ—కళ్ళకి కనబడదంటే—గుండెలు ఆగిపోతూవుంటాయి.

ఎంతదుఃఖంలో వున్నానరే—సీతా అని వారు పిలిస్తే - ఆనందవాహినిలో తేలిపోయేదాన్ని ఒక్కమాటు.

మాఅమ్మకి—పెళ్ళివేళ—అత్తగారు — 'నాకు నీమామగారు చేయించియిచ్చారు. పురాతనసంగ్రహం సుమీ!' అని చేతికిపెట్టిందిట. మాఅమ్మ దాన్ని ప్రాణంలా—భద్రంగా దాచుకొనేది. 'నీకంటె ఎక్కువ ఎవరే అమ్మా' అని అది నావేలికి పెట్టింది అమ్మ, 'జాగ్రతసుమీ!' రెండుసార్లు చెప్పింది. ఆ వుంగరమే మాఅమ్మఅని అస్తమానం చూసుగుంటూ వుంటాను. ఆమె అమూల్యప్రేమ నాకు మూటకట్టి యిచ్చింది.

నా అదృష్టం అంతే అయినప్పుడు—అందరిసీ అంటే—ఏమయినట్టు? నన్ను—బెంగపోయిందాకా - రెండుమూడు నెలలు మానాన్నదగ్గర వుంచుతారేమో అనుకున్నాను. వెంటనే రావాలన్నారు—అంతే బయలుదేరాను. మానాన్న అడుగుతానంటే - మావారు కష్టపడతారని-నొద్దు నేనెళ్ళిపోతానని చెప్పాను కూడాను. మానాన్న కప్పుడు—నే నలాఅంటే—ఇస్సీ! అనిపించిం దాఖరుకి. ఏంచేయను?—నేను నడుచుకోవలశిన క్రమం అంతే—

నావంట్లో—నిరంతరచింతచేతో —ఎంచేతో—స్వాస్థ్యం తప్పిపోయింది. అయినప్పటికీ—నాపనులలోమాత్రం నే బద్ధకించడం లేదు. కొద్దిగా చిక్కిపోతూన్నట్టు తోచింది.

ఇంతదుఃఖంలో—ఇలాటప్పుడు — ఒక్కమాటయిన - అత్తగారు అయ్యో అని అనుకోకపోవడం—నాకుబాధ అనిపించిం దాఖరుకి. కాని అది నాదురదృష్టమని ఇదివరకే సమాధానంచెప్పుకున్నాను.

నాజబ్బుకి లక్షణం—క్రమంగా చిక్కిపోవడం—పాలిపోవడం—సత్తువతగ్గిపోతూ వుండడమూను. అయినను—వుత్సాహం అంతా సత్తువకింద వుపయోగించేశాను. ఇక అయిపోయింది అదికూడా—మిగిలింది శరీరం. క్రమంగా నడవడానికి కూడా సామర్థ్యం తగ్గిపోయింది. మంచంపట్టాను. ఇంత మార్పుకి రెండు నెలలు పట్టింది. వారు మానాన్న కింతవరకు జాబు రాయనేలేదు. నాన్న కేమీ నా వరస తెలియదు కదా !

నిజంగా—మానాన్నకి తెలుస్తే శలవు పెట్టి ఇక్కడికి వొచ్చి తగ్గేదాకా వుంచుంటాడు—వారు అక్కడికి పంపమని అంటేను. అన్నివిధాలా ఆయనకి నేనొక్కత్తేనేకాదూ? ఇక్కడ ఎవరికీ ఇష్టంలేనిపని అది.

మానాన్నవుత్తరాలు వొచ్చేవి. ఇక్కడి సంగతి రవంతైనా ఎరగడు. నేనెప్పుడూ బాధపడుతూవున్నను రాయమని అనలేదు. ఆఖరికోరోజున బాధపట్టలేక వారితో అన్నాను. వారు నాకు మానంగా సమాధానం యిచ్చారు. అర్థంఅయింది. నాచాపల్యానికి నే

నెంతో పశ్చాత్తాపపడ్డాను.

మానాన్న నాశ్రేయస్సు సంతతంకోరుతూ వుండేవాడు. ఆశ్రేయస్సు నాకిచ్చాడు. అనుభవించమని చెప్పేడు. అనుభవిస్తూన్నాను. తరవాత సంగతు లాయన కెందుకు ?

ఏంకావాలన్నా మావారు స్వయంగా తెచ్చి-ఈయవలశివచ్చినంత పరాధీనత నాకు వొచ్చింది. వారు ఇస్తూంటే వొద్దనేదాన్ని. బలవంతాన ఇచ్చేవారు. ఏంచేయను?-తప్పేది కాదుమరి! ఇంక నాకు చచ్చిపోయినా లోటు లేదనిపించింది. వారి మహాప్రేమఅంతా విప్పి నామీద పోశేశారు.

స్వయంగా కాఫీకాచి యిచ్చేవారు. నా రింజపండు వొలిచి తొనలు తీశిపెట్టేవారు. సమస్తమూను. నిజంగా ఆయన అంతదయ చూపడానికి అర్హతకలదాన్ని కాదని నమ్మకం.

వారలా చేస్తూంటే—ఊరుకుంటే మహా పాపం చుట్టుకుంటుందని వొణికిపొయేదాన్ని. చల్లని వారి కరస్పర్శ నాసందేహాలకి సమాధానములుచెప్పేది. కాని నాన్నకి వుత్తరం రాయలేదని బెంగ—

తలనొప్పివొచ్చి బాధపడుతూవుంటే—తలనొప్పా? అని చేయివేసి చూసేసరికి మంచుగడ్డ పెట్టినట్లు తలనొప్పి ఎగిరిపోయేది. ఆ చల్లని కరస్పర్శకి ఎన్నిజన్మలకైనను వారికి నేను ఋణపడి వుంటాను.

ఎన్నిచేస్తూన్నా — ఆరోజుకారోజు దిగనారిపోతున్నాను. మందులుతోటి—నోటి రుచిపోయి—నాలికి బండపారింది. విసుగుపుట్టింది మందంటే—ఆఖరుకి.

నే నింక చచ్చిపోతానని నమ్మకం కలిగింది. ఆరోజున మాటరావడం మానేశింది. బాగా మాట్లాడగలనని జ్ఞానం వుంది. కాని రాదు. నాన్నని చూడకుండా చచ్చిపోతానేమో అని ఆందోళన. ఆఖరికి వొదిలేశానది—లాభంలేదని కష్టపడి సంజ్ఞ చేసి- వారిపాదాలు నాకిమ్మన్నాను. వారు నా ఆందోళనంతా గ్రహించి—పరవాలేదని వారించారు, ఏంమాత్రవేశాగో—చక్కగా నావూహకి తగినట్టు మాట్లాడడానికి నోరువొచ్చింది, నాభర్తగారి పాదాలు—కోరి—ధైర్యంగా వుంటుందని— రెండుచేతులతోటి పట్టుకుని కళ్ళకద్దుకున్నాను. యిక మృత్యువు ఆహ్వానాన్ని మన్నించడానికి సిద్ధం అయినా పరవాలేదనుకున్నాను. కొద్దిగా పాలుపోశారు చంచాతో వారు. ఆమహాదారుణమయిన నీరసంలో— అది—బలమే మరి—వచ్చింది.

వాకట్లో జోడుచప్పుడయింది—నాకు బాగాగుర్తు—మానాన్న జోడుచప్పుడే అది. వొక్కమాటు సంతోషంతో నిండిపోయాను.

మానాన్న మంచంమీద కూచుని ఘంటసేపు నిర్ఘాంతపడిపోయి చంటిబిడ్డలా ఏడిచాడు, ఆయన—రాకవల్లా—ఆయన అధైర్యంతోను—నాకు బతుకుమీద ఆశ పోయింది,

నా చేతులు కాళ్లు మాటిమాటికి ముట్టుకోడం—నా పెదవులు పరీక్షించడం—నాడి చూడడం —నన్నేనో జబ్బునుగురించి ప్రశ్నలువేయడం—నాకు బాగా తెలుసును.

నే నేమో కోటిసంగతులు నాన్నని అడగాలి అని మొదలుపెట్టాను, నెమ్మదిగా— రాత్రి— ఇప్పుడు కాదు—వుదయం—అన్నాడు నాన్న.

నా ఆయుర్దాయంలో మరిఒక ఉదయం లేకపోయింది.

—కనకదండి గోపాలకృష్ణశాస్త్రి.

# 'మన వర్తి కాదు, మైనరు వాటా'

చిత్రం ఏమిటంటారా! అహం ఉంటేనే కాని ఆట సాగదు. మోతాదు జాస్తీఅయితే మోజు తప్పుతుంది.

'వాళ్ళకీ వాళ్ళకీ సరిపడనిసంగతులు ఏమైనా ఉంటే, ముఖాముఖీని, 'నువ్వా?, నేనా?' అని కుస్తీ పట్టేయ్యాలి. లేకపోతే గుక్కెడు నీళ్ళు గుడ్లల్లోనే దిగమింగెయ్యాలి. అంతేకాని ప్రాధేయపడుతూ కాళ్ళ దగ్గిరకు వచ్చిన అతగాణ్ణి వేళ్ళతో తోసెయ్యడం ఏం అంత ఘోరానాగా ఉంది' అన్ని కన్నవాళ్ళూ, విన్న వాళ్లూకూడా ముక్కుమీద వేలేసుకున్నారు, జోగమ్మ గారి జోరుకి.

ఆవిడేనా తెలివితక్కువదేమానంటే—చూడండి - పదిమంది పిల్లలతల్లి. పసిపిల్లల ఉగ్గుపాల దగ్గరనుంచీ ప్రతీవిషయం ఆవిణ్ణి సంప్రదించకుండా చెయ్యరు. గ్రామంలోని మహిళావతంసాలు. అయితేఏం? ఆవిడ 'అహం' అతిచారదోషాన్ని పొందింది. తాను గుమ్మం దిగదు. తనదగ్గిరకి అందరిని రప్పించుకుంటుంది. తాటాకులు కట్టి వెనకనే 'యిసుకో' అంటుంది.

* * *

జోగమ్మగారి జోడు విశ్వనాథం. శుద్ధ అమాయిక జీవుడు. సహజమే కాదండి. ఎడ్లజతలోనైనా ఒకటి అందగాడు. ఒకటి పనివాడు. అమ్మగారు నట్టింట అడుగుపెట్టింది అగాయతు, పట్టణవాసం. చూచిం దల్లా కొనడం. కావలసినదల్లా కొనిపించడం ఆమెమతం. పైగా ఆయేటా, యీయేటా, కని పెంచేతత్వం. గ్రహచారం మారింది. ఉన్నది తరిగింది. ఊహ బలిసింది. చేతి కందిన పెద్దబ్బాయి తల్లిపోలిక. ఇక ఆడపిల్లల విషయమంటారా? పురిటికివచ్చే దొకామె. పురుడు పోసుకుని, అత్తింటికి తర్లివెళ్ళే పిల్లతల్లి ఒకామె.

* * *

పెద్దబ్బాయి దినచర్య ముప్పూటా పీటవిరిగేటట్టు బస్తాబందీచేయడం. రకరకాల ముస్తాబులు. అంట్లు తోమే 'ఎల్లి' దగ్గరనుంచి అతిమర్యాదస్తురాలివరకు ఆయన పలుకరించని వాళ్ళుండరు. పళ్ళుపళ్ళుగాపరుపు మంటబెట్టని వాళ్ళుండరు. కోర్టువిషయాలలో సలహాదారు. పార్టీలలో కక్షీదారు. మొగుడు పెళ్లాల తగవులలో మధ్యవర్తి. తల్లీ పిల్లల కలతల్లో తక్కెడ. అప్పసెల్లెండ్ర ఆర్భాటాల్లో 'అత్తీసరు' (అస్పెసరు). ఎడ్డెజాతికి ఏజంటు. అధారిటీకి అత్తగారు. 'ప్లేటు'కి పిడుగు.

లక్ష్మి ఆయింటి పెద్దకోడలు. సంసారికి 'అందం అంటె ఎక్కడికి' అనుకుంటే ఆక్షేపణకు అవకాశంలేని చక్కదనం. ఇంట్లో అలుకులదగ్గరనుంచి కుంభం విస్తట్లోకి అమర్చే పర్యంతం చాకిరీ ఆమెదే: చిన్నపిల్ల అవడంచేత తెలిసీతెలియకుండా కించిత్తు నోరువిప్పితే అత్తగారి 'అర్ధిసెన్సులు.' బాబుగారి బజాయింపులు: ఆడపడుచుల అదమాయింపులు. మండలివారి మందలింపులు కూడాను.

జోగమ్మగారి నేస్తురాలు, సోంభొట్లుగారి సోమిదేవమ్మ: పూర్వాచారంలో నవనాగరికమిళాయింపు. మాటల్లో వెకిలితనం. చేతలలో చిలిపితనం.

సోంభొట్లు, కూతకీ మేతకీ కూడా బంటు. పైసాకోసం పాకులాడే తత్వం. జీవితములో ఏకొంచమైనా అనుభవించాలని ఉబలాటం ఉందేమో కాని, అదే అలవాటు అయితే జీవితాంతం చప్పబడుతుందేమో నని కంగారు, కలవరపాటున్నూ; ఆశ ఉంది కాని అజీర్ణ భయం. 'తృప్తాస్మః' అంటాడుగాని నాలిక చివర మాట కాని నాభిదగ్గరది కాదు. ఏమైతేనేమి యిప్పుడు నాలుగు రాళ్ళు, నాలుగు కాయలు కలవాడు.

* * *

ఓ నాడు.

మధ్యాహ్నం రెండుగంటలు కొట్టారు. అచ్చట్లకి ముచ్చట్లకి అమ్మలక్కలు, జోగమ్మగారి అరుగుమీదకి చేరారు.

జో:—సూరమ్మగారు ఎప్పుడో దిగింది ఊళ్ళోకి.

సో:—కొన్నాళ్ళు యింకా ఆతూతురుదగ్గరే ఉండాల్సింది. ఏంబావుకుందామని వచ్చిందో కాని. కోడలికీ తనకీ షష్ఠాష్టకంగదా. ఈవిడచేతి ప్రసాదం ఆవిడ ముట్టదు. ఆవిడవండుతే యీవిడికి పనికిరాదు.

జో:—మరి ఎల్లా ఏడుస్తున్నారు ఓ యింట్లో ?

సో:—అత్తగారు మధ్యాహ్నం మడికట్టుకుంటుంది పాడిఅన్నం రాత్రికి మూతేసుకుంటుంది కోడలు రాత్రి వండుతుంది. మర్నాటికి ఆవిడ నిలవేస్తుంది. మొగాళ్ళకేం తెలుస్తాయి. తెలిసినా నోరు నొక్కుకుంటారు. కడుపుచింపుకుంటే కాళ్ళమీదే పడుతుందని.

జో:—వాళ్ళనే అనుకోనక్కరలేదు. ఉపవాసాలు చేసే అత్తగార్లూ ఉన్నారు. కష్టాలుపడే కోడళ్ళూ ఉన్నారు. మాయింట ఆబాధలేదు ఓవేళ కాస్త అన్నంమిగిలినా, పిల్లలు ఎవరూతినరు. మాలక్ష్మమ్మ దెయ్యం ఉందికాదూ ? ఆవిడకే నైవేద్యంపెట్టాలి.

సో:—అన్నట్లు లక్ష్మమ్మని పుట్టింటికి పంపుతారా పురిటికి ?

యింకోఆమె:—పురిటికేనా పంపరేమిటి ?

జో:—ఎక్కడికి వెడుతుంది వల్లకాటిలోకి? ఆ పీనుగులు మనకి యింకా సొమ్మివ్వాలి. యిక్కడికి నాలుగేళ్ళయింది. పైసావసూలులేదు. ఆవ్యాపారం దమ్మిడీపైసలకోటి పైసలవ్వాలి. యీవిడ గుమ్మం కదలాలి. మావారన్నారా—ఒట్టి మొద్దుస్వరూపం - అబ్బాయి ఉన్నాడంటే, వాడికేం తెలుసు పుల్లయ్య ! ఇంక అన్నింటికీ నేనే ఏడవాలి. పోనీ మొగుడన్నవాడు 'ఏమర్రా! నాడబ్బుయిచ్చేదా? ఇవ్వండా? లేకపోతే మీపిల్లని మీరు తీసుకుపోండి నాకక్కరలేదు. కావలిస్తే యింత మనవర్తిపడేస్తాను, అని బెదిరించాలి. ఏమీలేదు. 'నాకేం తెలుస్తుంది. మా అమ్మని అడగండ'ని నానెత్తిమీద బరువేస్తాడు. నేనే అనాలి. నేనే పడాలి. ఇంతకీ వచ్చిందేమైనా ఉంటే, తనూ పెళ్లాము కులుకుతారుగాని, నాకేమైనా ఓచిల్లిగవ్వైనా యిస్తారా? రవ్వారట్టూ గంగానమ్మది, అట్టూపెట్టూ అసాదివానిదిన్నీ.

సో:—ఆడపిల్లలు కలవాళ్ళం, మనకు యీలాంటి పట్టుదలలు కూడవండీ.

జో:—చాల్లెద్దురూ చెప్పొచ్చారూ ? వచ్చేచోటు కనకనే నిక్కచ్చి చెయ్యడం. లేకపోతే వారిచ్చేదేమిటి ? మనం పుచ్చుకునేదేమిటి ? మన్నూ, మశానమూను.

* * *

'ఏమయ్యోయ్, ఆస్తే పదిమాటలదాన్ని కాను. నాకు రావలసింది యిక్కడపెట్టు. నీచెల్లెల్ని తీసికెళ్ళు. మళ్ళీ పంపకపోయినాసరే. మావాడికి యింకోదాన్ని చూసుకుంటాము. పెళ్ళికాకుండా ఉండదు.'

'రామ ! రామ ! ఎంతమాటన్నారండీ ! అత్తగారూ!—మాపిల్లనిగురించే మీకు సొమ్మియిచ్చే ఏర్పాటు. కొంత యిచ్చాము. రోజులు తారుమారయ్యాయి, కన్నుపొడుచుకున్నా, కానీ కనిపించడంలేదు. మీకు యివ్వవలసిన మిగతాబాకీక్రింద మీరు కోరినంతభూమి వ్రాయించుకోండని, బ్రతిమాలుతూంటే, మీరు 'పట్టిన కుందేటికి మూడేకాళ్ళంటే' ఎల్లాగండీ అమ్మా!' అన్నాడు సుందరం - లక్ష్మి అన్న - పురిటికి చెల్లెల్ని తీసుకువెళ్లటను వచ్చి.

జో:—'ఇదిగో ! పిచ్చిగా నాతో పదిసార్లు చెప్పక్కరలేదు. మీభూమి, గంగలో కలుపుకోండి. నాడబ్బు నాకు పారెయ్యి. అంతలేనివాళ్లు ఆనాడే చెప్పకపోయారూ ? మీపిల్ల మీయింటిలోనే ఉండును. అంతగా ఏడిస్తే యింతమనవర్తి పడేద్దుము. ఏరుదాటి తెప్పతగలేసే మచ్చని తెలుసుకోలేకపోయాం.'

'అత్తగారూ! కోప్పడకండి. అందరమూ సంసారులమూ, పిల్లలుకలవాళ్ళమూనూ. మాఅమ్మ, మాచెల్లెల్ని చూడాలని కంటికీ నేలకీ ఒకటే ధారగా ఏడుస్తూంది. ఒక్కమాటు ఆవిడకు చూపించి, మీశెలవుప్రకారం, ఎప్పుడు తీసుకురమ్మంటే అప్పుడు తిరిగి అప్పగించివేస్తాను. ఆడపిల్లలకి పుట్టింటి అపేక్ష తుడిచేస్తే మాత్రం పోతుందా ? కాదని ఎప్పుడూ పుట్టినింటే ఉండడం ధర్మమా ? నాప్రార్థన అంగీకరించండి - దయ

యుంచి ఒక్కసారి పంపండి!'

'చూడు, ఒక్కొవ్! నేచెప్పదలచుకున్నది చెప్పేశాను. ఇంక నాతో వాదించకు. మొదలే చెడుతుంది. అయ్యయ్యో యిదేమి గ్రహచారమయ్యా మాకు?— సొమ్మూ లేదు వడ్డీ లేదు. పైగా ఊరపందిని మేపినట్టు ముప్పూటా కూచోపెట్టి మేపుతున్నాము. ఇదో దండుగ కూడాను. సొమ్మూపోయి, శనీపట్టింది.'

'అయితే యిక మామీద మీకు దయరాదూ?'

'దయ ఏమిటి నీశ్రాద్ధం - పొమ్మంటూంటే'

'ఏమండోయ్. బొత్తిగా తీసెయ్యకండి'

'ముందు గుమ్మం దిగు'

'చిత్తం - శలవు.'

'చావు - ఏమేవ్ - మీవాడితో గనక మాట్లాడావా కొంపలోంచి అవతలకి యీడ్చేస్తా.'

* * *

రోజులు గడిచాయి.

ఓనాడు.

సాయంత్రం అయిదుగంటలకి టపావాడు విశ్వనాథంగారికి ఓ ఉత్తరం యిచ్చిపోయాడు.

'ఏమేవ్! ఎంచేస్తున్నావు?'

'ఏం?'

'మణి ఉత్తరం వ్రాసింది'

'ఏమని?'

'వచ్చి తీసుకువెళ్ళమని'

'పాపం! బిడ్డ...'

'పురిటిరోజులుట'

'ఇదేమి విడ్డూరం. పిల్లకింకా మొన్నటి కార్తీకానికే కాదూ. ఏడాది వెళ్ళింది.'

'విడ్డూరం ఏమిటి...తల్లిపోలిక'

'ఊఁ...మరే! - ఇదో అద్వైతం!

'వెళ్ళాలా? అక్కర్లేదా? ఇంతకీ.'

'అయ్యో! ఎంతమాట! మొహంమీద పేడనీళ్లు చల్లరూ, తీసుకురాకపోతే?'

'లక్ష్మికికూడా నెల్లు నిండాయి కాబోలు.'

'ఆ, ఈ పెద్దమ్మకి రోజులే'

'మరి యిద్దరికీ చెయ్యగలనా?'

'పోనీ! పంపినట్టూ ఉంటుంది, మాట దక్కినట్టూ ఉంటుంది దానివాళ్ళకి రాయండి వొచ్చి తీసుకువెళ్ళమని.'

'బొట్టుపెట్టి పిలిస్తే భోజనానికి వెళ్ళక, మూకుడట్టుకు ముద్దకి బయలుదేరింది యిల్లాలు'

'బాగుంది. కథ అడ్డంతిరుగుతే ఏంచెయ్యమూ?'

'అంచేతే - దూరాలోచన కావాలన్నారు'

'దూరాలోచనచెయ్యక, దురాలోచన చెయ్యలేదెవ్వరూ!'

'సరేలే! వొట్టి హాస్యా, హాస్యమనిషివి. కాదలచిన కార్యాన్ని గంధర్వులే తీర్చారు!

* * *

ఇంకో కొన్నిరోజులతరవాత.

పుల్లమ్మ బింది చంకనెట్టుకుని చెరువుకు పోతూంటే 'నేనూ వస్తాను ఉండవే' అంది పొరుగింటి వెంకమ్మ.

వెం:—ఏమి టాగోడవ? రాణీగారికి చెలికత్తెకీపడింది.

పు:—ఏమీ లేదండీ! సోమిదేవమ్మగారు ఉట్టి లేకి మనిషి. జోగమ్మగారు కూతుర్ని పురిటికి తీసుకురావడానికి వెళ్ళింది. పెళ్ళికివెడుతూ పిల్లిని చంకబెట్టుకెళ్ళారన్నట్టు, యీవిణ్ణికూడా తోడు కెళ్ళింది.

వెం:—ఔనులే, జంటవిడితే, జానికితోడు అంటుకోవడ మెల్లాగ?

పు:—అల్లాగే ఉంది కూతురింట్లో ఎంతకాదన్నా, వియ్యపురాలు వెడితే, ఓగుడ్డపెట్టరూ? తీరా యీవిడ కట్టుకోబొయ్యే సమయానికి, సోమిదేవమ్మ, శకునపక్షిలాగ, బుగ్గలు పొడుచుకుంటూ అయ్యో. కూతురింటో కొత్తగుడ్డ కట్టగూడదందిట.

వెం:—సరి సరి! దీని మేర్భానీమండ.'

పు:—లోపల పీకుతున్నా, లేచొచ్చారు. మొన్న, సోమిదేవమ్మ మొగుడుతో 'తంపి' పెట్టి బండేనా చూసుకోక తీర్థానికెళ్ళినట్టు, కాలినడకని బయలుదేరి కూతురింటికెళ్ళింది. సరే కూతుర్ని చూచి

బయలుదేరుతోంటే—వాళ్ళు మర్యాదస్థులు—యీవిడికికూడా ఓ మూడుచుక్కలచీర కట్టబెట్టారు. చిలకలా యీవిడ కట్టుకొచ్చింది.

వెం:—ఆవిడకి సారంచెప్పి యీవిడ చేసిందేమిటి.

పు:—అదే మిగిలింది. దానికోసం యిద్దరూ చీపుళ్లు ఆడించుకోడం దగ్గిరకి వచ్చింది.

వెం:—సరేలే! బాగానేఉంది. తాడిబెంకలు విడ్డాయి. అయితే జోగమ్మకోడలికి పురుషువచ్చిందేమో!

పు:—ఆ అన్నమాటే, మొగపిల్లాట్ట. వీళ్ళకి ఓ ముక్కైనా రాయలేదు. మొన్నటిదాకా, వేపించి వేన్నీళ్ళు చల్లారు వాళ్లు తిరగేస్తున్నారు. తప్పేముంది.

వెం:— కాపురానికి పంపుతారా?

పు:—అదేమన్నమాట – నిండుకాపురానికి నీళ్ళొదులుకుంటారా? అయినా రచ్చకెక్కితేకాని రాజీకుదరదు. చూశారా? కోడలుఅన్నగారువస్తే అనరాని మాటలన్నీ అని, భోజనమేనా పెట్టకుండా, గుమ్మం దిగేదాకా పరవళ్ళు తొక్కింది.

వెం:—అవును, చూశాము కదూ!

పు:—యీసోమిదేవి ఏంచేసిందనుకున్నారూ? అతగాణ్ణి ఆపూటకి ఉండమని ఆపి, తీరా భోజనాల వేళవస్తే, తలుపేసుకు, కూచుంది. గొంతు పగిలేటట్టు అతగాడు కేకవేసినా, మరి పలకదు. తీరా మాయింట భోజనానికి పిలిచారు. భోంచేస్తూంటే ఆమూసివాయనపు పేరంటాలువచ్చి 'అయ్యో, ఎంతసేపటికి రాలేదని, చూసిచూసి కళ్లు కాయలు కాచాయి' అని వొగలుమరిగింది.

వెం:—అబ్బో! ఆవిడ ఒకపులపిల్లి—వగలమారి వంకాయానూ.

* * *

'నాయనా! మనమీద తప్పుఉండకూడదు. తిడితే తిట్టింది. ఆడపిల్లవాళ్ళము. వెళ్ళిభారసాలకి రమ్మని చెప్పిరా' అంది అచ్చమ్మగారు – లక్ష్మితల్లి – సుందరంతో.

'అమ్మా! ఏమిటి, నీభ్రమ. బావగారువచ్చి, బావగారి కొడుకు మంచంమీద వాపడానికి సిద్ధంగా ఉంటే, వచ్చిన అన్నగార్ని మాడటానికేనా మొగుణ్ణి వెళ్ళనివ్వని, యిల్లాలు, మన దీనాలాపాలువిని, వరం ప్రసాదిస్తుందా?'

'ఆవిడ ఎల్లాంటిదైతేం? బాబూ యిప్పుడు మన పని. లేకపోతే లోకం కాకులు గుడ్లని పొడిచినట్టు, మనల్ని పొడుస్తుంది.'

'అమ్మా, నన్ను వెళ్ళమంటావు. నేను వెడతాను. అక్కడ ఆవిడ చింతకాయలు దులుపుతుంది. నాకు చుర్రుమంటుంది. అప్పుడు మమకారం తెంపుకుని మాటకి మాట అందివ్వవలసివస్తుంది......'

'తొందరపడకు నాయనవు కాదూ వెళ్ళమరీ...'

* * *

'మళ్ళీ మీగుమ్మం ఎక్కక తప్పింది కాదండోయ్, అత్తగారూ!'

'ఎందుకుతప్పదూ, తప్పించుకుంటే.'

'యీసారి మీపనిమీదే వచ్చాను. మీరు మన మడు పుట్టాము. తమరందరూ దయచేసి బాలసార చేసుకుని, మీమనమణ్ణి, కోడల్ని, తీసుకు తెచ్చుకోండి.'

'ఇప్పుడేం తొందర. మాముచ్చట తీరేదాకా ఉంచుకోండి.'

'బీదవాళ్ళం. అదీ చెయ్యలేము. పైగా మాముచ్చట్లు, ఎప్పటికప్పుడు తీరుతూనే ఉన్నాయి.'

'భారసాలకు భావమరదికి కట్నంఏమిటి? మేనల్లుడికి ఏంనగలెట్టారు? ఏంపెడతారు.'

'సంసారులము. సామాన్యులము. తమకోరికలుతీర్చే స్థితిలేదు

'అయితే బారసాలావద్దూ, బండలూవద్దు. మీపిల్లని, మీయింటిలోనే ఉంచుకోండి!

'అత్తగారూ! ఇవి వెనకటిరోజులుకావు మీపిల్ల మాకు వద్దు. కావలిస్తే మనవర్ని పారేస్తాము' అని శలవివ్వటానికి. ఈపైనవచ్చేవి మైనరువాటా తగువు. ఆలోచించండి. శలవు.'

—కడియాల కామేశ్వరరావు.

# రాస్ టఫారి తల్లి చెప్పిన జోస్యము

అబిసీనియాచక్రవర్తి రాస్‌టఫారి ఇప్పుడు పూర్తిగ యుద్ధకార్యములందు నిమగ్నుడైనాడు. ఆదేశమున ఇప్పుడు అందరికిని ఒక్కటేవృత్తి. తమ ప్రాక్తనసామ్రాజ్య స్వాతంత్ర్యపరిరక్షణమునకు వలయు సాధన సామగ్రులను సమకూర్చుకొనుట, ప్రయోగించుట. శాంతిసమయములందే రాస్‌టఫారీ ఉదయము 7 గంటలుమొదలు రాత్రి 10 గంటలవఱకు పనిచేయువాడగునో ఈయుద్ధసమయమున ఆతడు రోజున కెన్నిగంటలు పని చేయుచుండునో ఊహింపవచ్చును. అతని యుద్ధమంత్రి రాస్ములుగ్యేటా నిరంతరము కార్యనిమగ్నుడయ్యే ఉండుచున్నాడు. ఆతడసలు నిద్రపోవుచున్నాడో లేదో ఎవరికిని తెలిసికొనుటకు వీలుగాకయున్నది. రాస్‌టఫారీ అల్లుడు డెస్టిడామ్ట్రా ముసోలినీఅల్లుని వలెనే యుద్ధరంగమున ప్రవేశించియున్నాడు. ఇంతటి అలజడిసమయమునకూడ రాస్‌టఫారీ వశీకృతచిత్తుడైయున్నాడు. ఆతడు తనదేశమున కింతవఱకు గలిగిన గొప్ప అపాయములలో కెల్ల ఘోరమైనదగు అపాయమునకు- ఇటలీదాడికి - ఎదుర్కొని నిలచుచున్నాడు. ఈసమయమున అతని పుట్టుకకు అతని తల్లి చెప్పిన జోస్యమును వివరించు ఈ క్రింది వృత్తాంతము చమత్కారముగ నుండగలదు.

అబిసీనియాలో ఒక వింతయైన ఆచారమున్నది. పిల్లలకు పేరుపెట్టు హక్కు స్త్రీలదే. ఆ హక్కును ఉపయోగించుటలో ఆ దేశపు స్త్రీలు గొప్ప బుద్ధివైశద్యమును ప్రదర్శింతురు. మఱియు ఆపేరు పెట్టుట పుట్టినతోడనే జరుగవలెను. ఈ చక్రవర్తి పుట్టువునొందిన తోడనే అతనితల్లి అతనికి 'టఫారి' అని పేరుపెట్టినది. 'టఫారి' అనగా ఆదేశపుభాషలో 'భయములేనివాడు' అని అర్థమని ఆంధ్రభూమి పాఠకులకు తెలిసినవిషయమే. ఆతల్లి ఎంతటి దీర్ఘదర్శిత్వముతో ఆ నామ మాతని కుంచినదోగాని ఆతడు భయములేనివాడై ఎంతటి ఆపదలనైన ఎదుర్కొనుచున్నాడు. ఆఫ్రికాదేశపు ఏకైకస్వతంత్రరాజ్యమగు అబిసీనియారాజ్యసింహాసనమును పొందుటకును, పొందినదానిని నిలబెట్టుకొనుటకును నిలబెట్టుకొనినదానిని నిర్వహించుటకును ఆత డెంతటి నిర్భయచిత్తుడై మెలగెనో ఆంధ్రభూమి పాఠకులకు తెలిసిన విషయములే. ఇపు డాతడు ఇటాలియనుల దాడిని నిర్భయచిత్తముతో ఎదుర్కొనుచున్నాడు. అతల్లి జోస్యము ఇట్లు ఈ నామము విషయమున అక్షరాలా నిజమైనది.

మరియొక విషయమునకూడ ఆమాత్రుదేవి కుమారునికి జోస్యముచెప్పినది. ఆజోస్యముయొక్క ఫలము ఈవఱకే కొంత ఆతనికి అనుభవసిద్ధమైయున్నది. మిగిలిన ఫలము దొరకవలసిన సమయమిది. ఆమాత్రుదేవి జోస్యము సఫలమగునో, విఫలమగునో ఇపుడు చెలరేగియున్న ఇటలీ అబిసీనియా యుద్ధపర్యవసానము తేల్చగలదు. టఫారి తనతల్లికి పుట్టిన పదునొకండుగురు బిడ్డలలో పదునొకండవవాడు. మొదట పుట్టిన పది మంది బిడ్డలును చనిపోయిరి. పదునొకండవ వాడగు ఈటఫారి బ్రతికి బట్టకట్టెను. అందు మీద ఆతనితల్లి ఇట్లు జోస్యముచెప్పినది : 'నాపదునొకండుగురు బిడ్డలలో నీవు పదునొకండవవాడు. నీ విషయమున పదునొకండు సంఖ్యకు కొంత మహత్తుగలదు. రెండు పదు

నొకండ్లు—ఇరువదిరెండు వత్సరములు దాటువఱకును నీవు జీవింపగలవేని నీవు గొప్ప అదృష్టవంతుడవు కాగలవు.'

టఫారికి ఇరువదిరెండు వత్సరములు వచ్చునరికి తల్లి చెప్పిన జోస్యము నిజమై ఆశ్చర్యమును పుట్టించినది. అప్పటికి ఆతనికి ఇరువదిరెండవ వత్సరము జొరబడి ఎన్నియో రోజులు కాలేదు. సానాసరస్సులో విహారార్థము నావషికారుకు పూనుకొన్నాడు. కూడ ఉండి నావషికారుకు పూనిన ఆతని స్నేహితులు ఇరువదియొక్కమంది. ఆతనితో వారు ఇరువది ఇద్దరు. ఆతనికి ఇరువది రెండవ సంవత్సరము. నావలో ఉన్నవారు ఇరువదిఇద్దరు. సరస్సునడుమను నావ తలక్రిందులైనది. ఆ ఇరువదిఇద్దరు మిత్రులలో ఇరువదిరెండు సంవత్సరముల వాడగు టఫరి తక్క మిగిలినవారందరును జల మరణముపొందిరి. ఆపెద్దగండమును దాటి బ్రతికి ఆతడు కాలక్రమమున అబిసీనియాచక్రవర్తి అయినాడు.

ఆగండముగడిచి నేటికి ఇరువదిరెండు సంవత్సరములైనది. అనగా ఇప్పుడు టఫారికి నలుబది నాలగవ వత్సరము. (రెండు ఇరువది రెండ్లు, నాలుగు పదునొకండ్లు). టఫారి అదృష్ట విషయమున పదునొకండు సంఖ్యకు కొంత మహాత్మ్యగలదను ఆతని తల్లి జోస్యము నిజముగుటకు ఇంతవఱకు నడచిన ఆతని చరిత్ర నిదర్శనమిచ్చినది. ఇప్పుడు—ఆజోస్యము పూర్వమునకు వలెనే మంచిఫలమీయకుండునా? రాస్టఫారి తల్లి చెప్పిన జోస్యము కొంత నిజమై కొంత నిజముకాకుండునా? ఇరువదిరెండవ ఏట జలగండము గడచినట్లే ఆతనికి ఈ నలుబదినాలుగవయేట ఇటలీగండము గడువకుండునా? 'సర్వముం గదలంజేయు కాలమూర్తి' ఏమిచెప్పునో?

# నాగులచవితి

నీపుట్టదరికి నాపాప లొచ్చేరు
పాపపుణ్యమ్ముల వాసనేలేని
బ్రహ్మస్వరూపులౌ పసికూనలోయి
కోపించి బుస్సలు కొట్టబోకోయి
  నాగులచవితికి నాగేంద్ర! నీకు
  పొట్టనిండా పాలుపోసేము తండ్రి!

చీకటిలోన నీ శిరసుతొక్కేము
కసిదీర మమ్మల్ని కాటేయబోకు
కోవపుట్టలోని కోడెనాగన్న!
పగలుసాధించి మాప్రాణాలు దీకు
  నాగులచవితికి నాగేంద్ర! నీకు
  పొట్టనిండా పాలుపోసేము తండ్రి!

అర్ధరాత్రీవేళ అపరాత్రివేళ
పాపమే యెఱుగని పసులు తిరిగేని
ధరణికి జీవనాధారమైనట్టి
వాటిని రోషాన కాటేయబోకు!
  నాగులచవితికీ నాగేంద్ర! నీకు
  పొట్టనిండా పాలుపోసేము తండ్రి!

అటుకొండ యిటుకొండ ఆరెంటినడుమ
నాగులకొండలో నాట్యమాడేటి
దివ్యసుందరనాగ! దేహీయన్నాము
కనిపెట్టి మమ్మెపుడు కాపాడవోయి
  నాగులచవితికి నాగేంద్ర! నీకు
  పొట్టనిండా పాలుపోసేము తండ్రి!

పగలనక రేయనక పనిపాటలందు
మునిగి తేలేటి నా మోహాలబరిణె
కంచెలు కంపలూ గడచేటివేళ
కంపచాటునవుండి కొంప దీకోయి!
  నాగులచవితికి నాగేంద్ర! నీకు
  పొట్టనిండా పాలుపోసేము తండ్రి!

—బసవరాజు అప్పారావు, బి.ఏ.

# ముసోలినీ తల్లి

[ప్రపంచాభిప్రాయము తనకు పూర్తిగ వ్యతిరేకించియున్నను ముసోలినీ అబిసీనియాంపై దండెత్తినాడు. తన కొడుకుల నిద్దరిని, అల్లుని రణరంగమున కంపినాడు. అట్టి ముసోలినీ తన బాల్యమును గురించి, తనతల్లినిగురించి వ్రాసిన ఈక్రిందివిషయము లీ సమయమున పాఠకులకు కుతూహలమును కల్గింపగలవు. ఇప్పటి యుద్ధమున ఈతని ప్రత్యర్థియగు రాస్‌టఫారీ విషయమున అతని తల్లి చెప్పినట్లే ఈతని విషయమున ఈతనితల్లియు జోస్యము చెప్పియున్నది. వీరిద్దరి విషయమున వీరి తల్లుల జోస్యము లింతవఱకు సత్యములై యుండుట చరిత్ర ప్రత్యక్షీకరించుచున్నది. ఇకమీదట ఈజోస్యము లెట్లు పనిచేయునో చూడనగును.]

నేను 1883-వ సంవత్సరము జూలై 29-వ తేదీని వారానోడికోస్టా అను తావున పుట్టితిని. ఆనాడు ఆదివారము. మధ్యాహ్నము రెండుగంటలవేళ నేను జనన మొందితిని నాతండ్రి కమ్మరివాడు. కొంచెము స్థూలకాయుడు. అతని చేతులు బలిష్ఠములై మాంసలములై దీర్ఘములై ఉండునవి. అతని పేరు అలెస్సాండ్రో.

నేను మంచిపిల్లవాడనై ఉండలేదనియే చెప్పక తీరదు. మాకుటుంబమువారు నన్ను చూచి గర్వింపవలసిన గొప్పగుణములేవియు అప్పుడు నాకడ లేకుండెను. క్లాసులో అందరికంటె ఘట్టుగా ఉండి తోడి విద్యార్థుల అసూయకు గుఱియగు పాపపుపనిని నేనెప్పుడును చేయలేదు. ఇపుడు 'పాపోలాడి ఇటాలియా' పత్రిక ప్రచురణకర్తగా నున్న నాసోదరుడు ఆర్నాల్డోతో కలసి మాయింటికి చెంతగల సెలయేటి నీటిప్రవాహమునకు ఆనకట్టలు కట్టి ప్రవాహమును మఱియొక మార్గమునకు మరలించుచుండుట అప్పటి నాప్రధానవినోదము. పక్షిగూండ్లను వెతకి అందలి ఱెక్కలురాని పిల్లలను, గ్రుడ్లను వేటాడుట నాకు మనసుకెక్కిన క్రీడయై యుండెను.

నాకు ప్రియతములలోకెల్ల ప్రియతమురాలు నాతల్లి. ఆమె శాంతికి, దయకు రాసి అయి ఉండెను దృఢచిత్తురాలు. ఆమెనామము రోశా. మాతల్లి మమ్ములను పెంచుటయేగాదు. మాకు విద్యాబుద్ధులుకూడ ఆమెయే నేర్పినది. ఆమె ఒక ప్రాథమికవిద్యాశాలను నిర్వహించునది. ఆపాఠశాలలోనే మేము మాప్రథమపాఠములను నేర్చుకొంటిమి. అప్పటి నా చిన్నవయస్సులోకూడ నేను ఓర్పుతో నిరంతరము పనిచేయుచుండు ఆమె నేర్పును ఆకళింపగల్గితిని. ఆమెకు అనిష్టము కల్గింతునను విషయ మొక్కటే నే నాదినములలో భయపడిన విషయము. నాపరిహాసకృత్యములు, నా పెంకితనపు చేష్టలు, నా అల్లరిపనులు ఆమెకు తెలియకుండుటకై నేను మానాయనమ్మను, మాయిరుగుపొరుగు అమ్మలక్కలను చాటుచేసికొనువాడను.

మాఅమ్మపాఠశాలలో విద్యాపూర్తి అయినతరువాత మాయూరికి రెండుమైళ్ళ దూరములోఉన్న ప్రిడాపియో అను తావునగల పెద్ద పాఠశాలకు నన్ను పంపిరి. ప్రిడాపియోయందలి పాఠశాలలోని బాలురు క్రొత్తగ్రామమునుండి వచ్చుచున్న నన్ను చులకన చేసిరి. నాపై రాళ్ళు విసరువారు. నేనును ఊరకొనలేదు. రాళ్ళయుద్ధమునకు నేను ఎదురొడ్డువాడను. నేను ఒంటరివాడను. వారు పలువురు. కాగా తఱుచు నాకే దెబ్బలుతగులునవి. అప్పటి నాధైర్యమునకు ఈ దెబ్బ లొకగురుతు. ఈ దెబ్బలయొక్క చిహ్నములను నాతల్లికంటబడకుండ దాచుటకుగాను సాయంకాలపు భోజనసమయమున రొట్టెనందుకొన చేయి జాపుటకే వీలులేకుండునది!

కొంతకాలమునకు పిమ్మట నన్ను ఒక బోర్డింగు పాఠశాలకు పంపిరి. తరువాత కొంతకాలము నాతండ్రి

కమ్మరికొలిమిలో పనిచేసితిని. కాయకష్టపడితిని అప్పటికి నావయస్సు ఇరువదికి లోపు నా భావినిగూర్చి నా తలిదండ్రులు ఆదినములలో తీవ్రముగ ఆలోచించువారు. కమ్మరకొలిమిలో జబ్బసత్తువ చూపుటకంటె నుంచి పనిని నేను చేయుట వారికోరిక అనియు, అట్టి అభివృద్ధికి వారు కొంతవఱకు సాయముచేయ గలరనియు, అదియునుగాక నా శక్తిసంపదకు కమ్మరపని అంత సరిపోయినదికాదనియు వారి ఆలోచనలవలన నే తెల్పుకొనిన సారాంశములు. ఈ ఆలోచనసమయము లందెల్ల నాతల్లి 'వీడు మహాత్కార్యము చేయగలడు' అని చెప్పుచుండునది. ఆవాక్యము ఎల్లవేళల నా చెవులలో నినదించుచునేయుండును.

కాని ఆసమయమున నాతల్లి అనిన ఆవాక్యమును గూర్చి నేనంతగ గర్వపడలేదు. విద్యనార్జింపవలయునను తృష్ణ నాకప్పటికి బొత్తిగా లేకుండెను. నేను ఉపాధ్యాయవృత్తికి తరిఫీయతు నొందవలయునని మా వారి తలంపు. ఆదిలో నాకిది నచ్చలేదు. కాని వారి బలవంతముపై తిరిగి పాఠశాలకు పోక తప్పినదికాదు. ఉపాధ్యాయవృత్తికి తరిఫీయతు పొందుటయనగా తిరిగి ఆరుసంవత్సరములు పుస్తకములతో, పెన్సిళ్ళతో, సిరాతో, కాగితములతో క్రిందుమీదు కావలయును. అయినను నేనంత శ్రద్ధపెట్టలేదు. తఱచుగా అవిధేయుడనై ఉంటిని. ఒక్కొక్కప్పుడు తెలివితక్కువగా ప్రవర్తించియు ఉంటిని. ఏమైననేమి ఉపాధ్యాయవృత్తికి డిప్లమో పొందితిని. నేనిప్పుడొక ఉపాధ్యాయుడను!

జీవితమును ఉపాధ్యాయులుగ ప్రారంభించిన వారిలో అనంతరము రాజకీయనాయకులైనవారి నిదర్శనములు పెక్కుగలవు. కాని నేనప్పుడు కలలోకూడ ఒక రాజకీయనాయకుడను కాగలనని అనుకొనలేదు. ఉద్యోగాన్వేషణము—సిఫారసు ఉత్తరములు-ఇవి అప్పటి నాపనులు. గాల్టీరిలో ఉపాధ్యాయుల పోటీలో నేను జయమంది ఉద్యోగము సంపాదించితిని ఒక సంవత్సరము ఉపాధ్యాయుడనైయుంటిని. ఇంతలో శెలవులకు పాఠశాల మూయబడెను. ఇంటిమీద దృష్టి పోలేదు. యాత్రచేయవలయునని కుతూహలము కలిగినది. చేతిలో పుష్కలముగా డబ్బులేదు. తెగువయే మూలధనము. ఇటలీ పొలిమేరదాటి స్విడ్జర్లాండునందు ప్రవేశించితిని. ఈతిరుగుబోతు జీవితమున నేను పొందిన కష్టములు, శ్రమ, ఆవేదన నాలో నిద్రాణమైయుండిన శక్తులను లేపినవి. నా కావయఃపరిపాకమున అఘట్టమొక మైలురాయి. ఆకష్టములనుండి బయటపడుసరికి నేనే నొకరాజకీయవేత్తనైతిని.

ఆత్మశక్తియందు విశ్వాసము కల్గినది. నా కదియే పెద్దఅండయైయుండినది. స్విడ్జర్లాండులో తఱచుగా నేను తాపీపనివాడుగా పనిచేయుచు పొట్ట పోసుకొనువాడను. పైగా ఇటాలియన్ భాషలోనుంచి ఫ్రెంచిలోనికి ఫ్రెంచిభాషలోనుండి ఇటాలియన్‌లోనికి వ్యాసములు పరివర్తనము చేయుచుండెడివాడను. దొరికినపనియెల్ల చేయుచువాడను. రాజకీయములలోకూడ ప్రవేశించినాను. రాజకీయములలో నేను ఒక పెన్నికూడ ఆర్జించలేదు. రాజకీయములందు ధనమార్జించువారనిన నాకు సరిపడదు

ఆకలి అన ఎట్టిదో నే నారోజులలో బాగుగ నెఱుగుదును. కాని అట్టి సమయములందు కూడ నేను ఇతరులవద్ద అప్పుచేసి యుండలేదు. నా అక్కఱలను బొత్తిగా తగ్గించుకొనువాడను. నాకు కావలసియుండిన కొద్దిధనము నాకు ఇంటిదగ్గరనుండియే వచ్చునది.

నే నాదినములలో సాంఘికశాస్త్రమును అతి దీక్షతో చదివితిని. పేరిటో పండితుడొసగుచుండిన ఆర్థికశాస్త్రోపన్యాసములకు విడియకముగా పోవువాడను. రాజకీయసభలకు పోవువాడను. అందుపన్యసించువాడను. ఆ ఉపన్యాసములు ఉద్రేకపూరితములైయుండునవి. అందలి కొన్ని పదములు స్విడ్జర్లాండుప్రభుత్వమువారి ఆగ్రహమునకు గుఱియైనవి. కాగా వారు నాపై జినీవా, లాసాని భాగములకు రాకూడదని ఆంక్షపెట్టిరి. అందుతో ఆదేశమున నివశించుట కష్టతరమైనది. స్వదేశముపై ప్రేమ ఉద్భవిల్లినది. ఈ తరుణముననే ఇటలీలో నిర్బంధసైనికశిక్షణము అమలునందుంపబడెను. అది నన్నెంతయో ఆకర్షించెను. కాగా

ఇంటికి వచ్చితిని. స్వాగతపరంపరలు. ప్రశ్నల మీద ప్రశ్నలు. దూరదేశాగతుడగు సాహసికవీరుడు తిరిగి వచ్చుచో జరుగగల తంతులన్నియు నడచెను.

చరిత్ర ప్రసిద్ధమైన వెరోనా నగరమునందలి రెజిమెంటులో సైనికునిగా ప్రవేశించితిని. సైనికుని జీవితము నాకు లెస్సగ పట్టినది. అవిధేయతకు నిధానమని, తిరుగుబోతుతనమునకు మొదలిపేరని నావిషయమై ఈ వఱకు ప్రచారముండెను. కాగా సైనికునిగా నేచూపిన విధేయతకు కెప్టెను, మేజరు పొందిన ఆశ్చర్యమునకు అంతు లేకుండెను. నేను అన్నివిధముల ఆదర్శప్రాయుడగు సైనికుడనై యుంటిని.

కాని విధి నాభావి వేఱొక విధముగ నిర్ణయించెను. మానాన్నకమ్మరికొలిమినుండి ఉపాధ్యాయవృత్తికి, ఉపాధ్యాయవృత్తినుండి స్విట్జర్లాండునకు, స్విట్జర్లాండునుండి సైనికశిక్షణమునకు నన్ను తరలించిన విధియే నేను సైనికవృత్తిలో చిరకాలముండకుండ నిర్ణయించెను.

నే నాసమయమున శలవుకు దరఖాస్తు పెట్టవలసి వచ్చెను. నాజీవితకాలమున నేను చవిచూచిన గొప్ప దుఃఖముల కెల్ల గొప్పదుఃఖమునకు నేనప్పుడు తావలమైతిని.

ఒకనాడు మా కాప్టెన్ నన్ను కేవలకు గొనిపోయెను అప్పటి అతని వర్తనము ఏదే నొకచింతనీయ విషయము తటస్థమైయుండుటను ద్యోతకము చేసెను. ఒక తంతివార్త నాచేత బెట్టి దానిని చదువుమని అతడు నన్ను కోరెను. ఆతంతి మానాన్న పంపినది. మాఅమ్మకు చాల జబ్బుగనున్నదనియు, నన్ను వెంటనే రమ్మనమనియు ఆతంతిలోగలదు. అచ్చటినుండి మావూరికి బయలుదేరు మొదటిరైలుకు నేను పరుగెత్తితిని.

నేను వెళ్ళుసరికే కాలము మించిపోయినది. మా అమ్మ మరణవేదనలో నుండెను. కనబడీకనబడని ఆమె తల ఊపువలన నారాక ఆమె గుర్తించినదని నేను తెలుసుకొంటిని. చిరునవ్వునవ్వ ఆమెచేసిన ప్రయత్నమును నేను గుర్తించితిని ఇంతలో ఆమెతల మెత్తదిగా వ్రాలిపోయినది—ఆమె ఇక లేదు.

నా ఆత్మయొక్క నిరంకుశశక్తి అంతయు ఆసమయమున విడిపోయినది. నాప్రతిభాసంపద అంతయు ఆక్షణమున విచ్చిపోయినది. నా వేదాంతతత్త్వము, మతవిజ్ఞానము నాఅప్పటి విచారమును తొలగించుటకు అసమర్థములైనవి. పెక్కురోజులవఱకు నే నావిచారము నుండి విడుదలగాంచలేదు. నాఏకైకప్రేమపాత్ర - నా అక్కఱలను గుర్తించిన సన్నిహితాత్మ— నాభావినిగూర్చి నాబాల్యముననే జోస్యముచెప్పిన మహానీయ-నాభౌతికనేత్రములకు దూరమైపోయినది.

ఉపశమనవాక్యము లేమిపనిచేయును? మిత్రుల సానుభూతి ఉత్తరము లేమిచేయగలవు? కుటుంబములోని ఇతరవ్యక్తులు తమ విచారమును దిగమ్రింగి నన్నూరడించిన మాత్రముననేమి? నా మాతృదేవి తొలగిపోవుటచే ఏర్పడిన ఖాళీ ఇక ఈజన్మకు ఖాళీగా ఉండిపోవలసినదే. మూయబడిన ఆద్వారము ఇక తెరువబడదు.

నాకొఱకు నాతల్లి అనేకకష్టములు పడినది. నాకొఱకు ఆమె పెక్కు వేదనామయదినములు వెళ్ళబ్రోసినది. నాతిరుగుబోతుజీవితమునుగూర్చి ఆమె పొందిన ఆందోళనకు అంతులేదు. నాభావిఅభివృద్ధిని ఆమె జోస్యము చెప్పినది. ఆమె నాకొఱకు కష్టించినది, నా అభివృద్ధి నాశించినది. నలుబది ఎనిమిదేండ్ల నడివయస్సుననే ఆమె ఇహలోకమును వీడినది. తక్కువ అంతస్థులోనే యగుగాక ఆమె మానవాతీతకార్యము లొనరించినది.

ఆమెకు ఇంకను బ్రతుకదగు వయస్సు ఉన్నది. ఈనాడుకూడ ఆమె బ్రతికిఉండవచ్చును. నా ఇప్పటి రాజకీయాభివృద్ధిని, విజయమును తిలకించి ఆమాతృహృదయము సంతోషించియుండవచ్చును. కాని అట్టి దానికి అవకాశము లేకుండబోయినది. కాని ఈసమయమునకూడ ఆమె తన స్వర్గీయ నేత్రములలో నన్ను తిలకించుచున్నదనియు, తన అసదృశప్రేమతో నా చేయుచున్న సకలప్రయత్నముల సఫలతకు సహాయపడుచున్నదనియు నానమ్మకము. ఆ నా నమ్మకమే నాకు ఊరడింపు.''

# అబిసీనియాపై ఇంగ్లండు దాడి

నేడు ఇటలీకిని అబిసీనియాకును యుద్ధము పొసగకుండ బ్రిటీషుమంత్రులు విశేషప్రయత్నము గావించిరి. యుద్ధము పొసగిన తరువాత ఇప్పుడు బ్రిటీషుమంత్రులు అబిసీనియా పక్షమువహించి జాతి సమితియంత్రమును ఇటలీమీదికి త్రిప్పినారు. ఇట్టి తరుణమున కొన్ని సంవత్సరములకు పూర్వము ఇంగ్లండు అబిసీనియాపై సల్పిన దండయాత్రను గూర్చిన క్రింది విషయ సంగ్రహాము చదువుటకు ముచ్చటగా నుండును.

అది క్రీస్తుశకము 1868-వ సంవత్సరము. అప్పుడు అబిసీనియాకు థియోడర్ అను వాడు రాజు. అతడు బహు కోపిష్టి. తాను తురుష్కులపై దండెత్తుటకు ఇంగ్లండు సాయముచేయలేదని ఆతడు ఇంగ్లండుపై అలిగినాడు. విక్టోరియా మహారాణికి స్వయముగ నొక వేడికోలు ఉత్తరము వ్రాసినాడు. దానికి ఆతడు ప్రత్యుత్తరము పొందలేక పోయినాడు. అందుతో ఆతడత్యుగ్రుడై నాడు అబిసీనియాయందు నివసించుచున్న బ్రిటీష్ జాతివారల నందరిని పట్టుకొని తనరాజధానీ నగరమగు మాగ్డాలాయందు బంధించినాడు.

అప్పటిలో బ్రిటీష్ గవర్నమెంటువారు అబిసీనియాపై యుద్ధక్రియలకు గడంగ సుముఖులై యుండలేదు. ఇప్పుడును అప్పుడును యుద్ధకృత్యములకు అబిసీనియా అందుబాటుకాని దేశము. అగుట తొలుత బ్రిటీష్‌వారు శాంతిమార్గములనే అవలంబించుటకు నిశ్చయించిరి. ఏడెన్‌నందు అసిస్టెంటు బ్రిటీష్ రెసిడెంటుగ నున్న రాస్సామ్ నాయకత్వమున కొంతమందిని థియోడర్ రాజుకడకు రాయబారము పంపిరి.

ఆ రాయబారులతో రాజు పనిని అతిశీఘ్రముగనే ముగించెను. ఎట్లు? తాను లోగడ బందీగా కొనియున్న బ్రిటీష్‌జాతివారితోబాటే ఈబ్రిటీష్‌రాయబారులను కూడ నాతడు చెఱబట్టెను. ఇట్లాతడు బ్రిటీష్ ప్రభుత్వమును అలవోకగా తృణీకరించెను.

ఇందుతో బ్రిటీష్ ప్రభుత్వమువారికి కదులుట్టినది. థియోడర్ పట్టి రాయబారములతో లొంగువాడు కాడని నిశ్చయించుకొనిరి. తాను బందీలుగా కొనియున్న బ్రిటీష్ జాతివారి నందరిని వెంటనే విడుదలచేయవలెనని వారా రాజునకు అల్టిమేటమ్ పంపిరి. ఈ అల్టిమేటమును ఆరాజు బుట్టదాఖలుచేసెను. అప్పుడు బొంబాయినుంచి సర్ రాబర్టు నేపియర్ నాయకత్వమున సైనికదళమొకటి (14,600 మంది సైనికులుగలది) అబిసీనియాకు పంపబడెను.

మాగ్డలా చేరుటకు అబిసీనియా ప్రదేశమున నాలుగువందలమైళ్లు అతిక్రమించి పోవలెను. సరియైన బాటలులేని కొండప్రదేశము. దాడికికంటె కాపురు అనుకూలమైన ప్రదేశము. ఎందుచేతనో అబిసీనియనులు ఈ బ్రిటీష్‌దళమును ఎదుర్కొనలేదు. ఎదుర్కొనియే ఉండుకేని బ్రిటీష్‌సైనికులు తమగమ్యస్థానము చేరులోపుగ విశేషకష్టములకు గుఱియైయుందురు.

తనసైనికులతో నేపియర్ ఎట్టి నిరోధము కాని లేకయే ముందుకు సాగిపోయెను. థియోడోర్ ప్రజామోదమును బడిసిన రాజుకాదు. అంతకు కొద్దికాలమునకు క్రితమే ఆతడు

ప్రజల తిరుగుబాటును క్రూరముగ అణచి వైచి యుండెను. కాగా ప్రజలకు అతనన్న ఇష్టము లేకుండెను.

మాగ్డలాదుర్గము దుర్భేద్యమైనదని రాజు విశ్వసించెను. కాగా బ్రిటీష్ సైనికుల రాకకు ఎదురుచూచుచు అతడు మాగ్డలాదుర్గము నందే యుండెను. రాజధాని పొలిమేరకు వారు వచ్చువరకును రాజువారిని తలపడనే లేదు.

అబిసీనియనులు ఆయుద్ధమున ధైర్య సాహసములతోడనే పోరిరి. కాని ఓడిపోయిరి. బ్రిటిష్ సైనికులలో ఒక్కడుమాత్రము మరణించెను, ఇరువదిమంది మాత్రము గాయపడిరి. అప్పటికి థియోడర్‌నకు బుద్ధివచ్చినది. రాయబారము నడుపుటకు తాను సిద్ధముగ నుంటినని కబురంపెను. తనమాట కరారు చేయుటకుగాను తనకడ బందీగాఉన్న బ్రిటీష్ జాతివారి నందరిని బ్రిటీష్‌వారి శిబిరమునకు పంపివైచెను.

శత్రువుజుట్టు చేతికిచిక్కినది. కాగా నేపియర్ సేనాని ఇట్లు కబురుచేసెను. 'రాయబారములకు కాలము దాటిపోయినది. నీవు పూర్తిగా మాకు వశమైపోవలయును.' దీనికి రాజు అంగీకరింపలేదు. కోటముట్టడించుటకే నేపియర్ కృతనిశ్చయుడయ్యెను. కాని కోట ముట్టడి సులభసాధ్యమైనదికాదు. భూమి మట్టమునకు తొమ్మిదివందల అడుగుల ఎత్తున ఉన్న కొండలపై అది కట్టబడినది. ఆకొండలు నిట్రమైనవి. వానిపైకి వెళ్లుటకు రెండు తావులయందే కొద్ది వీలుండెను.

ఉత్తరపు దిక్కున ఉన్న మార్గమున కోటను ముట్టడించుటకు నేపియర్ పూనెను. ఎక్కుటకే ఎంతయో కష్టమైనది. కోట ద్వారముకడ ఘోరరణముజరిగినది. బ్రిటీష్ సైనికులు విజయమందిరి. 1868–వ సంవత్సరము ఏప్రియల్ 13–వ తేదీని బ్రిటీష్ సైనికులు మాగ్డలా నగరమున ప్రవేశించిరి. థియోడర్‌ని రాజధాని జయింపబడినది. బ్రిటీష్‌వారికి ఈ దాడికి అయిన ఖర్చు తొంబది లక్షల పౌనులు.

కాని రాజుమాత్రము పట్టుబడుటను తప్పించుకొన్నాడు. ఎట్లు? ఆత్మహత్య చేసికొని. శత్రువులచేత జిక్కుపాటై అవమానమును భరింపలేక ఆ రాజు తన్నుతానే చంపుకొన్నాడు. రాజునగరద్వారమున కాలుపెట్టిన తోడనే బ్రిటీష్ సైనికులు కాంచిన మొదటి వస్తువు రాజుగారి శవమే.

అబిసీనియాతో ఇంగ్లండునకైన ఆచిన్న యుద్ధము ఇట్లు ముగిసినది. మాగ్డాలా కోట కైవసమైన వారములోపుననే బ్రిటీష్ సైనికులు తిరుగుప్రయాణమున కారంభించిరి. ఆదాడియొక్క ఉద్దేశము బ్రిటీష్ బందీల విమోచనమే. ఆఉద్దేశము నెఱవేరుటతో వారి కక్కడ ఇక ఏమిపని ఉన్నది.

రాజ్యాక్రమణము లేదు. అబిసీనియా యొక్క రాజ్యాంగవిషయములందు జోక్యము కలిగించుకొను ప్రయత్నమును లేదు. అసహాయశూరుడై శత్రుదేశగర్భమును చీల్చికొనిపోయి ఈదాడియందు జయమందినందులకు నేపియర్‌నకు సర్ బిరుద మిచ్చిరి, పీరేజ్ నొసగిరి. చరిత్రలో మాగ్డాలా నేపియర్ అను నామ మాతనికి రూఢమైనది.

అబిసీనియాపై ఈ ఇంగ్లీషుదాడికిని నేటి ఇటలీ దాడికిని ఏవిషయమునందును పోలిక లేదు. నేటి ఇటలీదాడి రాజ్యాక్రమణ తృష్ణతో గావింపబడుచున్నది. శాంతి ప్రయత్నములు చెడినవిమ్మటనే ఇంగ్లీషువారాదాడికి కడంగిరి. ఇతరులు చేయుచున్న శాంతి ప్రయత్నములను పెడచెవినిపెట్టి నేడు ఇటలీ ఈ దాడికి కడంగినది.

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

# ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ,

## లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :— బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :

మ-రా-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

**స్వల్ప ప్రీమియములు.** **నవీనపద్ధతులు.**

ఏజంట్లకు ధారాళమైన కమీషన్ యియ్యబడును.

జననభీమా శిశుపోషణకు గొప్ప సహాయకారి.

### ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు.
2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును,
3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు,
4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి,
5. పట్టాదారులకు ఋణము లియ్యబడును,
6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును.
7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును.
8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరము నగు సేవయే ఆదర్శము.

పూర్తి వివరములకు :

సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

ఆంధ్రప్రావిడెంటుకంపెనీ,

గాంధినగర్, బెజవాడ.

# మణిమాల

## తెనుగువారిలో నాగులచవితి

హిమాలయపర్వతము మొదలుకొని వింధ్యపర్వతము వఱకునుగల దేశమునంతను ఒకానొక కాలమున నాగులనియెడి జాతివారు పరిపాలనము చేయుచుండినవారని మన కావ్యపురాణేతిహాసము గ్రంథములవలనను, బౌద్ధమతస్థుల గ్రంథములవలనను గానఁబడుచున్నది. మన పురాణాదులయం దభివర్ణింపఁబడిన నాగలోకమనునది యీ నాగులదేశమెగాని పాతాళము గాదు. నగమనఁగాఁ గొండ. నాగమనఁగా బాము. నగములోనుండి పుట్టినది నాగము. ఈ నాగులనియెడి జాతివారు నాగములను బూజించువారగుటచేతనో నాగమును ధ్వజమును ధరియించెడు నాగధ్వజులగుటచేతనో లేక నగలయందు సంచరించెడు జాతివారగుటచేతనో మఱియేమి కారణముచేతనో యీ జాతివారికి నాగులనియెడి పేరువచ్చినది. మనపూర్వగ్రంథము లీనాగుల కథలతో నిండియున్నవి. ఈనాగుల యనార్యాచారములనే పెక్కింటి నిప్పటికిని మనవారవలంబించియే యున్నారు. ఈనాగులు పాములను బూజించువారు గనుకనే నేఁటికిని మనవారు పాములను బూజించుచున్నారు. పూర్వకాలమునం దీదేశము నాగులకు లోఁబడి నాగులచేఁ బరిపాలింపఁబడి నాగసాంప్రదాయములనే యవలంబించి నాగుల యనార్యాచారములలో మునింగియుండినదగుటచేతనే కాఁబోలు మనదేశమునందెచ్చట విన్నను నాగశబ్దమే వినంబడుచున్నది. మనదేశమునందు నాగూరు, నాగవరము, నాగపురము, నాగపట్టణము, నాగేశ్వరము, నాగులపాడు, నాగిమూడి, నాగరము మొదలగు గ్రామనామములు వినంబడుచున్నవి. ఇంతియగాక నాగి, నాగఁడు, నాగులు, నాగయ్య, నాగన్న, నాగప్ప, నాగిరెడ్డి, నాగినీఁడు, నాగరాజు, నాగవర్మ, నాగలింగము, నాగరత్నము, నాగోజీరావు, నాగేశ్వరరావు అను నామములు మనుష్యులలో వినంబడుచున్నవి. మఱియును మనదేశమునందు నాగులను బూజించుటకు కార్తిక శుద్ధచతుర్థి 'నాగులచవితి' యను పేరుతోఁ బర్వదినముగా నొప్పుచున్నది. ఈపర్వదినము బ్రాహ్మణులకంటెను బ్రాహ్మణేతరులచే మిక్కిలి భక్తిపూర్వకముగఁ బూజింపఁబడుచున్నది. పూర్వకాలమునందలి యార్యు లీ నాగములను గొల్చెడి నాగులను సాధారణముగా గౌరవముతోఁ జూచెడివారు గారు. ఆ కారణముచేతనే కాఁబోలు నెవ్వడైన నొకానొకప్పు డేదియైన నొక తెలివితక్కువ పనిచేసినప్పుడుగాని హానికరమైన పనిచేసినప్పుడుగాని మనవారు 'ఓరినాగులూ, ఓసినాగమ్మ' అని నిందాగర్భముగఁ బలుకుచుండుటను నేఁడును మనము చూచుచున్నాము. మనదేశమునందు కార్తిక శుద్ధ చతుర్థి (నాగులచవితి) వలెనె మహారాష్ట్రాది దేశములయందు నాగపంచమి యను పేరను కార్తికశుద్ధ పంచమి పర్వదినముగాఁ బరిగణింపఁబడుచున్నది. దీనినంతయును బరికించిచూడఁగా నీయాచారము లన్నియు నాగులనుబట్టి మనకు సంక్రమించినవి గాని యివి నిజముగా నార్యాచారములు గావు.

—చిలుకూరి వీరభద్రరావు.

* * *

## నాగులచవితి అంతరార్థము

నాగులచవితి తెనుగువారి ముఖ్యమైన పర్వదినాల్లో ఒకటి. క్రూరమైన పాములకు కూడా పాలుపోసి జీవకారుణ్యం తెనుగువారు ప్రదర్శించే దినమది. హింసాప్రియులైన పాశ్చాత్యులూ, వారి నాగరికతకు దాసులైన మన నవీనులూ ఇట్టివాటిని నిరసించినా దాని పవిత్రతనూ, అంతరార్థమునూ గ్రహించిన భారతీయులు ఆదినుండీ ఈ ఆచరణను సాగిస్తూనే ఉన్నారు. తెనుగు యువతీయువకులు, బాలవృద్ధులు సుస్నాతులై ఉపవ

సించి పుట్టలదగ్గరకుపోయి 'నాగన్న'కు పాలుపోసి చిమిలి సమర్పించి వస్తారు. ఎంత ఉన్నతమైన భావమది! తెనుగుసీమ ఒకప్పుడు నాగులది. తెనుగులది నాగవంశము. నాగపూజ తెలుగుల ఆదర్శం. కనుకనే తెనుగు నాడులో నాగులచవితి కింత ప్రాముఖ్యం!

—సత్యవాణి.

* * *

## బొప్పాయి చెట్టు ఉపయోగములు

బొప్పాయి పచ్చికాయలను పల్చని ముక్కలుగా కోసి ఆ ముక్కలను గుడ్డమీద సిరామరకలు గాని మఱి యేయితర మరకలుగాని యున్నయెడల ఆ మరకలపై రుద్దినచో ఆమరకలు శీఘ్రముగ రూపు మాసిపోవును. ఎట్టి మరకలనైన తొలగింపఁగల శక్తి యీపచ్చి బొప్పాయికిఁ గలదుగాన దీనికి మెలన్ బ్లీచియను పేరు ప్రసిద్ధమైనది. పచ్చికాయలనుండి వచ్చు పాలను బ్రేజిల్ దేశపు స్త్రీలు తమ శరీరసౌందర్యమును పెంపొందించు దానినిగా వాడుదురు. పండిన బొప్పాయి పండు ముక్కను శరీరముపై మాంసమధికముగనున్న భాగమున రుద్దినచో యచటి యధికమైన మాంసము తగ్గిపోవును. అచట చర్మముపైగల ముచ్చలను కూడ లేకుండ జేయును. వృద్ధులు యువకులు, యువతులు తమ చర్మకాంతి వృద్ధిపఱచుటకై టోయిలెట్ గానీ బొప్పాయికాయ నుపయోగింతురనియు, ఈ బొప్పాయిని చర్మమున కుపయోగించువారలు చాల సౌందర్యయుతులై యుందురనియు ఒక ఫ్రెంచి గ్రంథకర్త వ్రాయుచున్నాడు. బొప్పాయిపండును నిమ్మరసముతోను, పంచదారతోను కలిపి చాలమంది భుజింతురు. గర్భిణీస్త్రీ యీ బొప్పాయిపండును గాని, అందలి గింజలను గాని భుజించినచో గర్భస్రావము కలుగునట. స్త్రీలకు స్తన్యము వృద్ధిచేయుటకు బొప్పాయి ఆకులను నలుగగొట్టి వాని నొక పెనముపైవెచ్చజేసి వెచ్చగనున్న ఆకులు స్త్రీల వక్షోజములపై వేసినచో స్తనములందు పాలు వృద్ధిగాంచునని ప్రసిద్ధి. సాంతాలుపరగణాలలోని జను లటులఁ జేయుదురు. ఈ బొప్పాయి ఆకులను వెచ్చఁజేసి యేనుగుకాళ్ళకు పట్టీ వేసినచో నయమగునని దక్షిణహిందూదేశమున కొన్ని ప్రాంతములందు నమ్మబడుచున్నది. తామర మొదలైన చర్మరోగములకు, బొప్పాయికాలలోని గింజలను గ్లిసరీన్ తో నూరిన ముద్దను రాచినచో అట్టి చర్మరోగములన్నియు రూపుమాయును. ఆగింజలనే తేనెతోనూరి బిడ్డల కిచ్చినచో బిడ్డల లీవర్ (కార్జము), స్ప్లీన్ (ప్లీహము) ఎన్ లార్జిమెంటు తగ్గిపోవును. బొప్పాయిపండు విరోచనకారి. ప్రతిదినము తినినచో మలబద్ధము క్రమముగ తగ్గించివేయును. మూలశంకనుకూడ తగ్గించివేయును. పిల్లలలో స్ప్లీన్ (ప్లీహము) వృద్ధిని పోగొట్టుటకు బొప్పాయిపండును కోసి (పచ్చిది) దానిలో ఉప్పుకలిపి తినిపించవలయును. హిందూదేశము నవేకప్రదేశములలో డయేరియా, డిసెంటరీ (చిరకాలమునుండి వికటించిన అతిసారము) పోగొట్టుటకు బొప్పాయిపండు అమోఘమైనది. పండ్లనుండి తీయబడిన షర్బత్తులు, సారాయములు, ఎలిక్జిరులు అన్నియు మన శరీరమునకు టానిక్కులు (బలమును వృద్ధిపొందించునవి) గా పనిఁజేయును. పచ్చి బొప్పాయికాయతో తయారుచేసిన కషాయమునకు అజీర్తిని పాఱద్రోలుటలో గొప్పశక్తిగలదు. అజీర్తికి వాడబడు Caripeptic Liquid బొప్పాయిపండునుండి తీసిన రసమే. ముఖముమీద బయలుదేరు మొటిమలకు పచ్చికాయ ముక్కలను చఱిమిన అవి పోవును. అతిమూత్రవ్యాధిగలవారు కూడ దీనిని భుజించుచో మిగుల నుపయోగముగలుగునని అనుభవజ్ఞుడగు రోగియొకడు తెలుపుచున్నాడు. Latex అను బొప్పాయి సంబంధమైన పదార్థము అత్యధికముగ వచ్చు దగ్గు (whooping Cough) నరికట్టుటలో నమోఘముగ పనిచేయును.

—ఆకుండి వెంకటశాస్త్రి.



౧

సీ. ఫూత్కారపవనంబు పూరించు పుక్కిళ్లు ముసిఁడిపండులతోడ ముద్దుఁగురియ
సందిటి సంకుపూసల సద్దుటు తుంబినాద స్వరోజ్జృంభణముల నడఁప
నేదురంధ్రమ్ములు నిరుకేల వ్రేళ్ళను వివృతి సంవృతిలీల విస్తరింప
నాలాపతాళాంతరాంతరంబులయందు విక్కనుశబ్దముల్ చొక్కటముగ

నాగసింధుప్రభేద నానావరాట
రాగగంధర్వలహరికారంభణముల
మిహిపదంబుగఁ బాములమొంగఁ దూదె
భోగిరాజులు వర్తిలప నాగసరము.

౨

సీ. కద్రూమహాదేవి గారాపుసంతతి మదుకైటభారాతి మడుఁగుఁ బాన్పు
కాలకంఠుని యంఘ్రి గండపెండారంబు భానుమంతుని తేరి ప్రగ్రహంబు
నక్షత్రవీథి నెన్నడిమి పెద్దగ్రహంబు మూలాలవాలంబు మొదటిదుంప
యాదిభైరవదేవు యజ్ఞోపవీతంబు క్రీడావరాహంబు తోడిజోడు

యర్కనందను సెలకట్టె యంపకోల
పులుఁగురాయని తత్కాలపుణ్యభిక్ష
కేతకీపుష్పవాసనాకృత్రిమాసి
పర్వతేంద్రంబు తరిత్రాడు పాపతేఁడు.

—శ్రీనాథమహాకవి.

# రాస్‌టఫారికి విజయము, వినాశము విమానము వల్లనేనా?

అబిసీనియాచక్రవర్తి రాస్‌టఫారీకి అమెరికా దేశమునుండి రెండువిమానములు బహుమానముగా పంపబడినవని వార్తాపత్రికలలో చదివియున్నాము. విమానములనిన టఫారీకి అభిమానము హెచ్చు. 1923 లో ఆతడు ఏడెన్ వెళ్ళినపుడు తోడవచ్చినవారు వారించుచున్నను విమానవిహారము గావించినాడు. 1930 నవంబరు 2-వ తేదీని జరిగిన తనపట్టాభిషేకమహోత్సవమునకు ఫ్రెంచివారు పంపిన విమానబహుమానమును స్వీకరించినాడు. నాటినుండి విమానములను కొనుచునేయున్నాడు. తనదేశము మొదటి విమానమును కొన్నదానికి గురుతుగా ప్రత్యేకము పోస్టల్‌స్టాంపులు వేయించినాడు. ఎన్నిచేసిననేమి? విమానబలమున ఆతడు ఇటలీతో తలపడుట గొఱ్ఱెపిల్ల కొండను ఢీకొనుటయే. ఇటలీవిమానములు నేడు వేయి యుద్ధకార్యములందు పర్యాప్తములై యున్నవి. మరియొక వేయి నిలవలో ఉన్నవి. ఈ విమానబలముముందు తాను కొన్న కొద్దిపాటి విమానములతో రాస్‌టఫారి నిలబడగలడా?

రాస్‌టఫారికి అబిసీనియాచక్రవర్తిత్వము విమానముమూలముననే వచ్చినది. ఏ విమానబలమున ఆతనికి అబిసీనియాచక్రవర్తిత్వము వచ్చినదో ఆ విమానబలమువలననే ఆతని చక్రవర్తిత్వము పోవునేమో! తనదేశమున తనకు ఎదురుతిరిగినవారిని తన విమానముతో డంగుపఱచి వారి ప్రాణములు బలిగొన్నదానికి శిక్షగా రాస్‌టఫారి పరాభూతి ఈ విమానములమూలముననే జరుగునా? చేసినవారికి చేసినంత అను నానుడి ఈ యెడ సార్థకమగునా?

ఆవిషయమును కాలముచెప్పువఱకు వేచియుందము. ప్రస్తుతములో—లోగడ ఆతడు తన దేశమున తనకు ఎదురుతిరిగిన వారిని తనవిమానముతో డంగుపఱచి వారి ప్రాణములు బలిగొనియున్న విషయము తెలిసికొందము.

1916 లో జాడిటూరాణి అబిసీనియా అధికారిణి యయ్యెను. ఆమె కనికారములేనిది. పెంకిమనిషి. ఆమెకు నాలుగు పెళ్ళిళ్ళు జరిగినవి. తనతోబాటు అబిసీనియాసింహాసనము అధిరోహించుటకు తన నాలగవభర్త రాస్‌గూక్సా నీచకులపువాడగుటచే వీలులేక పోయినది. సింహాసనముకొఱకు ఆమె ఆభర్తకు విడాకు ఇచ్చినది. మగనికంటె అధికారపదవియే ఆమె అభిమానమును చూరకొన్నది. కాని అబిసీనియాప్రజలు భర్తలేని రాణిచే పాలింపబడుటకు అంగీకరింపక పోయిరి. పరిపాలనాదక్షుడగు మగవాడొకడు రీజెంటుగా నియమింపబడుట తప్పని సరియాయెను. రాస్‌టఫారి ఆమె మేనల్లుడు. రీజెంటుపదవికి అభ్యర్థిగా నిలిచెను. ప్రభువర్గమున కాన్వాసింగు చేసి తనను రీజెంటుగా ప్రతిపాదింప జేసికొనెను. తుదకు ఆతడే ఎన్నుకొనబడెను. అతడనిన జాడిటూకు మొదటినుంచియు అనుమానమే, మొదటినుంచియు పక్కలోబెదురే.

అందుకు తగినట్లే రాస్‌టఫారీ నెమ్మదిగా తనస్థానమును బలపఱచుకొన జొచ్చెను. ఇతర రాస్‌లు (ప్రభువులు) టఫారీ మేధావి, దక్షుడు అగుట తెలిసికొని గౌరవింపజొచ్చిరి. కాలముకూడ నాతని కనుకూలపడెను.

1928 అక్టోబరులో అతడు సింహాసనమాక్రమించుకొన ప్రయత్నించెను. రాస్‌టఫారి బలము జాడిటూరాణి పొత్తిపట్టినది. ఎదురొడ్డలేక సంధిప్రయత్నములు సాగించినది. అబిసీనియాలోని ఒక రాష్ట్రప్రభుత్వము ప్రత్యేక మతనికై వస మొనర్పబడినది. షోయాప్రదేశమున కాతడు రాజు గావింపబడెను. రాజ్యతృష్ణకు వశుడైన తనమేనల్లుడు చిరకాల మీ ప్రత్యేకరాష్ట్రప్రభుత్వముతో, ఈ షోయా ప్రదేశపు రాచఱికముతో తృప్తిపడియుండడను సత్యమును ఆరాణి ఆకళించెను. నేడు కాకున్న రేపైన ఆతడు తన పూర్ణదృష్టిని అబిసీనియాసింహాసనముపై ప్రసరించి తీరును. నిజమునకు తనకు రీజెంటుగా ఉన్న ఈ సమయముననే ఆతనిని పలువురు అబిసీనియా రాజుగా తలంచుచున్నారు. ప్రజలలోకూడ ఆతడే రాజను భావము ప్రబలిపోవుచున్నది. కాగా జాడిటూరాణి పన్నుగడలు ప్రారంభించెను.

తాను లోగడ విడాకుఇచ్చియున్న తన నాలగవభర్తతో రాయబారములు నడిపినది. ఆరాస్‌గూక్సాను కొండప్రదేశములకు పోయి ఒక సేనను కూర్చవలసినదని ఆమె కోరినది. కొండజాతులవారు యుద్ధమనిన చెవికోసికొందురు. అట్టివారిని సైనికులనుగా కూర్చుకొని ఆతడు రాజధానినగరముపై దాడిరావలయును. రాణిచే విడాకుపొందిన రాస్‌గూక్సా తోసిపారవేయతగిన శత్రువుకాడు. ఆతడు సమర్థుడు, వీరుడు. విడాకుసంగతి విస్మరించి ఆవీరుడు భార్యమాటప్రకారము కొండలకు పోయి వ్యాయామసుస్నిగ్ధములగు దృఢకాయములుగల వారినెల్ల ఒకసేనగా కూర్చినాడు. రాజధానీనగరమునకై ఎత్తిపోయినాడు.

ఎత్తిపోవుచు రాస్‌టఫారీవద్దకు అతడు వెంటనే అధికారము వీడవలయునని మనుష్యులను తరిమినాడు. టఫారి అనగా భయములేనివాడనిగదా! రాస్‌గూక్సానుండి ఈవార్త తెచ్చిన మనుష్యులనుచూచి ఆతడు నవ్వినాడు. తన యుద్ధమంత్రియగు మొల్లాఛేటాను ఇరువదివేలసైనికులతో రాస్ గూక్సాకు ఎదురుగా పంపినాడు. ఆరెండుసేనలును టానాసరస్సునకు తూర్పున డెబ్బదిమైళ్ళ కవతలిప్రదేశమున తారసపడినవి. అప్పటికి సాయంకాలమైనది. మఱునాటి ఉదయముననే యుద్ధముచేయుటకు సేనాను లిరువురును తమతమ సైనికులను మొగ్గరమున తీర్చిరి. సైనికులలో పలువురు డాలులు, బల్లెములు, అడవిజంతువుల చర్మములు ధరించియుండిరి. కాని ఇరుపక్షములవారి చెంతను పాత తుపాకులు కొన్ని లేకపోలేదు.

ఏప్రియల్ 1-వ తేదీ ఉదయమున ఇరువాగులవారును యుద్ధమునకు తలపడిరి. మొల్లాఛేటా సైనికులు సంఖ్యయందు అధికులు. రాస్‌గూక్సా సైనికులు ధైర్యసాహసములందు నిరుపమానులు. డాలులు, బల్లెములు అన్యోన్యము తలపడి రణధ్వని పుట్టించినవి. జోళ్లుతొడుగుట యెఱుగని ఆ అబిసీనియను సైనికుల పాదఘట్టనములతో అచట భూమి అదరినది.

పెక్కుమైళ్ళ దూరమున రాజధానీనగరమున ఉన్న రాస్‌టఫారీకి ఈ డాలు బల్లెముల ఘర్షణధ్వని కాని, ఈసైనికుల పదఘట్టన కాని వినపడలేదు. కాని ఎట్లయిన విజయమంది తీరవలయునని ఆతడు కృతనిశ్చయుడయ్యెను. అందుకుగాను అత డంతవఱకు అబిసీనియనులు కనివెఱుగని ఒక క్రొత్తమార్గము త్రొక్కెను.

చెమటతో తడిసిపోవుచున్న ఆ అందరి

సైనికులలో గాయములనెత్తుటితో తడిసి పోవువారి సంఖ్యయు తక్కువఅయి ఉండ లేదు. ఎదుటివారి ఈటెపోటులకు తమడాలు నడ్డుపెట్టుచు తమ ఈటెలకు ఎదుటివారిడాలు అడ్డురాకుండుటకు ప్రయత్నించుచున్న ఆఅందరి సైనికులలో ఈటెపోటుతిని తమ డాలుతో నేలకొరుగువారి సంఖ్యయు తక్కువ అయి ఉండలేదు. అట్టి సంకులసమరసమయమున ఉన్నట్టుండి ఆకాశమున ఏదియో చప్పుడు కాజొచ్చెను. డాలు బల్లెములు రాపిడి ధ్వనినికూడ ఆకాశమునుండి వచ్చుచున్న ఆధ్వని డిందుపఱుపజాలెను. యుద్ధముమాని ఆసైనికులు ఆకాశముపై దృష్టులు బరపిరి. మూడు విమానములు రెక్కలల్లార్చుచు తమ వైపు వచ్చుచుండుట వారు చూచిరి. అందు కొందరికి, పాపము! అవి గాలివిమానముల గుటయే తెలియదు.

ఆ విమానములలో ముఖ్యమైనదాని చోదకుడు యాంద్రుమెయిలెట్ అనువాడు. ఆతడు ఫ్రెంచిదేశీయుడు. విమానయుద్ధమునకు అబిసీనియనులను తయారుచేయ రాస్‌టఫారీ ఆఫ్రెంచివైమానికుని జీతమునకు కుదుర్చుకొని యున్నాడు. మిగిలిన రెండు విమానములను నడుపువారు అబిసీనియనులే. మూడువేల అడుగుల ఎత్తునుండి ఆవిమానములు దిగుటకు ఆరంభించినవి. దేవలోకమునుండి తమపై దేవతలే ఈ విమానములపై ఎత్తివచ్చిరేమోనని ఆ అబిసీనియన్ కొండ సైనికులు తలంచిరి. పాపము!

రాస్‌గూక్సా శిబిరమును గుర్తించి వైమానికులు ఆశిబిరముపై బాంబులువైచుచు తుపాకులు పేల్చజొచ్చిరి. నెమలి ఈకల కిరీటముతో, సిందూరవర్ణపు చొక్కాతో రాస్‌గూక్సా సులభముగ ఆనవాలునకు అందిగుఱికి కుదిరెను. గుండుదెబ్బలకు ఆతడు నేలకూలెను. ఆతని సైనికులు చెట్టొక పిట్టయై చెదరిపోయిరి. ఫ్రెంచి వైమానికుడు తన విమానమును నేలకుదింపెను. ఆతని వెనుక అబిసీనియను వైమానికులు దిగిరి. ఆ విమానములంనుండి ఒక అబిసీనియనుదిగి రాస్‌గూక్సా శవముగల తావునకు పోయెను. రాస్‌గూక్సాతలకాయ నఱికి తెచ్చెను. దానిని విమానములో ఒకమూల పడవైచెను. తిరిగి విమానములో ప్రవేశించెను. ఇక విమానము ఎగురవచ్చునని పైలట్‌కు సంజ్ఞ చేసెను.

మఱునిముసములో విమానము లన్నియు తిరిగి గగనమార్గము పట్టెను. వారి రాకకు టఫారి విప్పారిననేత్రములతో ఎదురు చూచుచుండెను. తన జయవిషయమున ఆతడు నిశ్చయుడై యుండెను గావున ఆసమయమున అచటికి ఆతడు తోడిప్రభువుల నెందరినో రావించెను. వచ్చినప్రజ తీర్థప్రజయైరి. జరీచుట్టంచుగల ఎర్రనిపట్టుగుడ్డతో చేయబడిన ఉల్లాభముక్రింద రాస్‌టఫారీ ఠీవిగ ఉపవిష్టుడై యుండెను. రాస్‌గూక్సా తలకొట్టి తీసికొని రావలసినదని ఆతని ఆజ్ఞయే. అగుట నాతడు బుద్ధిపూర్వకముగనే ఈ యుత్సవమును కూర్చెననవచ్చును.

ప్రభువర్గములో ఈ యుత్సవమునకు రాని వ్యక్తి ఒకటిగలదు. ఆవ్యక్తి జాడిటూరాణియే. ఆమె అంతఃపురముననే ఉండిపోయెను.

ఆ ఉత్సవసందర్శనోత్సుకుల తలలపై ఆకాశమున కొద్ది నిముసములలో విమానముల పొలకువ తెలుపు శబ్దమైనది. ప్రదక్షిణములు చేయుచు విమానములు నేలకు వచ్చినవి. యాంద్రుమెయిలెట్ ఈవలకు వచ్చినాడు. రాస్‌టఫారికి వినమితుడైనాడు. ఏబదివేల

ప్రేక్షకుల బహుమానమందినాడు. రాస్ గూక్సా పుర్రె చూపబడగా ఆ ప్రజాసముద్రమున లేచిన ఘోషము మిన్నుముట్టినది, రాజద్రోహి ఖండితశిరము చూచుటచే ప్రజలలో ఉద్భవిల్లిన కోలాహలము చప్పబడకుండగనే రాస్ టఫారీ మరకతశ్యామలవర్ణముగల తన మోటారునెక్కి రాజభవనమునకు తరలిపోయినాడు.

ఇరువది నాలుగుగంటల యనంతరము. జాడిటూరాణి మరణించినదని రాజధానినగరమున వదంతి బయలుదేరెను. ఆమె ఆత్మహత్య గావించుకొని చరిత్రప్రసిద్ధమైన క్లియోపాత్రా మార్గము నవలంబించినదని మొదట పలువురు నమ్మిరి. కాని నిజమునకు ఆమె నిమోనియా జబ్బువలన చనిపోయినది. సింహాసనముకొఱకు తాను లోగడ విడాకు ఇచ్చిన మగనియొక్క విజయమును ఇప్పుడు అదే సింహాసనముకొఱకు ఆమె కోరవలసి వచ్చినది! రోజురోజును మగని విజయము కొరకు ఆమె ప్రార్థనలు సల్పునది. తనకు శీతలభారము. అయినను తేమతోగూడియున్న తన ప్రార్థనామందిరమునందే యుండి రాత్రి అంతయు భగవత్ప్రార్థనము గావించునది. ఎవరు వలదన్నను మానునదికాదు. ఇట్టి స్థితిలో రాస్ గూక్సా మరణవార్త విన్నది. ఆ న్యుమోనియాజ్వరితురాలు ఈఘోరవార్త ఎట్లు భరింపగలదు? ఇరువదినాలుగు గంటలు తిరుగకుండ ఆమె మరణించినది.

ఆమె మరణముతో రాస్ టఫారీ అబిసీనియాచక్రవర్తి అయినాడు. అతడు చక్రవర్తిఅగుటకు విమానములు ఎట్టి సాయము చేసినవో చూసితిరా? నాటికిని నేటికిని విమానములనిన ఆతనికి అభిమానము హెచ్చు. ఆతని సొంతమునకు ఒక 'త్రీసీటర్' విమానమున్నది. దానిపై ఆతడు ఎక్కి తనరాజధానీనగరమగు ఆడిస్ ఆబాబాపై తిరుగుచుగా విహరించువాడు.

కాని ఇప్పుడాతడు ఒక్కసారికూడ విమానమెక్కి విహరించుటలేదు. ఏ ఆడిస్ అబాబానగరమున విమానముపై రాస్ గూక్సా ఖండితశిరము కొనిరాబడినపుడు విజయగర్వముతో తాను గొప్ప ఉత్సవము గావించియుండెనో అదియే ఆడిస్ అబాబానగరమున నేడు టఫారి విమానభయమున విచలితుడగుచున్నాడు. ఇటాలియన్ విమానములు ఏక్షణమున వచ్చిపడునో? విదేశీయులు చాలమంది ఉన్నారు. కావున ఆడిస్ అబాబాపై విమానములనుండి బాంబులు వేయకుండునట్లు ఇటలీప్రభుత్వమువారినుండి కరారుగైకొన ఆతడు సమితికి విజ్ఞాపించుచున్నాడు; ఇతరప్రభుత్వముల వాక్సహాయము నర్థించుచున్నాడు. పగలంతయు దూరదర్శిని యంత్రముతో విమానములు వచ్చుచున్నవేమోనని చూచుటయే ఆతని ఇప్పటి పనియైయున్నది. రాత్రిపూట పట్టణములో దీపపువెలుగు కనిపించినచో ఇటాలియన్ విమానములు పట్టణము గుర్తింపగలవని ఆడిస్ అబాబాలో ఇప్పుడు రాత్రిపూట ఒక్కదీపముకూడ వెలిగింపరాదని ఆజ్ఞాపించినాడు. విమానభయము రాస్ టఫారీని దీపములార్పించునంతవఱకు తెచ్చినది! ఒకప్పుడు రాస్ టఫారి చక్రవర్తిత్వమునకు మంగళాచరణము గావించిన విమానములే ఇప్పుడు ఆతని చక్రవర్తిత్వమునకు చరమగీతము నాలపించునా? ఎక్కివెళ్ళిన నిచ్చెన మీదనే ఆతడు దిగిరావలసివచ్చునా? ఒకప్పుడు ఆతని జయమునకు కారణమైన విమానములే ఇప్పుడు ఆతని అపజయమునకు కారణమగునా?

# జిజ్ఞాస మీమాంస

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొనన పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.

## ౬౩. 'అభిసీనియా: ఇథోపియా'

యుద్ధవార్తలలో తఱుచు వినిపించు అబిసీనియా, ఇథోపియా నామములలో ఏది సరియైనది? ఈ రెండు నామములలో ఏదైన ఒకదానిని ఆదేశీయులు వాడుటకు అంగీకరింపకుండిరా? అట్లు అంగీకరింపకుండుటకు కారణ మేమైనగలదా?

—జి. నాగన్న చౌదరి.

## ౬౪. ముసోలినీపదమున కర్థము

అబిసీనియా చక్రవర్తి అగు రాస్‌టఫారి అనగా భయములేనిప్రభువు అని అర్థమున్నట్లే ఇటలీ నియంతయగు ముసోలినీ అనగా ఏమైన ప్రత్యేకార్థముగలదా?

—కలపటపు దుర్గారావు.

## ౬౫. జాతిసమితిలో భాషాసమస్య

జాతిసమితి సమావేశమున పలుదేశపు ప్రతినిధులు కూడియున్నప్పుడు ఏదేశపు ప్రతినిధి ఆదేశపు భాషలో మాటలాడుచో మిగిలినవారికి ఆభాష తెలియుట కేమయిన ఏర్పాటులున్నవా?

—కె. నరసింహాచారి.

## ౬౬. గ్రేటా గార్బో

సినిమా రంగమున లోకప్రఖ్యాతిగాంచిన గ్రేటా గార్బోకు వివాహమయినదా?

—తిరువీధుల తాయారమ్మ.

## ౬౭. గోదావరి గంగకు అప్ప

గోదావరి గంగకు అప్పగారని పెద్దలంటారు. భూగోళశాస్త్రరీత్యా దీనిని సమర్థింపవచ్చునా?

—నిమిషకవి కామేశ్వరి.

## ౫౫. భార్యను పేరుతో పిలవకుండడము

హిందూసంఘంలోనే కాకుండా ఈ కట్టడి పలుచోట్లవుంది. భార్యాభర్తలు ఒండొరులను పేళ్ళతో పిలుచుకుంటే ఆయుక్షీణమని మన నమ్మకం. నాస్త్యాసాల్యాండు వారికి అల్లా పిలుచుకుంటే సంతానం కలగదని నమ్మకం. బాసుటో జాతీయుల, బేరియా జాతీయుల, కాఫిర్ (ఆఫ్రికా) జాతీయుల, ఓజిబ్బివేస్ జాతీయుల దంపతులు ఒండొరులను పేర్లతో పిలుచుకోరు. కాలిఫోర్నియా లోని నిషీనామ్సు జాతిలో మగవాడు ఏకారణంచేతగాని భార్యను పేరుతో పిలవకూడదు. ఒకవేళ పిలిచాడో భార్య ఆకారణంచేత భర్తను విడాకు ఈయవచ్చును. కొన్నికొన్ని దేశాల్లో తమతమ భర్తలపేర్ల్సుగల వస్తువులను భార్యలును, తమతమ భార్యల పేర్ల్సుగల వస్తువులను భర్తలును ఆయా పేళ్ళతో పిలవ్వడానికే సంప్రదాయం ఒప్పదు

—దువ్వూరి రామకృష్ణారావు, బి. ఏ.

## ౫౬. స్త్రీ కోర్టుషిప్ చేయుట

మానవుల్లోవలెనే పక్షులలోను, జంతువులలోను కూడా కోర్టుషిప్ తరుచు మగవారిపనియే. కాని స్త్రీ కోర్టుషిప్ చేయు నిదర్శనములును లేకపోలేదు. ఫెలారోప్ అను పక్షులలో ఆడదే కోర్టుషిప్ చేస్తుంది. అట్లే సెమళ్ళలోను. టర్కీజాతి కోళ్ళలో ఆడవే—అందు ముఖ్యముగా ముసలివి—కోర్టుషిప్ చేస్తాయి. న్యూమెక్సికో లోని మోక్వేస్‌లో పడుచే తనకు నచ్చినవాన్ని ఎన్నుకొని తండ్రికి చెపుతుంది. తండ్రి పెళ్ళి కుదురుస్తాడు. పెరుగ్వేలో పురుషునికంటె కామవాంఛ స్త్రీలకు ఎక్కువనియు, కావున వారే కోర్టుషిప్ చేస్తా

రనియు తెలుస్తోంది. గోరాస్ అనే జాతివారిలో పడు చూతే తమమగళ్ళను ఏర్పఱుచుకోవాలి. కోర్టుషిప్ చేసి అల్లాగనక వారు ఏర్పఱచుకోకపోతే వారు అపరాధం చేసినవారుగా భావింపబడతారు. ఎనాయిస్ జాతిలో వివాహముచేసికొనుటకు ప్రతిపాదన ముందు బాలికే చేస్తుంది. పోలినేషియాలో, నేగాలునందలి కాఫిర్సు లో, ఒరిగాన్‌కు చెందిన కొన్ని జాతులలో కోర్టుషిప్ స్త్రీలే ప్రారంభిస్తారు

—జి. వెంకటరావు, బి. ఏ.

## ౪౯. తలిదండ్రులకు పెళ్ళిచేసిన కొడుకు

బ్రహ్మచర్య వ్రతనిష్ఠుడగు ఉద్దాలకునకు స్వప్న స్ఖలనముకాగా ఆతడా ధాతువను పద్మముకుళమున బెట్టి గంగలో విడిచెను. రఘురాజు కూతురు అవివాహిత చంద్రవతి ఆసమయమున ఆగంగలో స్నానము చేయుచు ఆపద్మముకళమునందలి వాసనచూచి గర్భవతి యయ్యెను. కారణముగా తలిదండ్రులచే విడువబడి అడవిలో తృణబిందు ఆశ్రమములో పుత్రునిగన్నది. ఈతడు పెద్దయై తన తలిదండ్రులగు చంద్రవతి, ఉద్దాలకులకు సంధానముచేసి వివాహముచేయించెను. ఈవృత్తాంతము 'నాసికేతోపాఖ్యానము' అను పద్యకావ్యమున వర్ణింపబడినది.

—చల్లా సోమనాథశాస్త్రి.

## ౫౦. ముట్టునీళ్ళనాడు కూరలు తరుగడం

ముట్టునీళ్ళు పోసుకున్ననాడు స్త్రీలకు శరీరమున అత్యుష్ణముకాని అతిశీతలముకాని ఉండును. అట్టి సమయమున కూరలు తరుగుటలో ప్రమాదమున చేయి కోసుకొనిన రక్తము స్రవించి వాతము క్రమ్మవచ్చును. మరియు ఋతుస్నాత అగు స్త్రీ గర్భధారణకు యోగ్యురాలై యుండును అట్టియామె జీవహింస చేయకుండుట మంచిది. కూరగాయలు జీవముగలవే అను మన పెద్దల నమ్మకమును జె. సి. బోసుగారు నేడు నిరూపించికొని యున్నారు. అదియునుగాక ఋతుమతియగు స్త్రీ పాదులదగ్గరకు పోవుచో అవి చనిపోవును, లేదా గొడ్డుపోవును. నీళ్ళనాడు అందరు స్త్రీలకును ఋతువు నిలిచిపోదు. అనగా అంటుదోషము తగ్గదన్న మాట. అట్టిస్త్రీలు ముట్టిన కూరగాయలు నిస్సారము లగును. నిస్సారములగువానిని భుజించి ప్రయోజనము లేదుగదా? కూరగాయలు తరుగుటలో గాయమై రక్తము స్రవించి వాడు వాతముక్రమ్ముటకు అవకాశ ముండుట, గర్భముధరించి కొత్త ప్రాణమును సృష్టింపదగు యోగ్యతగల స్త్రీ జీవహింస సేయకుండుట వాంఛనీయమగుట, ఋతుస్నాతల స్పర్శచే కూరగాయలు నిస్సారములు కాగలుగుట అను మూడు కారణములచే ముట్టునీళ్ళనాడు కూరగాయలు తరుగరాదని మనపెద్దలు ఏర్పాటుచేసిరి.

—తిమిరపు రామభద్రచయనులు.

## ౫౧. తెనుగులో సినీమా పత్రిక

సినీమాపరిశ్రమయందును, పత్రికానిర్వాహణమునందును భారతదేశమునందలి ఇతరరాష్ట్రీయులకు మన ఆంధ్రులు చాల వెనుకబడియున్నారు. ఆ కారణముచేతనే తెనుగున ఇంతవరకు సినీమాపత్రిక బయలుదేర లేదు. ఇపుడు టాకీ అను పేరుతో మదరాసునుంచి ఒక తెనుగు సినీమాపత్రిక రాగలదనియు, దానికి జ్వాల సంపాదకులు సంపాదకులుగా ఉందురనియు తెలియుచున్నది.

—వింజమూరి విశాలాక్షి.

## ౫౨, పెద్ద సినీమా మందిరం

ప్రపంచకములోకల్లా పెద్ద సినీమామందిరం అమెరికా సంయుక్త రాష్ట్రముల రాజధానీనగరమగు న్యూయార్కులో ఉంది. దానిపేరు 'రాక్సీ.' అందు ఒక్కసారిగ ఆరువేలమంది ప్రేక్షకులు ఆశీనులగుటకు తావున్నది.

—హిందూస్థాన్ ఇయర్ బుక్.

# అత్యాశ్చర్య కుష్ఠురోగనిర్మూలిని. (రిజిష్టర్డు)

గుణములేదని ఋజువుచేయువారికి రు 1000 లు బహుమానము. 20-వ శతాబ్దముయొక్క క్రొత్త వింత. 18 రకముల కుష్ఠులు, బొల్లి, సర్వచర్మవ్యాధులు, యేస్థితిలో యెంతకాలమునుండి జీర్ణించియున్నను గ్యారంటీగా బాగుచేయుదుము. విశాఖపట్టణమున మొదట స్థాపనకాబడి వేలకొలది రోగులను బాగుచేయుచున్న కంపెనీ మా లక్ష్మీ అండు కంపెనీయే. డాక్టర్లు కుష్టులపాలిటి కల్పతరువని సర్టిఫైచేయుచున్నారు

డాక్టరు వి. యన్. శోషర్, యం. బి. హెచ్. యమ్. డి., చర్మరోగ చికిత్సానిపుణులు, సేలం, గారు యీక్రిందివిధముగా వ్రాయుచున్నారు.




“లక్ష్మీ అండు కంపెనీవారి అత్యాశ్చర్య కుష్ఠురోగ నిర్మూలిని అను ఔషధము, నా కుష్ఠురోగులకు వాడితిని. 30 దినములలో అద్భుతముగు గుణమిచ్చినది. ఆమందువలన కుష్ఠురోగము పోయినపిమ్మట రోగి రక్తము పరీక్షచేయగా కుష్ఠక్రిము లేమియులేవు. లక్ష్మీ అండు కంపెనీ వారిమందు యిప్పటి కాలపు మందులన్నిటిలోకి మిన్నగా సర్టిఫైచేయుచున్నాను.” పూర్తి వివరములకు యీదిగువ అడ్రసుకు వ్రాయుడు.

## లక్ష్మీ అండు కంపెని, (రిజిష్టర్డు)

**కుష్ఠురోగచికిత్సానిపుణులు.**

**వాల్తేరు. ఆర్. యస్. పోష్టు.**



## ఆంధ్రజ్యోతి

మోల్మేన్—వారపత్రిక

సాలు చందా రు 3. విడి పత్రిక 9 పైసలు.

బర్మాలోని 1,60,000 ఆంధ్రుల క్షేమానికి పాటుబడుచున్న వారపత్రిక. ఇందు కార్మిక, సాంఘిక, రాజకీయ, వాణిజ్య విషయాములు నిష్పాక్షికముగ చర్చించబడును. దీనికి బర్మాఅంతట ప్రచారము గలదు. వర్తకు లిందు తమ సరసలను ప్రకటించిన మంచి లాభమును పొందగలరు.

వివరములకు :—

ఎడిటర్, “ఆంధ్రజ్యోతి”
185, లోవర్ మెయిన్ రోడ్డు,
మోల్మేన్-అని వ్రాయుడు.



## మొమ్మాయి-జీవన్

శ్రేష్ఠమైన హిరానీ మొమ్మాయితో మహత్తర శక్తిమంతములైన అనేక ఓషధులు చేర్చి చేయబడినది.

రక్తవృద్ధిని, ధాతుపుష్టిని, జవసత్త్వములను కల్గించును శుక్రనష్టము, శీఘ్రస్ఖలనము, కీళ్ళనొప్పులను నివారించి వజ్రకాయము నొసంగును.

(20 రోజులకు) సీసా 1 కి రు 2-0-0.

పోస్టేజీ ప్రత్యేకము.

ఆంధ్ర కెమికల్ అండ్
ఫార్మస్యూటికల్ వర్క్సు. (రిజిస్టర్డు).
గాంధినగరం, బెజవాడ.

సినీమా నటులు



సవితా దేవి.



రితలరాయ్

# ఐరావతి

లక్షా అరువదివేల బర్మాఆంధ్రుల క్షేమాభివృద్ధులకు ప్రతి శనివారము వెలువడు ప్రజాహిత పత్రిక. 7 సంవత్సరముల నుండి బర్మాఆంధ్రుల శ్రేయోభివృద్ధికై పాటుపడుచున్నది. ఇది ఆంధ్రులకు అండ, కార్మికులకు పట్టుకొమ్మ. యువజనోద్యమము నకు ఉనికి. నిర్మోమాటముల నిప్పు. అన్యాయముల నంతరింప జేయుటకు బ్రహ్మాస్త్రము. ఆంతర్యమెరిగినవారికి హాయి, చదివినవారికి మితోయి.

సంవత్సరపు చందా రు 3.     పై గ్రామస్థులకు రు 3-12-0.

చిరునామా :

ఐరావతి పత్రికా కార్యాలయము, 233 బార్ స్ట్రీట్, రంగూను. (బర్మా.)



# గోలకొండ పత్రికా ప్రచురములు

త్రూపుబజారు, దక్షిణ హైద్రాబాద్,

| | | | |
|---|---|---|---|
| 1. గోలకొండ కవుల సంచిక. ౩౫౩ కవులభావ విలసనములు. ౩౩ పటములు, ౪౫౦ పుటలు. గోలకొండ పత్రిక చందాదారులకు ... ... ... | 1 | 0 | 0 |
| ఇతరులకు ... ... ... | 2 | 0 | 0 |
| 2. ఉచ్ఛల విషాదనాటకము, కాశ్మీర ప్రాచీన చరిత్రాత్మక విషాదాంత నాటకము. సురవరము ప్రతాపరెడ్డిగారి కృతము. ... ... ... | 0 | 12 | 0 |
| 3. సంఘోద్ధరణము. సాంఘిక సమస్యలపై చర్చ. సు. ప్రతాపరెడ్డిగారిది... ... ... | 0 | 6 | 0 |
| 4. గయోపాఖ్యానము. ద్విపద. ప్రాచీనకవి నాదెండ్లగోప ప్రధానికృతము ... ... ... | 0 | 6 | 0 |
| 5. సుధాలహరి. ప్రాచీన జైనకవి శ్లోకములు. తెలుగుపద్యములు. | 0 | 2 | [illegible] |
| 6. కృష్ణాలహరి. శ్లోకములు, పద్యములు ... ... | 0 | | |

# విడ్డూరములు

### బంగాళాదుంప కడుపులో ఇనప చెమ్చా

కెనడా దేశమందలి గెనానొక్యూకు చెందిన వార్తా పత్రికయొకటి బంగాళాదుంప కడుపులో ఇనపచెమ్చా కానవైన విచిత్రవృత్తాంతమును ప్రచురించుచున్నది. ఒక యిల్లాలు ఒక బంగాళాదుంపను తరుగబోయెను. ఆ దుంప మామూలుదుంపకంటె చాల పెద్దదైయుండెను. కత్తిపీటకు అందీయగా దుంపలో ఏదియో గట్టివస్తువు అడ్డుపడెను. పరీక్షమీద అదియొక ఇనప చెమ్చాఅగుట తెలిసికొనబడెను. ఆచెమ్చా అందులోకెట్లువచ్చినది? ఎవరో పారవైచుకొనిన చెమ్చా భూమిలోపూడిపోగా ఆస్థలమున ఊరిన బంగాళాదుంప దానిని లోగొనియుండును.

### ఆవూళ్లో చదరంగపుటాట రాకపోతే పెళ్ళికాదు

జర్మనీకి చెందిన హార్టజా పర్వతములలో స్ట్రోబెక్ అను నొకవిడ్డూరపు గ్రామముకలదు. తరములవెంబడి ఆగ్రామము చదరంగపుటాటకు ప్రపంచప్రఖ్యాతి గాంచియున్నది. ఆ ఊరిలో చర్చిశిఖరముపైకూడ చదరంగపుపలకయే వాయుప్రసారసూచిగా అమర్చబడియున్నది. మరియు పాఠశాలలకు విద్యార్థులు వారివారి చదురంగపు పలకలను దినదినము తెచ్చికొందురు. పాఠములతోబాటు చదరంగపుటాటకూడ వారికి నేర్పబడును. ఈ గ్రామమునకు చెందిన యువకులను అన్య గ్రామపు యువతులు వివాహమగుటకు ఆయువతులు చదరంగపుటాటయందు చదురాండ్రయి యుండి తీరవలయును. అట్లు వారు చదరంగపుటాటయందు చతురురాండ్రు కానిచో వారు తమ భర్తయొక్క గ్రామాధికారులకు కొంత అపరాధపుపన్ను కట్టవలయును. ఇట్లు వసూలైన పన్నులు ఏటేట ఏర్పాటుచేయబడు చదరంగపు పోటీల సమయపు ఖర్చులకు అక్కఱకు వచ్చును. ఈ గ్రామపు యువతులు అన్యగ్రామపు యువకులను పెండ్లాడుచో వారీగ్రామమును విడిచిపోవుటకు పూర్వము ఈ గ్రామపు మేజిస్ట్రేటుతో ఆమె చదరంగపుటాట నాడవలెను. ఏతద్గ్రామప్రతిష్ఠకు హేతువైన చదరంగపు క్రీడాజ్ఞాన మామెకున్నదని ఇట్లునిరూపించుకొనువరకు ఆమె అత్తవారింటికి పోరాదు.

### సముద్రములో 150 మైళ్లు ఈదినాడు

ప్రమాదవశమున సముద్రమున బడిన చేపలబట్టువాడొకడు అమెరికా సంయుక్తరాష్ట్రపు తీరమునుండి నూటఏబదిమైళ్ళు ఈదిన తరువాత కనుగొనబడి రక్షింపబడినాడు. నెపోలియను చక్రవర్తికి పిమ్మటను ఇన్నిమైళ్ళు సముద్రములో ఈదిన మానవమాత్రుడు మరియొకడు లేడు.

### ఒంటిపట్టామీద నడచే రైలు

రైళ్ళన్నిటికీకూడా రెండుపట్టాలు కావాలి అవి పునాదిగా తేటందుకు. కాని ఒక్కటేపట్టామీద నడిచే రైల్నికూడా కనిపెట్టారు. ఇల్లాగ ఒక్కపట్టామీదనే నడిపించే ఉద్దేశం మొట్టమొదట లార్టిగ్ అనే ఫ్రాంసుదేశపు ఇంజినీరుకి కలిగింది. ఈతని పద్ధతిలో భూమికి 5 అడుగుల ఎత్తుని A వలె ఉన్న మార్గం మీద పట్టాని అమర్చారు. రైలుపెట్టెలకి అడుగున మధ్యగా కాలవలాగ ఒక త్రోవఉంటుంది. ఇందులోనే చక్రాలు ఉంటూ ఆపట్టామీద ఆనుకుని. అంటే ఈపద్ధతిలో రైలుపెట్టెలు గం పట్టాకి ఒక

వైపునా, మిగతాసగం రెండోవైపునా వ్రేల్లాడుతూ ఉంటుంది. ఈపద్ధతి పి, న్నూల రకమే. కాని తర్వాత బ్రెన్నన్ అనే అతను చాలా ఆశ్చర్యకరంగా తయారు చేసేడు ఒంటిపట్టా రైలు. ఈపద్ధతిలో రైలుపట్టా మామూలుగా నేలమీదే ఉంటుంది. రైలుపెట్టెలుకూడా మామూలుగానే ఉండి వాటికి అడుగున మధ్యగా వరసగా చక్రాలుంటాయి. అంటే ఒకసైకిలు (పెట్టెమాదిరి) పట్టామీద నడుస్తూఉన్నట్టుంటుంది. అల్లా ఉండీ కూడా రైలుస్టేషనులో ఆగినప్పుడు కూడా ప్రక్కలికి పడిపోదు. ఇదంతా కూడా గైరోస్కోపు అనే యంత్రం మహత్తు. ఈయంత్రంలో, అన్నిప్రక్కలకీ కూడా ఆడగలిగే చక్రం ఒక్కటి ఇరుసుమీద నిమిషానికి 3000 మార్లు తిరుగుతూ ఉంటుంది. విద్యుచ్ఛక్తి రైలుచక్రాలని ముందుకి తిప్పుతూ ఉంటుంది. ఈ గైరోస్కోపు చక్రాలు రైలుపక్కకి పడిపోకుండా కాపాడతాయి. ఒక ప్రక్కనించి గాలి ఎంతగట్టిగా వీచినా సరే, లేక రైలుపెట్టెలలో సామానంతా ఒక్కవైపున వేసినాసరే, ఈయంత్రం పనిచేస్తూ ఉన్నంతవరకు కూడా రైలు పడిపోదు. ఈ రైలుమీద గంటకి 130 మైళ్ళదూరం వెళ్లవచ్చును. ఈ రైలుమార్గం కట్టేందుకు కూడా, మామూలు రైలుమార్గం కట్టేందుకు అయ్యే ఖర్చులో 20-వ వంతు మాత్రమే అగుతుంది.

—వడ్డాది సీతారామారావు, బి, ఏ.

౯, పురుగులనుతినే మొక్కలు

డయొనియా అనే మొక్క తన ఆకులమూలంగా చిన్న పురుగులని పట్టుకొని తింటుంది. ఆకుమీద ఏ పురుగైనా వ్రాలగానే దానిని పోనీయకుండా ఆకు తటాలున ముడుచుకొంటుంది అప్పుడు ఈ ఆకు కొన్ని ద్రవాలని స్రవింపజేసి పురుగుని జీర్ణంచేసుకొంటుంది. పురుగు జీర్ణం అయ్యేదాకా ఆకు ముడుచుకునే ఉంటుంది. ఈ మొక్కనే వీనస్ ఫ్లయిట్రాప్ అని కూడా అంటారు. ఇల్లాంటిదే బ్లాడర్ వోర్టు అనే మొక్క కూడాను. ఇది నీళ్ళల్లో      స్తుంది. దీని ఆకులలో ఒక భాగం బంతిలాగ      దీనికొక తలుపు ఉంటుంది. ఈతలుపు ఒక వాల్వు లాంటిది. లోపలికే తెరుచుకుంటుంది కాని బయటికి తెరుచుకోదు? నీళ్ళతో కలిసి లోపలికి ఏదైనా పురుగు వెళ్ళిందంటే అది ఇక బయటికివచ్చే ఉపాయంలేదు. ఈ పురుగుని జీర్ణం చేసేసుకుంటుంది మొక్క. ఇట్లాంటి మొక్కలు ఇంకా కొన్ని ఉన్నాయి.

—వడ్డాది సీతారామారావు, బి, ఏ.

౯. 6 ఈతలకు ఆ ఆవు 18 దూడల్ని పెట్టింది

రష్యాలోని కుర్స్కులో గాల్కా అని ఒక ఆవు ఉంది. ఆ ఆవు ఇంతవరకు ఆరు ఈతలు ఈనింది. ఆరు ఈతలికి అది పెట్టిన దూడలు పద్దెనిమిది. 1931 లోను 1935 లోను అది ఒక్కొక్క ఈతకే నాలుగేసి దూడల్ని పెట్టింది. ఈ ఆవు ఇప్పుడు శాస్త్రవేత్తల పరిశీలనక్రింద ఉన్నది

౯. ముష్టిదానిదగ్గర ఏబదివేల రూపాయిలు

పాటియా నగరమందలి సెయిభాబండి గేటుదగ్గర గనేశి అను పేరుగల ముష్టిది ఉండేది. అది అడుక్కు తిని బ్రతికేది. ఈమధ్య పోలీసువారు ఆ మొగుడిసె సోదా చేయగా ఏబదివేల రూపాయిల విలువగల సొమ్ము దొరికింది. అందు 250 బంగారు మొహిరీలు, ఒకమణుగుమీద ఇరువదియేడు సేర్ల చాదీవెండి.

౯. సర్కారు పన్నుక్రింద తలవెంట్రుకల జప్తు

లాపుశా అని రుమేనియాలో ఒక పల్లెటూరు. అచ్చటి ఒకరైతు సర్కారు పన్నులు బకాయి పెట్టినాడు. అందుపై పన్ను వసూలుచేయుటానికి బెయిలిఫ్ (వసూలు అధికారి) వచ్చినాడు. రైతు నిండా పేదవాడు. జప్తుచేయడానికి అతనివద్ద ఏమిన్నీ లేదు. అతని ఇల్లాలి తలవెంట్రుకలుమాత్రం దీర్ఘములై సుందరములై ఉండెను. ఆయింట్లో ఆ తలవెంట్రుకలకంటె విలువైన వస్తువులేవు. కాబట్టి బెయిలిఫ్ ఆఇల్లాలి తలవెంట్రుకలు జప్తుచేసి కత్తిరించుకొని పోయినాడు. అందుకుగాను ఆయిల్లాలు కోర్టులో ఆ బెయిలిఫ్ మీద దావా వేసింది. ఈ వార్త కురెంటుల్ పత్రిక ప్రచురించినది.

# కారప్పు శనగలు

కాంగ్రెసు వర్కింగుకమిటీ వారి వార్ధాసభకు, మదరాసు సభకు పోలికలు, తేడాలు ఏమిటండీ అని ఒక నాయకుణ్ణి అడిగాను. దానికి ఆయన ఇల్లా చెప్పారు: వార్ధాసభా, మద్రాసుసభా మంత్రిపదవుల తీర్మానాన్ని వాయిదావేశాయి. ఇది పోలిక. ఇక తేడావిషయం. వార్ధాసభలో గాంధిగారు వర్కింగు కమిటీ మెంబర్లకు వేపఆకుల ముద్దలు పెట్టారు. మదరాసు సభలో నాగేశ్వరరావుగారు ఇతర్లతోబాటు వర్కింగు కమిటీమెంబర్లకు మంచిమంచి పిండివంటలతో భోజనాలు పెట్టారు. ఒక్క తిండివిషయాన్ని పట్టి ఆలోచిస్తే వార్ధాసభ చేదుగాను, మదరాసు సభ తియ్యగాను ఉందిఅని ఒప్పుకోవాలి. మిగతా విషయాల్ని బట్టి ఆసభా, ఈసభా కూడా చప్పగానే ఉన్నాయి.

... ... ...

నాగేశ్వరరావుగారి యింట్లో ఎప్పుడు ఎవరు వెళ్ళినా 'కడెమాడచేయి భోజనమే'. వారి తనయ వివాహానికి బెజవాడలోను, వారి శ్రీబాగ్ గృహప్రవేశానిక మదరాసులోను జరిగిన విందుభోజనాల సంగతులు ఇప్పటికిన్నీ జనులు కథలుగా చెప్పుకుంటూంటారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం కాన్వొకేషన్లు బెజవాడలో జరిగినప్పుళ్ళు నూత్నపట్టభద్రులకు బెజవాడలో వారి దుర్గావిలాస్‌లో విందుభోజనాలు తప్పేవి కావు. నాగేశ్వరరావుగారి అన్నదాతృత్వమును గుర్తించే ప్రభుత్వమువారు ఆయన్ని వెల్లూరు జయిల్లో ఉండగా పాకశాలాధ్యక్షులుగా నియమించారు.

... ... ...

గృహలక్ష్మి అక్టోబరు సంచికలో అబిసీనియా చరిత్ర అని ఒకవ్యాసం ప్రచురింపబడ్డది. అందులో మేనెలెక్ తరువాత అబిసీనియాను అతని మనమరాలు పాలించినదని వ్రాయబడ్డది. అన్ని చరిత్రల్లోను మనమడు పాలించాడని గలదు. మరి గృహలక్ష్మిలో ఇల్లా ఉండడానికి కారణమేమిటి? ఆడవాళ్ళపత్రిక కాబట్టి ఔచిత్యభంగం లేకుండా మనమడు మనమరాలుగా మార్పుచేయడమైనదా?

... ... ...

ప్రబుద్ధాంధ్రసంపాదకులు తలపెట్టిన శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారి సన్మానవిషయమై సంపాదకీయము వ్రాస్తూ ఆశ్వయుజమాసపు 'చంద్రిక' ఇట్లా అంటోంది: 'కాని యొకసంగతి. అనర్హ సమ్మానము ఎంత యనుచితమో, అర్హ సమ్మానమంతకు వేయిమడుంగు లనుచితము.' ఈవాక్యములకు ప్రబుద్ధాంధ్రవారు (ఇతరుల సంగతి మనకెందుకు) ఏమంటారు? ఇట్లు వ్రాయుట చంద్రికవారి పొరపాటంటారా? చంద్రికాసంపాదకులు తమ సంపాదకీయ వ్యాసములలో అరసున్నలు—తెనుగులో మరియే ఇతర సంపాదకులు శ్రద్ధవహించనివి—అతిశ్రద్ధతో వేస్తున్నారు. అట్టివారు అక్షరాల విషయంలో పొరపడతారా? పొరపడ్డమే ఖాయమంటే మాత్రం చంద్రికాసంపాదకులకు అరసున్నలమీద ఉన్న శ్రద్ధ అక్షరాలమీద లేదని ఒప్పుకతీరాలి.

... ... ...

తెలుగువారికంటె అరవవారు ఆకుకూరలు ఎక్కువగా తింటారు. తోటకూర, గోంగూర తప్పితే మనం అట్టే ఆకుకూరలు ఉపయోగించం. కాని అరవవారు తినే ఆకుకూరలకు లెక్కలేదు. ఆఖరికి మేకలుకూడా తినని కామంచికూరకూడా వారు తింటారు. మెద్రాసుకు అవిసెకూర రోజురోజూ రెండెడ్లబళ్ళమీద మేట్లు మేట్లుగా వస్తుంది. నేను మదరాసువచ్చిన కొత్తలో ఈ అవిసెకూరబండిని చూచి మనపల్లెల్లో వట్టిగడ్డి మోస్తరుగా ఈ పట్నంలో పచ్చగడ్డి యిల్లా తెచ్చుకుంటారు కాబోసు అనుకున్నా. కాని అది అంతా మనుషులు కూరగా వండుకోడానికే ఖర్చు అవుతుందని గ్రహించడానికి నాకు అట్టే రోజులు పట్టలేదు. ఈ

మధ్య నేనుండే ట్రిప్లికేన్ భాగంలో ఒకరోడ్డు మలుపులో నిలబడి మొన్న ఆదివారం ఉదయం ఒక తెనుగు మిత్రునితో మాట్లాడుతున్నా. అక్కడ ఒక అవిశాకు కూరబండి ఆపుచేయబడింది. తేనెపట్టుకు ఈగలు ముసిరినట్లు జనలు అక్కడ కోలాహలంగా మూగారు. తలోకట్టా పుచ్చుకుపోతున్నారు. రాగిడబ్బుల చప్పుడు మాకూ వినిపిస్తూంది. కాని ఆమూకలో నాకు తెనుగువాళ్ళు ఎవరూ పొత్తికి రాలేదు. పదినిమిషాల్లో బండి ఖాళీఅయింది. అరవవారికి ఆకుకూరలికి అంతటి ఆప్యాయం! కాబట్టే అరవనాయకుడైన రాజగోపాలాచారిగారి కూతురు గాంధిగారికొడుకును పెళ్లాడినతరువాత మామగార్ని ఆకుకూరలు అభిమానించేవాడ్నిగా చేసింది. అరవవారి వియ్యంకుడు కాకపూర్వం గాంధిగారు ముప్పటకేనా ఆకుకూర తినేవాడా?

... ... ...

గుంటూరు జిల్లానుంచి గోంగూర తీసికొనివెళ్ళి వార్ధాలో గాంధికి సమర్పింప తలుచుకున్న శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిలగారి మాట ఎల్లాఉన్నా తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురంనుంచి మదరాసు కాంగ్రెస్ కమిటీ సభలకు నడిచివచ్చిన శ్రీ సూరంపూడి శ్రీ హరిరావుగారికి కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తు మేనేజరు శ్రీ కొత్తపల్లి సూర్యారావుగారు తమచే రచియింపబడిన 'ఉన్మాదసమాగ్రము' అనే గ్రంథమును బహుమానము చేయదలచిరని బెజవాడనుండి వెలువడబోయే 'ఆంధ్రవార్త' అనే క్రొత్త తెనుగు దినపత్రికకు కాకినాడలో ఉండబోయే స్పెషల్ కరస్పాండెంటు వ్రాసినాడని ట్రిప్లికేన్ అక్బర్‌సాహేబ్ వీధిలో పుట్టిన వదంతి ఎంతవరకు నిజము?

... ... ...

తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారి 'హృదయేశ్వరి' అనే కావ్యంలోని దంతా వైష్ణవప్రేమే అన్నాడు మిత్రుడొకడు. ఆకావ్యప్రచురణతో శివశంకర శాస్త్రిగారి వైష్ణవప్రేమకు వారి స్వస్థలమైన గుంటూరు తో పాటు ఆంధ్రదేశం అంతా విజయమాకిడినట్లయింది. ఈనడుమ నేను వారిని చూచినప్పుడు వారిలో వృద్ధాప్య లక్షణములు బాగా పొడగట్టాయి. పళ్ళు ఊడిపోయాయి. అయినా వారి కవిహృదయంలో వైష్ణవప్రేమ యొక్కతైక్ష్ణ్యాంతగ్గలేదని చెప్పాలి. ఏమంటారా? మొన్నటి 'జ్వాల' పత్రికలో వారు 'ఆచారికీఔరత్' (ఆచార్యుని పెళ్ళిపెళ్ళాము) అని ఒక వైష్ణ కథ వ్రాశారు. నీలకంఠం కథలు అనే శీర్షికతో శివశంకర శాస్త్రిగారు జ్వాలలో వ్రాస్తూన్న కథలలో ఇదిఒకటి. శివశంకరుడన్నా నీలకంఠుడన్నా ఒకటే అర్థంస్ఫురిస్తుంది. శివశంకరశాస్త్రిగారే నీలకంఠం నామంతో ఈ కథల్లో కనిపిస్తున్నారేమోనని ఆశబ్దాల ఏకార్థస్ఫురణను బట్టి కొందరికి అనుమానం కలగడానికి అవకాశం ఉంది. కాని ఆ అనుమానం నిజానికి చాలా దూరమైందిగా ఉంటుందని నేను చెప్పగలను. శివశంకరశాస్త్రిగారిని నేను ఎప్పుడూ మరాయి తొడుక్కుని ఉండగా చూడలేదు. కాని ఈ కథలో నీలకంఠం మరాయితొడిగాడు. వైష్ణవప్రేమవల్ల దాన్ని తనుపుకున్నాడు కూడాను. శివశంకరశాస్త్రిగారు బిళ్లగోచీ పంచెకట్టు కడతారు. అదీగాక నీలకంఠం వైష్ణప్రేమకు శివశంకరశాస్త్రిగారి వైష్ణవప్రేమకు ఎక్కడా పోలికేలేదు. నగ్నురాలై స్నానంచేస్తూన్న 'ఆచారికీ ఔరత్'ను కిటికీగుండా చూచి కుంకుడుగింజలతో కొట్టి కిటికీ ఈవతలి తన్ను ఆమె గుర్తించేటట్లు చేసికొన్న నీలకంఠుని—యాపిల్‌పండు ఇచ్చే నెపంతో ఆచారికీ ఔరత్‌ను ముద్దుపెట్టుకుని కౌగలించుకొన్న (ఆచారికీ ఔరత్‌లోని) నీలకంఠుని తుచ్ఛమయిన, లోకస్థమైన, అంతలో ఫలము లభ్యమయిన వైష్ణవప్రేమకూ పొందరాని దానిని పొందవలెననే భక్తుని ఆవేదనవంటి ఆవేదనను కనపరచే శివశంకరశాస్త్రిగారి ఉన్నతమయిన, విద్యాపూర్ణమయిన, లభ్యమయినట్లోకసారి కనిపించికూడా ఎప్పటికీ ఫలము లభ్యముకాని 'హృదయేశ్వరి'సంబంధమగు వైష్ణవప్రేమకూ సాదృశ్యమేది? కాని అట్టి శివశంకరశాస్త్రిగారు ఇట్టి నీలకంఠున్ని ఎట్లు సృష్టించారా అనే విషయం భావనాశ్చర్యమయింది.

—వి. విశ్వనాథము, బి. ఏ.